ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY








బుధవారం 08 జూలై 2026 | Wednesday 08 July 2026 | హైదరాబాద్ Hyderabad | ⇨ పేజీలు: 12+12 | ⇨ వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

సంపుటి: 28 సంచిక: 94 | Vol.No 28 Issue No .94 | www.visionandhra.in


## గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

- 2008 వరుస బాంబు పేలుళ్ల కేసులో 38మందికి ఉరి
- మరో 11 మందికి యావజ్జీవ కారాగార శిక్ష విధింపు
- ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించిన హైకోర్టు



అహ్మదాబాద్,జూలై7 : దేశాన్ని ఉలిక్కిపడేలా చేసిన 2008 అహ్మదాబాద్ వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు 2022లో విధించిన శిక్షలను సమర్థిస్తూ 38 మంది దోషులకు ఉరిశిక్షను, మరో

మిగతా2లో..

## రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా అడుగులు

- ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే లక్ష్యం
- పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజేషన్
- సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేరేందుకు ఉపయుక్తం
- కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఆన్‌లైన్‌లోనే జీతాలు
- ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు



హైదరాబాద్,జూలై7 : పరిపాలనలో మరింత పారదర్శకతకు డిజిటల్ గవర్నెన్స్ దిశగా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని ఆదేశించారు. మంగళవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్ లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో పరిపాలన వ్యవస్థను పూర్తి స్థాయిలో డిజిటలైజ్ చేస్తూ 'డిజిటల్ గవర్నెన్స్' దిశగా చట్టాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు సంక్షేమ పథకాలను నేరుగా లబ్దిదారులకు చేర్చేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్

మిగతా2లో..

## ధరణి పోర్టల్‌లో భూ అక్రమాలు

- సమగ్ర దర్యాప్తు దిశగా ప్రభుత్వం చర్యలు
- సిట్ వేసే యోచనలో ప్రభుత్వం

హైదరాబాద్,జూలై7 : ధరణి పోర్టల్‌లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. భూ రికార్డులు, రిజిస్ట్రేషన్లలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇందుకోసం విజిలెన్స్ విభాగం ద్వారా

మిగతా2లో..

## కడియంపై క్రమశిక్షణ చర్య తీసుకోవాల్సిందే

- నాకు తెలియకుండా ఎలా సమీక్షలు చేపడతారు
- మంత్రిగా తన శాఖలో జోక్యం చేసుకోవడం ఏమిటి
- సీఎం రేవంత్‌కు లేఖ రాసిన మంత్రి కొండా సురేఖ



హైదరాబాద్,జూలై7 :స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీరుపై దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న నన్ను , నా కార్యాలయాన్ని పూర్తిగా విస్మరించి, ఎలాంటి ముందస్తు

మిగతా2లో..

## సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు

- 182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశం
- సింగరేణికి రూ.75 వేల కోట్ల ఆదాయం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



న్యూఢిల్లీ,జూలై7 : తాడిచర్ల-2 బొగ్గు గనుల్ని సింగరేణికి ఇవ్వడానికి ప్రధాని మోదీ అంగీకరించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఆ బొగ్గు గనులకు సంబంధించి ఈ రోజే తాను సంతకం చేసినట్లు చెప్పారు. తాడిచర్ల-2లో 182 మి.టన్నుల బొగ్గు ఉత్పత్తికి అవకాశముందన్నారు. మరో 40-50 ఏళ్లపాటు బొగ్గు ఉత్పత్తి చేయొచ్చన్నారు. 'ఇతర

మిగతా2లో..

## 10న రైతు ఆశీర్వాద సభ

- రద్దయిన చోటనే తిరిగి నిర్వహణ
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తుమ్మల



ఖమ్మం,జూలై7 : గత నెలలో రద్దయిన రైతు ఆశీర్వాద సభను తిరిగి ఈ నెల 10న నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణలో రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం మరో భారీ బహిరంగ సభకు

మిగతా2లో..

## బిఎల్‌వోలను బెదిరిస్తున్న ఎంఐఎం

- సిఇవోకు ఫిర్యాదు చేసిన బిజెపి నేతలు



మిగతా2లో..

## కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ

- కెసిఆర్ సరేనంటే..ఎంత సమయమైనా కేటాయిస్తాం
- కెసిఆర్ వాదన సరైనదయితే ..ప్రాజెక్ట్ నిర్వహణ అప్పగిస్తాం
- కాళేశ్వరం కమీషన్ల ప్రాజెక్ట్ అన్న సిఎం రేవంత్ రెడ్డి
- నిపుణుల సలహాలు పక్కన పెట్టడంతోనే సమస్యలు
- కెటిఆర్, హరీష్ రావులు ఆర్థిక ఉగ్రవాదులని విమర్శలు
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో సిఎం రేవంత్ విమర్శలు



హైదరాబాద్,జూలై7 : కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్‌పై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిప్పులు చెరిగారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై మాజీ సీఎం కేసీఆర్‌కు ఓపెన్ ఛాలెంజ్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడు లెటర్ రాస్తే.. అప్పుడే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ పెడదామని, ప్రతిపక్ష నేతగా కేసీఆర్ ఎంత సమయం మాట్లాడాలనుకుంటే అంత

## హిమాన్షు ముక్కుకు గాయం

- ఆస్పత్రికి వచ్చిన కెటిఆర్, కెసిఆర్



హైదరాబాద్,జూలై7 : తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ మనవడు, కేటీఆర్ తనయుడు హిమాన్షుకు స్వల్ప గాయమైంది. నిన్న ఆటలాడుతుండగా అతడి ముక్కుకు గాయమైంది. ప్రస్తుతం హైదరాబాద్ ఏఐజీ

మిగతా2లో..

## పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

- ఈసి నోటీసులపై ఢిల్లీ హైకోర్టులో కవిత పిటిషన్



న్యూఢిల్లీ,జూలై7 :పార్టీ పేరు మార్చుకోవాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులపై కల్వకుంట్ల కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. పార్టీ ఖరారుపై కల్వకుంట్ల కవిత దిల్లీ హైకోర్టులో న్యాయ పోరాటానికి దిగారు. తెలంగాణ రక్షణ సమితి పేరు తన పార్టీకి కేటాయించాలని

మిగతా2లో..



## భూములు ఇచ్చిన రైతులకు 40వేల కౌలు

- పదేళ్లపాటు అమలు చేయాలని నిర్ణయం
- జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి రుణమాఫీ అమలు
- ల్యాండ్ పూలింగ్‌కు అంగీకరించని వారిపై భూసేకరణ కత్తి
- ఇనాం భూముల కోసం దేవాదాయశాఖకు రూ.159 కోట్లు చెల్లింపు
- చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశం లో కీలక నిర్ణయాలు



అమరావతి,జూలై7 : సీఆర్డీఏ సమావేశంలో ఏపీ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. 2024 జూన్ నుంచి భూములిచ్చిన వారికి రూ.40వేలు కౌలు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. భూములు ఇచ్చినప్పటి నుంచి 10ఏళ్లపాటు ఇది అమలు కానుంది. గ్రామకంఠాల్లో భూమి కోల్పోతున్న వారికి ఏటా రూ.10వేలు ఇచ్చేందుకు అనుమతిని ఇచ్చింది. కొత్తగా పూలింగ్ జరిగే గ్రామాల రైతులకు

మిగతా2లో..

## సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రా పుట్టినిల్లు

- హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దాం
- మార్కెట్ సౌకర్యం కల్పిస్తే ఉపాధితో పాటు, కళ సజీవంగా ఉంటుంది
- దేశ సంస్కృతి, సంప్రదాయాల కోసం హస్తకళను కాపాడాలి
- వారసత్వాన్ని సజీవంగా కొనసాగిస్తున్న తీరు అభినందనీయం
- కళాకారుల ఆరోగ్య రక్షణకు చర్యలు తీసుకోవాలి
- హస్తకళా మహోత్సవంను సందర్శించిన డిప్యూటి సిఎం పవన్






విజయవాడ,జూలై7 : ఏపీ హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మార్కెటింగ్ ఇంకా పెంచగలిగితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. విజయవాడ అంబేద్కర్ కళా వేదికలో నిర్వహించిన ఏపీ హస్తకళా మహోత్సవానికి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. హస్తకళాకారులను అనారోగ్య సమస్యల నుంచి కాపాడాలన్నారు. తొలుత అందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలని, హస్తకళాకారుల పిల్లలు చదువుకునేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. వంశపారం పర్యంగా వచ్చిన కళను ముందుకు తీసుకెళ్లడం కూడా ముఖ్యమే. హస్తకళా రంగాలు భారతదేశ మూలాలు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగాలంటే హస్తకళను, చేనేతను

మిగతా2లో..

## రాజ్యాధికారంతోనే విశ్వకర్మల మనుగడ

- రాష్ట్ర జనాభాలో నాలుగైదు శాతం ఉన్నా విస్మరిస్తారా..?
- మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదన్ చారి ధ్వజం
- రౌండ్ టేబుల్ సమావేశంలో 6 తీర్మానాలు ఆమోదం




హైదరాబాద్ జూలై 7, (విజన్ ఆంధ్ర) : విశ్వబ్రాహ్మణులు ఒక శక్తిగా ఎదగాలని, రాజ్యాధికారంలో వాటా చేజిక్కించుకోవాలని శాసనమండలిలో ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనా చారి పిలుపునిచ్చారు. రాజ్యాధికారంతోనే ఏ కులానికైనా గుర్తింపు,

మిగతా2లో..

## అయోధ్య చోరీలో కీలక ఆధారాలు సేకరణ

- కరెన్సీని జేబులు, బూట్లల్లో దాచుకుని తరలింపు
- 70సార్లు దొంగతనం..చూసీచూడనట్లుగా అధికారులు
- సిసి టివి ఫుటేజ్ ఆధారాలను సుకరించిన సిట్

అయోధ్య,జూలై7 : అయోధ్య రామ మందిర విరాళాల చోరీ కేసులో కీలక ఆధారాలను సేకరించినట్లు సిట్ వెల్లడించింది. ఈ విషయంపై యూపీ ప్రభుత్వానికి నివేదిక అందించింది. ఏప్రిల్ 27 నుంచి జూన్ 5 వరకు విరాళాల లెక్కింపు చేపట్టిన వ్యక్తుల్లో కొందరు డబ్బులు అపహరించినట్లు సీసీటీవీ దృశ్యాల్లో తేలిందని పేర్కొంది. ఈ 39 రోజుల్లో లెక్కించే సమయంలో కొంతమంది సిబ్బంది కరెన్సీ నోట్ల కట్టలను, చిల్లరను తమ దుస్తులు, జేబులు, బూట్లలో

మిగతా2లో..

## వేగంగా భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు

- నిర్ణీత సమయానికి జిఎంఆర్ సంస్థ నిర్మాణాలు
- ప్రధాని చేతుల మీదుగా ఎయిర్‌పోర్ట్ ప్రారంభం
- పనులపై సమీక్షించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

విజయనగరం,జూలై7 : భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను వేగంగా పూర్తి చేశామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. మంగళవారం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం తుది మెరుగుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జీఎంఆర్‌తో కలిసి బ్రహ్మాండమైన ఎయిర్‌పోర్టును నిర్మించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇక్కడికి

మిగతా2లో..

## దక్షిణ కొరియాలో కొనసాగుతున్న లోకేశ్ పర్యటన

- వివిధ కంపెనీలతో పెట్టుబడులపై విస్తృతంగా చర్చలు
- హ్యుందాయ్, మోబిస్ ఉన్నతస్థాయి ప్రతినిధులతో లోకేశ్ భేటీ



అమరావతి,జూలై7 :ఏపీకి పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా దక్షిణ కొరియాలో మంత్రి నారా లోకేశ్ పర్యటన కొనసాగుతోంది. ఇందులో భాగంగా ప్రముఖ పారిశ్రామికవేత్తలతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు.హ్యుందాయ్ మోబిస్ ఉన్నతస్థాయి ప్రతినిధులతో లోకేశ్ భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈవీ సెమీకండక్టర్స్ హబ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖలో

మిగతా2లో..

## అయోధ్య చోరీలో కీలక ఆధారాలు సేకరణ

దాచిపెట్టినట్లు సీసీటీవీ రికార్డుల్లో కనిపించిందని తెలిపింది. డబ్బును సిబ్బంది దొంగలిస్తున్నట్లు చూసిన కొందరు అధికారులు కూడా వారిని ఆపడానికి ప్రయత్నించలేదని సిట్ పేర్కొంది. నిందితులు దాదాపు 70 సార్లు దొంగతనాలకు పాల్పడినట్లు అధికారులు వెల్లడించారు. దర్యాప్తులో భాగంగా ట్రస్ట్ సభ్యులు, బ్యాంకు అధికారులు, భద్రతా సిబ్బంది, లెక్కింపు సిబ్బందిని విచారించామన్నారు. వారి వాంగ్మూలాల ప్రకారం ఏప్రిల్ 27కి ముందు కూడా విరాళాల చోరీ జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పాత సీసీటీవీ ఫుటేజ్ అందుబాటులో లేకపోవడంతో ఈ విషయంలో ఆధారాలు సేకరించడం సవాలుగా మారిందన్నారు. మరిన్ని వివరాలు తెలుసుకునేందుకు ఐదేళ్ల ఖాతాలను రీఆడిట్ చేస్తున్నామని.. బ్యాంకు రికార్డులు, విరాళాల పత్రాలు, ఆలయ నిర్మాణ వ్యయాలు, బంగారం, వెండి వస్తువులతో సహా అన్ని ఆర్థిక లావాదేవీల రికార్డులు పరిశీలిస్తున్నామని తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఆలయంలో భద్రతా తనిఖీలు, బయోమెట్రిక్ హాజరు, డిజిటల్ పరికరాలపై పరిమితులు, సీసీటీవీ పర్యవేక్షణ వంటి చర్యల్లో అనేక లోపాలు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ లోపాలను వినియోగించుకుని నిందితులు చోరీకి పాల్పడ్డారని తెలిపారు. విలువైన కానుకల నిర్వహణ, డాక్యుమెంటేషన్, తూకం వేయడం వంటి వాటిల్లోనూ పలు విధానపరమైన లోపాలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ కేసులో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణెశ్‌ష్ పాండే, రామశంకర్ మిశ్రాలకు ప్రమేయం ఉన్నట్లు నిర్ధరించారు. సీసీటీవీ దృశ్యాల్లో అవినాష్ శుక్లా, మనీష్ కుమార్ యాదవ్‌లు పలుమార్లు నగదు, నగలను అపహరిస్తున్నట్లు రికార్డ్ అయ్యిందని పేర్కొన్నారు.

## వేగంగా భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు

వచ్చారని.. అనుకున్న సమయానికంటే ముందుగానే నిర్మాణం చేపట్టాలని ఆదేశించారని అన్నారు. ఆ ఆదేశాలు మేరకు అనుకున్న సమయానికే జీఎంఆర్ సంస్థ ఎయిర్‌పోర్టును నిర్మించిందని చెప్పారు. ఎయిరో డ్రో లైసెన్స్ కూడా వచ్చిందని కేంద్ర మంత్రి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. ఎయిర్‌పోర్టు ప్రారంభమైన వారం తర్వాత ఆపరేషన్స్ నిర్వహిస్తామన్నారు. మోదీ షెడ్యూల్ ఖరారైన తర్వాత తేదీ ప్రకటిస్తామని కేంద్ర మంత్రి వెల్లడించారు. విశాఖ ఎయిర్‌పోర్టు కార్యకలాపాలను భోగాపురానికి తరలిస్తామని చెప్పారు. రాబోయే రోజుల్లో 4 కోట్ల మంది ప్రయాణించే విధంగా టెర్మినల్ నిర్మాణం జరుగుతుందన్నారు. 78,000 చదరపు మీటర్ల మేర టెర్మినల్ బిల్డింగ్ నిర్మించామని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు.. దేశంలోనే బెస్ట్ ఎయిర్‌పోర్టు డిజైన్‌గా ఉందని కితాబిస్తున్నారని అన్నారు. ఉత్తరాంధ్ర కళలు, సాంప్రదాయాన్ని ఉట్టిపడేలా ఇంటీరియర్ డిజైన్ చేపట్టినట్లు చెప్పారు. దేశంలోనే అత్యంత బెస్ట్ ఎయిర్‌పోర్ట్‌గా భోగాపురం నిలవనుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## 10న రైతు ఆశీర్వాద సభ

సిద్ధమైంది. 10వ తేదీన ఖమ్మం జిల్లా జగన్నాథపురంలో ప్రతిష్టాత్మక 'రైతు ఆశీర్వాద సభ' నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్న ఈ భారీ సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సభాస్థలాన్ని స్వయంగా పరిశీలించారు.. సభకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులను రికార్డ్ స్థాయిలో అందజేసిందని కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం ఏడు రోజుల్లోనే ఏకంగా 7,491 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని ఆయన స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఇదే నిదర్శనమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితులు తీవ్రమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు జిల్లాల వారీగా రూపొందించిన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు సిద్ధం కావాలన్నారు. ఎల్‌నినోపై అగ్రివర్సిటీ చేసిన సూచనలు రైతులకు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే 'తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం'తో రైతులకు వాట్సప్ ద్వారా కచ్చితమైన, సమయానుకూలమైన వాతావరణ సమాచారాన్ని అమలు చేస్తున్నాం. పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ ప్రణాళికలను వెంటనే అమలు చేయాలని తుమ్మల సూచించారు.

## బిఎల్‌వోలను బెదిరిస్తున్న ఎంఐఎం

హైదరాబాద్,జూలై7 : సర్ ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సీఈవోను బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు కోరారు. ఆయన ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని ఆ పార్టీ బృందం కలిసింది. ఈ సందర్భంగా సర్ ఖీ విషయంలో ఎంఐఎం పార్టీ వ్యవహరిస్తున్న తీరు సరిగ్గా లేదని రాంచందర్ రావు ఫిర్యాదు చేశారు. అనంతరం బీజేపీ తెలంగాణ చీఫ్ మీడియాతో మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో బీఎల్‌వోలను ఎంఐఎం, కాంగ్రెస్ నేతలు బెదిరిస్తున్నారని తెలిపారు. ఇంటింటికీ వెళ్లకుండా బీఎల్ఓలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పలువురు ఓటర్లకు ఫారాలు అందడం లేదని రాంచందర్ రావు తెలిపారు. తెలుగు ఫారాలతో ఇతర రాష్ట్రాల ఓటర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. హైదరాబాదే కాకుండా అవసరమైన అన్ని ప్రాంతాల్లో ఇంగ్లీషు ఫారాలు అందించాలని కోరినట్లు తెలిపారు. ఓటర్ల జాబితా లోపాలపై చర్యలు తీసుకోవాలని సీఈవోను కోరినట్లు రాంచందర్‌రావు పేర్కొన్నారు.

## పార్టీ పేరుమార్పుపై న్యాయ పోరాటం

కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. తమ పార్టీ పేరును ఖరారు చేయడానికి ఎన్నికల సంఘం అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ జూన్ 23న లేఖ పంపిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. తమకు ప్రత్యామ్నాయమైన పార్టీ పేర్లు చెప్పాలి తప్ప.. టీఆర్ఎస్ వచ్చే విధంగా ఎలాంటి పేరు ఉండొద్దని ఈసీ తెలిపిందని కోర్టు దృష్టికి తెచ్చారు. తెలంగాణ రక్షణ సేన పేరు టీఆర్ఎస్‌కు అర్థం వచ్చేలా ఉందని, ఈసీ నోటీసుకు సరైన రీతిలో సమాధానం చెప్పాలని దిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే ఈసీకి సమాధానాలు చెప్పాకే కోర్టుకు రావాలని కవితకు సూచించింది. పిటిషన్ విచారణకు చేపట్టడమంటే ఈసీ విధుల్లో జోక్యం చేసుకోవడమేనని న్యాయస్థానం అభిప్రాయపడింది.

## హిమాన్ష ముక్కుకు గాయం

ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు వెంటనే ఆస్పత్రికి చేరుకోగా.. సిద్దిపేటలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి బయల్దేరి కేసీఆర్ కూడా ఆస్పత్రికి వెళ్లారు. మనవడిని పరామర్శించి.. అతడి ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు తాను కోలుకుంటున్నట్లు హిమాన్ష ఎక్స్ వేదికగా వెల్లడించారు. చిన్నపాటి గాయమవ్వడంతో గత రాత్రి ఆస్పత్రిలో చేరానని తెలిపారు. పూర్తిగా కోలుకునేందుకు కొంత విశాంత్రి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు హిమాన్ష పేర్కొన్నారు. ఈ ఘటనపై కేటీఆర్ కూడా ఎక్స్ వేదిగా స్పందించారు. సోమవారం సాయంత్రం హిమాన్షుకు చిన్నపాటి గాయమైందని, ప్రస్తుతం చికిత్స కొనసాగుతున్నట్లు తెలిపారు. కొన్ని రోజుల్లోనే పూర్తిగా కోలుకుంటాడని అన్నారు. హిమాన్ష ఆరోగ్యంపై ఆరా తీసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## దక్షిణ కొరియాలో కొనసాగుతున్న లోకేశ్ పర్యటన

హ్యుందాయ్ మోబిస్ ఆర్ అండ్ డీ/ఇంజనీరింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. తిరుపతి,అనంతపురం ప్రాంతంలో ఈవీ కాంపోనెంట్స్, బ్యాటరీ సిస్టమ్స్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదన చేశారు. ఐఐటీ తిరుపతితో కలిసి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అటానమస్ డ్రైవింగ్, ఆడాస్, స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశోధనలకు హ్యుందాయ్ మోబిస్‌తో లోకేశ్ భాగస్వామ్యం కోరారు. అనంతపురాన్ని ఆటోమొబైల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని హ్యుందాయ్ మోబిస్‌కు వినతి చేశారు. టైర్-1 ఆటోమొబైల్ సరఫరాదారుల సమావేశాన్ని ఏపీలో నిర్వహించాలని ప్రతిపాదించారు. హ్యుందాయ్ మోబిస్ విస్తరణకు ఏపీ ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని లోకేశ్ స్పష్టం చేశారు. అనంతపురం యూనిట్‌లో హ్యుందాయ్, కియా కోసం కీలక మాడ్యూల్స్ తయారు చేయనున్నట్లు హ్యుందాయ్ మోబిస్ తెలిపింది. ఏపీ ప్రతిపాదనలపై ఉన్నతస్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. అపాక్ట్ సీఈవో సియాంగ్ డాంగ్ లీతో మంత్రి లోకేశ్ సమావేశ మయ్యారు. ఓఎస్ఎటి సెమీకండక్టర్ నైపుణ్యాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ఎపిలో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని అపాక్ట్‌కు ప్రతిపాదన చేశారు. ఇతర ఓఎస్ఎటి కంపెనీలను ఏపీకి తీసుకురావాలని అపాక్ట్‌ను కోరారు. హనా మైక్రాన్ వంటి సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అపాక్ట్ విస్తరణకు పూర్తి సహకారం అందిస్తామని మంత్రి చెప్పారు. విశాఖ ప్రాజెక్టు ఏపీకి ప్రతిష్మాత్మక విజయమని.. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని అపాక్ట్ సీఈవో వెల్లడించారు. విశాఖలో యూనిట్ నిర్మాణం త్వరలో ప్రారంభంకానుంది. రూ.468 కోట్ల పెట్టుబడితో విశాఖలో సెమీకండక్టర్ యూనిట్ రానుంది. ఏడాదికి 9.6 కోట్ల పరికరాల తయారీ లక్ష్యంతో విశాఖ యూనిట్ పనిచేయనుంది.

## భూములు ఇచ్చిన రైతులకు 40వేల కౌలు

రుణమాఫీ చేయాలని నిర్ణయించింది. ఈ ఏడాది జనవరి 6లోగా రుణం తీసుకున్న వారికి ఈ మాఫీ అమలవుతుంది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన 63వ సీఆర్డీఏ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రెండో దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతుల గురించి చర్చించారు. రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, మంత్రుల కమిటీ సిఫారసు మేరకు వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై చర్చించారు. ఇనాం భూముల కోసం దేవాదాయశాఖకు రూ.159 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అమరావతి 25 టౌన్‌షిప్‌ల్లో ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ఉండేలా చూడాలని సీఎం దిశానిర్దేశం చేశారు. అనంతరం మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. రాత్రిలోగా భూములివ్వనివారికి రేపు భూ సేకరణ అమలు చేస్తామన్నారు. ఇప్పటికే ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్ 2.5 ఎకరాలకు అమలు చేస్తున్నామని తెలిపారు. రాజధాని అమరావతి అభివృద్ధి, రెండో దశ ల్యాండ్ పూలింగ్, రైతులకు యాన్యుటీ, వ్యవసాయ రుణమాఫీ, ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, వివిధ సంస్థలకు భూ కేటాయింపులు సహా తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపినట్లు నారాయణ వివరించారు. సమావేశం అనంతరం మీడియాకు మంత్రి నారాయణ వివరాలు వెల్లడించారు. అదేవిధంగా ప్రతి ఏడాది జరీబు భూములకు ఎకరానికి రూ.5 వేల చొప్పున, మెట్ట భూములకు ఎకరానికి రూ.3 వేల చొప్పున యాన్యుటీ పెంపునకూ అథారిటీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. గ్రామ కంఠాల్లో భూములు కోల్పోయిన వారికి ఏడాదికి రూ.10 వేల చొప్పున చెల్లించాలని నిర్ణయించినట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. కొత్తగా ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో భూములు ఇచ్చే రైతు కుటుంబాలకు వ్యవసాయ రుణమాఫీ అమలు చేయాలని అథారిటీ నిర్ణయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు. ల్యాండ్ పూలింగ్‌కు ఇంకా భూములు ఇవ్వని రైతులకు మంగళవారం రాత్రి వరకు అవకాశం కల్పిస్తున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ఆ తర్వాతా భూములు ఇవ్వకపోతే బుధవారం నుంచి భూసేకరణ ప్రక్రియను అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే జారీ చేసిన ల్యాండ్ అక్విజిషన్ నోటిఫికేషన్‌ను 2.5 ఎకరాల భూమికీ అమలు చేయనున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు.

## గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు

11 మందికి యావజ్జీవ కారాగార శిక్షను హైకోర్టు మంగళవారం ఖరారు చేసింది. ఈ కేసులో దాఖలైన అప్పీళ్లపై సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయస్థానం ఈ తీర్పును వెలువరించింది 2008, జులై 26న అహ్మదాబాద్‌లో కేవలం 70 నిమిషాల వ్యవధిలో 21 చోట్ల బాంబు దాడులతో ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో 56 మంది మరణించగా, 246 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఆ తర్వాత సూరత్‌లో పేలని బాంబులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 78 మందిపై విచారణ జరగగా, 2022లో ప్రత్యేక కోర్టు 49 మందిని దోషులుగా తేల్చి, 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఉరిశిక్ష అమలుకు హైకోర్టు ధ్రువీకరణ తప్పనిసరి కావడంతో రాష్ట్ర ప్రభుత్వం శిక్షల నిర్ధారణ కోసం హైకోర్టును ఆశ్రయించింది. జస్టిస్ అల్పేష్ కొగ్జే, జస్టిస్ సమీర్ దవేలతో కూడిన గుజరాత్ హైకోర్టు ధర్మాసనం గత రెండున్నరేళ్లుగా దాదాపు 248 సార్లు అప్పీళ్లపై

## సింగరేణికి తాడిచర్ల-2 బొగ్గు గనులు

రాష్ట్రాల్లో సింగరేణి సంస్థ బొగ్గు వేలంలో పాల్గొనేలా చేస్తున్నాం. నైని కోల్ బ్లాక్‌లో 340 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఇవి దాదాపు 30-35 ఏళ్లు సరిపోతాయి. నైని కోల్ బ్లాక్‌లో ఏటా 10 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి కోసం సింగరేణికి అవకాశం కల్పించాం. బొగ్గు ఉత్పత్తితో సింగరేణికి రూ.75 వేల కోట్ల రెవెన్యూ వచ్చే అవకాశం ఉంది. తాడిచర్ల -2 బొగ్గుగనులను సింగరేణికి ఇవ్వాలని గతంలో చాలా మంది సీఎంలు లేఖలు రాసినా ప్రయోజనం లేకపోయింది. తన వంతుగా సింగరేణికి అన్ని రకాలుగా అండగా ఉంటున్నా' అని కిషన్‌రెడ్డి తెలిపారు. దేశాభివృద్ధి విషయంలో సహకార సమాఖ్య

## కాళేశ్వరంపై అసెంబ్లీలో ప్రత్యేక చర్చ

సమయం ఇస్తామని స్పష్టం చేశారు. ఒకవేళ కేసీఆర్ వాదనలో బలముందని రుజువైతే.. రాబోయే మూడేళ్ల పాటు కాళేశ్వరం ప్రాజెక్టు రిపేర్ల బాధ్యతను, మేజర్ కాంట్రాక్ట్‌ను కేసీఆర్‌కే అప్పగిస్తామని.. ఆయన ఇష్టం వచ్చిన వాళ్లకు ఆ కాంట్రాక్ట్ ఇచ్చుకోవచ్చంటూ సంచలన సవాల్ చేశారు. బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌లను 'ఆర్థిక ఉగ్రవాదులుగా రేవంత్ రెడ్డి అభివర్ణించారు. కేసీఆర్ కట్టిన ఇతర ప్రాజెక్టులను, ప్రజాభవన్, సెక్రటేరియట్లను తాము వాడుతున్నామని.. కానీ, కాళేశ్వరం విషయంలో గత ప్రభుత్వం ఏమీ చేయకపోవడం వల్లే అది నిరూపయోగంగా మారిందని మండిపడ్డారు. ప్రస్తుతానికి బ్యారేజీల్లో నీళ్లు నింపి ఎత్తిపోయాలని ఏ ఎక్స్‌పర్ట్స్ కమిటీ కూడా చెప్పలేదని రేవంత్ గుర్తుచేశారు. ఒకవేళ బలవంతంగా నీళ్లు నింపితే బ్యారేజీలు పూర్తిగా కూలిపోతాయని, భద్రాచలం నగరం మునిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి చుక్క నీరు తీసుకోకుండానే.. తాము అధికారంలోకి వచ్చాకవేల కోట్ల అప్పులు కట్టాల్సి వచ్చిందని రేవంత్ ఆవేదన వ్యక్తం చేశారు. నిపుణుల కంటే ఎవరు మంచి సలహాలు ఇచ్చినా తీసుకుంటామని, కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదని ఆయన అన్నారు. ప్రజా సొమ్ము గోదారి పాలు కాకుండా కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ లోపాలు, ప్రస్తుత పరిస్థితులు, ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణంలో అవినీతి వంటి అంశాలను ప్రజాభవన్ వేదికగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆనాడే రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీ అభ్యంతరం తెలిపిందని ఆయన

## సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రా పుట్టినిల్లు

కాపాడుకోవాల్సి ఉందన్నారు. ఒక జాతి గొప్పతనం.. నిర్మించిన భవనాల్లో కాదు.. కళాకారుల్లో కనిపిస్తుంది. కళాకారుల ప్రతిభ.. వారి కష్టాన్ని గుర్తించడానికే ఇక్కడికి వచ్చాను. సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లు. అద్భుత కళల వెనుక లక్షల మంది కళాకారుల కృషి ఉంది. వస్తువుల తయారీ మాత్రమే కాదు.. వారసత్వాన్నీ సజీవంగా ఉంచుతున్నారు. తరతరాల సంప్రదాయాన్ని కళాకారులు కాపాడుతున్నారని అభినందించారు.రాష్ట్రంలో 2 లక్షల మందికిపైగా కళాకారులున్నారు. గ్లోబల్ మార్కెట్‌కు అనుసంధానం చేస్తూ హస్తకళా రంగానికి కొత్త దశను తీసుకొస్తాం. వదిలేసిన వస్త్రాలు కూడా వ్యర్థం కాకుండా వస్తువుల తయారీ చూస్తున్నాం. డబ్బు సంపాదనే కాదు.. పర్యావరణ పరిరక్షణ కూడా ప్రాముఖ్యంగా తీసుకుంటున్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హస్తకళా రంగం కూడా అభివృద్ధి చెందాలి. మారుమూల గ్రామంలోని కళాకారుడి కృషి.. ప్రపంచానికి చేరాలనేదే ప్రభుత్వ లక్ష్యం. వోకల్ ఫర్ లోకల్ మాత్రమే కాదు.. లోకల్ టు గ్లోబల్ లక్ష్యంగా పని చేద్దామని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఏపీ పుట్టినిల్లు అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఒక జాతి గొప్పతనం నిర్మించిన భవనాల్లో కాదని, కళాకారుల్లో కనిపిస్తుందని అభివర్ణించారు. కళాకారుల అద్భుత ప్రతిభను, వారి కష్టాన్ని గుర్తించడానికి తాను

## రాజ్యాధికారంతోనే విశ్వకర్మల మనుగడ

మనుగడ ఉంటాయన్నారు. ఐదు వృత్తులను వేర్వేరు కులాలుగా చూపెట్టి... విశ్వకర్మ జాతి జనాభాను తక్కువ చేసి చూపెట్టడం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో కేవలం రెండు శాతం ఓట్లే అధికారాన్ని తారుమారు చేస్తున్న తరుణంలో రాష్ట్ర జనాభాలో 4-5 శాతం ఉండే విశ్వబ్రాహ్మణులు ఎన్నికల్లో కీలకంగా మారతారని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో విశ్వకర్మ కమ్యూనిటీ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ తొలి శాసనసభాపతి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు తంగెళ్లపల్లి రవి హాజరై... విశ్వబ్రాహ్మణుల కులం గుర్తింపు, ఐక్యత గురించి మాట్లాడారు. గ్లోబల్ విశ్వకర్మ ఎన్ఆర్ఐ ప్రతినిధి చైతన్య కూడా పాల్గొని... తన సామాజిక వర్గం అభ్యున్నతికి తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తానన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో భాగంగా ముఖ్యమైన ఎజెండాగా ఆరు తీర్మానాలను ప్రవేశపెట్టి, ఆమోదించుకున్నారు. ఇందులో ప్రధాన తీర్మానంగా ఐదు వృత్తులైనా... ఒక్కటే కులం... అదే విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణుల కులం అని చాటిచెప్పారు. విశ్వకర్మల వృత్తులను భావితరాలకు చాటిచెప్పేందుకు మ్యూజియం ఏర్పాటుకు ప్రభుత్వం సహకరించాలని, వృత్తులను పరిరక్షించాలని, ఆర్థికంగా అండగా నిలవాలని తీర్మానాలు ఆమోదించారు. చివరగా తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ పేరుతో అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. పాలకులు తమ తప్పులను సరిదిద్దుకోని పక్షంలో, పోరాటానికి సన్నద్ధమవ్వాలని, న్యాయమైన డిమాండ్ల సాధనకు రాజకీయ నాయకులను, ప్రభుత్వాన్ని కలిసి ఒత్తిడి చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రసంగించిన వక్తలంతా ముక్తకంఠంతో నినదించారు. వచ్చేనెలలో మూడో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో జర్నలిస్ట్ మరియు పారిశ్రామిక వేత్త దేవరకొండ కాళిదాస్, విశ్వకర్మ వేదిక వ్యవస్థాపకులు ఆడ్లూరి రవీంద్రా చారి, రచయితల సంఘం నుంచి గాజోజు నాగభూషణం, కుందారం గణేశాచారి, ఉపేంద్రాచారి, దుబ్బాక కిషన్‌రావు, ప్రముఖ ఆంకోలాజిస్ట్ డాక్టర్ చింతమడక సాయిరాం, వేదాస్ అధ్యక్షుడు కుమారస్వామి, సదాశ్రీ తదితరులు పాల్గొని విశ్వబ్రాహ్మణులు ఐక్యమత్యం కావాలన్నారు.

విచారణ జరిపి మంగళవారం తుది తీర్పు వెల్లడించింది. . 38 మందికి మరణశిక్ష, 11 మందికి జీవితఖైదు విధిస్తూ 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సమర్థించింది. కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేసింది. ఈ పేలుళ్లలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, గాయపడినవారికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని గుజరాత్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. మార్చి 31, 2027లోగా పరిహార చెల్లింపులు పూర్తి చేయాలని పేర్కొంది. నిషేధిత ఇండియన్ ముజాహిదీన్ , సిమి ఉగ్రవాద సంస్థల కుట్రను ప్రాసిక్యూషన్ నిరూపించగలిగింది. దేశద్రోహం, హత్య నేరాలతో పాటు కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద దోషులుగా న్యాయస్థానం తేల్చింది. కాగా, దేశ చరిత్రలోనే ఒకే కేసులో ఇంతపెద్ద సంఖ్యలో 38 మందికి ఉరిశిక్షలు ఖరారు కావడం ఇదే ప్రథమం.2008 జులై 26న అహ్మదాబాద్‌లో 21 చోట్ల జరిగిన వరుస పేలుళ్లలో 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 246 మంది గాయపడ్డారు. నగరవ్యాప్తంగా ఆసుపత్రులు సహా పలుచోట్ల

విధానంతో అన్ని రాష్ట్రాలు కలిసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సింగరేణి కోల్ కాలరీస్ లిమిటెడ్ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తోందని తెలిపారు. 39 వర్కింగ్ మైన్స్‌లో 21 అండర్ గ్రౌండ్ మైన్స్, 18 ఓపెన్ కాస్ట్ మైన్స్ ఉన్నాయని.. సుమారు 6 నుంచి 8 జిల్లాల్లో సింగరేణి బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయని అన్నారు. లక్షలాది ప్రజల గుండెచప్పుడు సింగరేణి అని వెల్లడించారు. సింగరేణికి సంబంధించిన మేజర్ మైనింగ్ ప్రాజెక్టుల ఎన్విరాన్మెంటల్, ఫారెస్ట్ క్లియరెన్స్‌లను వేగవంతం చేయడంలో కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు.

తెలిపారు. కమిటీ నివేదికను కేసీఆర్ తొక్కిపెట్టారని పేర్కొన్నారు. తనకు నచ్చినట్లు రిపోర్టు వచ్చేలా బాధ్యతలను వ్యాపోస్‌కు అప్పగించారని సీఎం రేవంత్ ఆరోపించారు. రూ.38 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచారని సీఎం రేవంత్ విమర్శించారు. నివేదిక మారినా ఆయకట్టు ఏ మాత్రం మారలేదన్నారు. ప్రాజెక్టుపై కొన్ని అపోహలను ప్రతిపక్షం సృష్టించిందని, అవి తప్పని అన్ని ఆధారాలతో సహా చూపించామన్నారు. ఈ మేరకు కాళేశ్వరంపై నిపుణుల కమిటీ నివేదికను ప్రజల ముందుంచామని రేవంత్ పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఆనాడు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును తలపెట్టారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి ద్వారా తాగు, సాగునీరు, పరిశ్రమలకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుగా ఆనాడు నామకరణం చేశారని, 16 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పుకొచ్చారు. అయితే, మహారాష్ట్రలోని కొన్ని గ్రామాలు ముంపునకు గురవుతాయని అభ్యంతరాలు వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు గోదావరి నీటిని తరలించాలని ఆనాడే వైఎస్ఆర్, కాంగ్రెస్ కృషి చేసిందని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కమిషన్ల కోసం కేసీఆర్ ప్రాజెక్టు రీడిజైన్ చేశారని పేర్కొన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఇంజనీర్లు కాదని, మానిప్యులేటర్లని రేవంత్ రెడ్డి ఆగ్రహించారు. అబద్దాలతో మభ్యపెట్టడమే వారిద్దరి నైపుణ్యమని ఎద్దేవా చేశారు. అబద్దాలు చెప్పడంలో వారికి వారే సాటి అని మండిపడ్డారు. ప్రాజెక్టు అంచనా రూ.1.47 లక్షల కోట్లకు చేరిందని కాగ్ తెలిపిందన్నారు.

ఈ కార్యక్రమానికి వచ్చానని తెలిపారు. హస్తకళాకారుల వస్తువుల తయారీ మాత్రమే కాకుండా, వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా, రామాయణంలోని రావణ సంహార ఘట్టాన్ని తోలుబొమ్మలాట కళాకారులు ప్రదర్శించిన తీరును పవన్ కల్యాణ్ అభినందించారు. ప్రతి స్టాల్‌ను సందర్శించి, హస్తకళా ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారులను వ్యక్తిగతంగా పవన్ కల్యాణ్ ప్రోత్సహించారు. కళాకారులతో కలిసిపోయి, వారి నైపుణ్యాలను ప్రశంసించారు. వారి విజయాలు, సవాళ్ల గురించి అడిగి తెలుసుకున్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. కళాకారుల కోరిక మేరకు, క్లస్టర్ల వారీగా గ్రూప్ ఫోటోలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. ఏపీ హస్తకళల అభివృద్ధికి తమ ప్రభుత్వం అవసరమైన మద్దతును అందిస్తోందని స్పష్టం చేశారు. పర్యావరణ పర్యాటకం, ఆలయ పర్యాటకం తరహాలో హస్తకళల పర్యాటకాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని డిప్యూటీ సీఎం తెలిపారు. కళాఖండాలను సృష్టించే కళాకారులకు తగిన గుర్తింపు లభించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కళాకారుల పోరాటాలను ప్రపంచానికి పరిచయం చేయడానికి ప్రత్యేక డాక్యుమెంటరీలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వీబీజీ రామ్ జీ పథకం కింద క్లస్టర్ల వారీగా ఉమ్మడి సౌకర్యాల కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

### కడియంపై క్రమశిక్షణ

## చర్య తీసుకోవాల్సిందే

సమాచారం ఇవ్వకుండా కడియం శ్రీహరి కమిషనర్ ఆఫీస్‌లో అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించారని ఆమె ఫిర్యాదు చేశారు. మాస్టర్ ప్లాన్లు, శాఖాపరమైన నివేదికలపై ఆదేశాలు జారీ చేయడం మంత్రి పరిధిలోని అంశమని, అలాంటప్పుడు ఒక ఎమ్మెల్యే దేవాదాయ శాఖ అధికారులను పిలిచి ఎలా ఆదేశిస్తారని సురేఖ ప్రశ్నించారు. కడియం శ్రీహరి చర్య ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయానికి నాంది అని, ఇది కేవలం పరిపాలనా లోపం మాత్రమే కాదని, ఒక శాఖా మంత్రి అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే కుట్ర అని ఆమె లేఖలో మండిపడ్డారు. గతంలోనూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను రెచ్చగొట్టి తనపై కడియం శ్రీహరి దుష్ప్రచారం చేశారని కొండా సురేఖ ఆరోపించారు. ఇప్పుడు కూడా ఉద్దేశపూర్వకంగానే తన్ను నిర్లక్ష్యం చేస్తూ ఆయన తీసుకుంటున్న ఇలాంటి చర్యల వల్ల దేవాదాయ శాఖ అధికార యంత్రాంగంలో తీవ్ర అయోమయం నెలకొందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజాప్రతినిధిగా ఉంటూ ప్రభుత్వ నిబంధనలను, మంత్రి అధికారాలను అతిక్రమించిన కడియం శ్రీహరిపై పార్టీ క్రమశిక్షణా కమిటీ ద్వారా విచారణ జరిపించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఆయనపై తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కొండా సురేఖ తన లేఖలో కోరారు. మంత్రిగా తనకు సమాచారం ఇవ్వకుండా కడియం దేవాదాయ శాఖపరమైన సమీక్ష నిర్వహించారని, ఆయన సమీక్షించడం పరిపాలనా వ్యవస్థకు విరుద్ధమని పేర్కొన్నారు. శాఖ మంత్రిగా అన్ని అధికారాలు తనకే ఉంటాయాన్న సురేఖ.. కడియం వ్యవహారంపై పార్టీ, ప్రభుత్వ స్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు. బొగ్గులకుంటలోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో సోమవారం కడియం శ్రీహరి సమీక్ష నిర్వహించారు. దేవాలయాలకు సమస్య ఉంటే మంత్రి, అధికారులకు వినతిపత్రం ఇవ్వాలి కానీ, సమీక్ష నిర్వహించడం ఏంటని ప్రశ్నించారు. ఈ అంశంపై కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని సీఎం రేవంత్‌రెడ్డికి సురేఖ విజ్ఞప్తి చేశారు.

పేలుళ్లు జరగ్గా రెండ్రోజుల తర్వాత సూరత్ లోనూ బాంబులు గుర్తించారు. ఇక పేలుళ్ల శబ్దాలకు సమీపంలో ఉన్నవారు కొంతకాలం వినికిడి శక్తి కోల్పోయారు. దర్యాప్తులో భాగంగా అహ్మదాబాద్ నగర నేరవిభాగం 100 మందిని నిందితులుగా పేర్కొంది. 78 మందిపై విచారణ చేపట్టింది. 2022లో ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన తీర్పులో 49 మందిని దోషులుగా నిర్ధరించింది. 28 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. అప్రూవర్‌గా మారిన ఒక నిందితుడికి క్షమాభిక్ష ప్రసాదించింది. తొలుత ఇచ్చిన వాంగ్మూలాలు ఉపసంహరించుకున్న మరో నలుగురు అప్రూవర్ల కు శిక్ష విధించింది. 2002లో జరిగిన గోధ్రా అనంతర అల్లర్లకు ప్రతీకారంగానే ఈ దాడులు జరిపినట్లు నాడు వార్తలు వచ్చాయి. తర్వాత ఇండియన్ ముజాహిదీన్ బాధ్యత ప్రకటించుకుంది. ఈ కేసు విచారణ సమయంలో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. 24 మంది నిందితులు టన్నెల్ తవ్వి జైలు నుంచి తప్పించుకునేందుకు యత్నించారు. అయితే ఆ కుట్రను పోలీసులు భగ్నం చేశారు.

## రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్ దిశగా అడుగులు

వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలన్నారు. రాష్ట్రంలో దాదాపు 4800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా.. ఇందులో 4300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం చెల్లింపులు చేసినా, ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని, అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్ తో సమస్యకు చెక్ పెట్టాలని సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటి నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలని తెలిపారు. ఇందుకు వివిధ విభాగాల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ 100 రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకు రావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిలైజ్ చేయాలన్నారు. నిరంతరం మానిటరింగ్ చేసేందుకు ఆర్థిక శాఖ విభాగం ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎం ప్రధాన కార్యదర్శి వి. శేషాద్రి, హెచ్ఆర్డి వైస్ చైర్మన్ శాంతి కుమారి, వేతన సవరణ కమిషనర్ ఎన్. శివ శంకర్,ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా విభాగం కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ధరణి పోర్టల్‌తో భూ అక్రమాలు

లేదా ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి విచారణ జరిపించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వెలుగులోకి వస్తున్న అక్రమాలపై ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. భూమి యజమాని వేలిముద్ర, ఓటీపీ ధ్రువీకరణ లేకుండానే రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది. భద్రతా వ్యవస్థలను బైపాస్ చేస్తూ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లను వినియోగించి లావాదేవీలు నిర్వహించినట్లు ప్రాథమిక సమాచారం వెల్లడిస్తోంది. అంతేకాకుండా విదేశాల్లో ఉన్న భూ యజమానులకు తెలియకుండానే వారి పేర్లలో మార్పులు చేసిన ఘటనలు కూడా వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ప్రభుత్వం పూర్తిస్థాయి విచారణకు ఆదేశించనున్నట్లు తెలుస్తోంది. ధరణి పోర్టల్‌లో జరిగిన సుమారు రూ.8 లక్షల లావాదేవీలకు సంబంధించిన ఆడిట్ ప్రక్రియ పూర్తయినట్లు తెలుస్తోంది. ఈ పరిశీలనలో దాదాపు 22 వేల రిజిస్ట్రేషన్లలో తేడాలు ఉన్నట్లు సమాచారం. అలాగే 'ఘోస్ట్ ఐడీలు' ఉపయోగించి లక్షల ఎకరాల భూ రికార్డులను మార్చినట్లు ఆరోపణలు రావడం మరింత సంచలనంగా మారింది. కొందరు సిస్టమ్‌లోని టైమ్ క్లాక్‌ను మార్చి పాత తేదీలతో రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలుస్తోంది. కేరళకు చెందిన సైబర్ సెక్యూరిటీ ఆడిట్ సంస్థ నిర్వహించిన పరిశీలనలో ఈ అంశాలు బయటపడినట్లు సమాచారం. ఈ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకోవడం, భూ రికార్డుల భద్రతను మరింత బలోపేతం చేయడం, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. ధరణి పోర్టల్‌కు సంబంధించిన ఈ వ్యవహారం తెలంగాణ రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. ప్రభుత్వం చేపట్టబోయే విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# సంపాదకీయం

## జనాభా పెరిగితే తట్టుకోగలమా ?

ఎన్నికల ముందు నేతలు ఇచ్చే హామీలన్నీ ఓట్ల కోసం అని ప్రజలు గుర్తించనంత వరకు ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతూనే ఉంటుంది. అధికారంలోకి వచ్చాక సొంత ఎజెండాతో సాగుతారు. ఓట్ల కోసం తప్ప ప్రజలపై లేదా రాష్ట్రం, దేశంపై ప్రేమతో ఏ రాజకీయ నాయకుడు పనిచేయరని గుర్తించాలి. ఎపిలో చంద్రబాబు జనాభా విషయంలో చేస్తున్న విన్యాసం ఇదే. కేవలం మైనార్టీ ఓట్లను గంపగుత్తగా లాగేసేం దుకు అధికా జనాభా కావాలి, పిల్లను కనండి, డబ్బులు ఇస్తాను అంటున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ ఉన్నవారికి తక్షణం 5వేల సాయం ప్రకటించారు. మరి లోకేశ్ ఒక్క పిల్లాడితోనే ఎందుకు సరిపుచ్చాడు. ఆయనకు ఈ నియమం వర్తించదా? చంద్రబాబు ఇంట్లోనే ఈ పద్ధతి లేనప్పుడు రాష్ట్రానికి ఎందుకు అంటగట్టాలన్నది ప్రజలు ఆలోచన చేయాలి. ఇందులో ఏదో మతలబు లేకుండా చంద్రబాబు ప్రకటించరని గుర్తించాలి. ఇకపోతే ఎపిలో అనేక సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి. సాయికృష్ణ అనే వ్యక్తిని పోలీసులు తీసుకుని వెళ్లి మాయం చేస్తే అతీగతీ లేదు. ఓ చిన్నారి తప్పిపోతే దిక్కులేదు. రేప్‌లు జరుగుతుంటే అడిగేవారు లేరు. కేవలం అమరావతి ఒక్కటే ఇప్పుడు లక్ష్యంగా బాబు పాలన సాగిస్తున్నాడు. ఇప్పటికే 33 వేల ఎకరాలు సేకరించినా ఇంకా భూమి కావాలంటూ రైతులను వేధిస్తున్నారు. భూములు ఇచ్చిన వారికి సక్రమంగా ప్లాట్లు ఇచ్చి వారిని సంతోషంగా ఉంచడం లేదు. కేవలం రియల్ వ్యాపారం లక్ష్యంగా బాబు పాలన సాగుతోందని వైసిపి ఆరోపణలు చేస్తోంది. ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేస్తున్నారని జగన్ విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరచిన పాలకులు అధికారంలోకి రాగానే తమ సొంత ఎజెండా అమలు చేస్తుంటారు. ఇలా ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఎన్నో హామీలు ఇస్తారు. ఉద్యోగాలు, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, అవినీతి నిర్మూలన వంటి అంశాలపై గొప్ప గొప్ప ప్రకటనలు చేస్తారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత వాటిలో చాలా హామీలు మరుగున పడిపోతాయి. అవినీతి అన్నది కేవలం ఉద్యోగులకే పరిమితం అయ్యింది. వారు లంచం తీసుకుంటే పట్టేస్తున్నారు. అలా పట్టుకుంటున్న వారి సంఖ్య ఒక్కశాతం కూడా ఉండదేమో. లంచం లేనిదే పని జరగడం లేదు. లంచాల కోసమే ఉద్యోగాలు ఇచ్చారేమో అనుకోవాలి. ఇకపోతే ఇప్పటికే దేశం అధిక జనాభాతో సతమతం అవుతోంది. ఉన్న జనాభాకు సరిపడా తిండిపెట్టలేక పోతున్నాం. కనీస వసతులు కల్పించలేకపోతున్నాం. విద్య,వైద్యం అందించలేకపోతున్నాం. దేశం అభివృద్ధి చెందాలంటే కనీస వసతులు కలగాలి. పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ప్రజలు కూడా తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదు. ఒకవైపు జవాబుదారీ పాలన, మరోవైపు బాధ్యతగల పౌరసమాజం ఉంటేనే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. మనం ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే, పాలిస్తే నష్టపోయేది రాష్ట్రమే. నష్టం జరిగేది ప్రజలకే తప్ప పాలకులకు కాదు. భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఎదిగింది. 145 కోట్ల జనాభాతో సతమతమవుతోంది. యువశక్తి, సహజ వనరులు, మేధో సంపత్తి, సాంకేతిక నైపుణ్యం వంటి అనేక బలాలు మనకు ఉన్నా, అడుక్కు తిన్నట్లుగా ప్రజల జీవితాలు సాగుతున్నాయి. విద్య, ఆరోగ్యం, పారిశుద్ధం, పర్యావరణం వంటి విషయాల్లో వెనకబడి ఉన్నాం. అవినీతి ఊడలు దిగుతోంది. దీనికి కారణం కేవలం పాలకుల వైఫల్యమే కాదు, ప్రజల నిర్లక్ష్యం కూడా ఓ కారణంగా చూడాలి. మనకెందుకులే అనుకుంటే ఇలాగే సాగదీస్తారు. దేశాభివృద్ధి అంటే కేవలం ప్రభుత్వ పథకాలు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు. ప్రతి పౌరుడి బాధ్యతా యుతమైన పాత్ర పోషించాలి. ప్రజాస్వామ్య దేశంలో పౌరస్పృహ లేకపోతే పాలకులు మనలను ఏమారుస్తారని గుర్తించాలి. ప్రజల సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలు, అధికారం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న తీరును చూస్తున్నాం. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే తరహా పాలన సాగుతోంది. ఆదాయాలను మించి ఖర్చు చేస్తున్నారు. రాజకీయ నేతల జీత భత్యాలు తడిసి మోపెడు అవుతున్నాయి. సంపాదనే ధ్యేయంగా కొందరి పాలకుల ప్రధాన లక్ష్యంగా మారుతోంది. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రజలే ఇస్తారు. కాబట్టి ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం పాలకుల విధి. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరించాలి. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయరాదు. కానీ నిత్యం జరుగుతున్నది దుర్వినియోగం తప్ప మరోటి కాదు. ప్రజల సమస్యలను వినడం, తెలుసుకోవడం, అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చూడడం అన్నది జరగడం లేదు. పాలనలో జవాబుదారీతనం లేకుండా పోతోంది. ఎన్నికల రోజున బలవంతంగా ఓటు వేసి ఐదేళ్లు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇది మన కర్తవ్యాన్ని విస్మరించయడమే అవుతుంది. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరును పరి శీలించడం, తప్పులను ఎత్తి చూపడం, మంచి కార్యక్రమాలను ప్రోత్సహించడం ప్రతి పౌరుడు బాధ్యతగా గుర్తించాలి. అధిక జనాభాతో సతమతం అవుతున్న మనం కనీస సౌకర్యాలు లేనప్పుడు జనాభాను పెంచాలన్న పిలుపును వ్యతిరేకించాలి. ఉన్న పౌరులకు ఎలాంటి సౌకర్యాలు ఇస్తున్నారో అడగాలి. గర్భిణీలకు కనీస డెలివరీ సరిపడా ఆస్పత్రులు, వసతులు లేవన్న విషయం పాలకులకు గుర్తు చేయాలి. జనాభా పెరుగుదల అనర్థ హేతవు తప్ప అభివృద్ధి కాదని గుర్తిస్తే మంచిది.

## కన్నాయిగూడెం మండలంలో ఓటర్ల జాబితా పరిశీలించిన ములుగు జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు

కన్నాయిగూడెం జూలై 07విజన్ ఆంధ్ర ప్రతినిధి. కన్నాయిగూడెం మండలంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) ప్రక్రియలో ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు సోమవారం పాల్గొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, బూత్ స్థాయి నాయకులతో కలిసి ఓటర్ల జాబితాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకుడికి కొత్త ఓటు నమోదు చేయించాలని సూచించారు. జాబితాలో తప్పులు, మరణించిన వారి వివరాలు ఉంటే బి ఎల్ ఓ లతో కలిసి వెంటనే సవరించాలని కార్యకర్తలకు ఆదేశించారు. ప్రతి బూత్ పరిధిలో ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు తాటి కృష్ణ, తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్ రావు, ఎండి వలీ బాబా, తాడూరి రఘు, కొమరం ధనలక్ష్మి, సుబ్బుల సమ్మయ్య, కావిరి చిన్నికృష్ణ,



పూజారి కిషోర్, చింతగూడెం మాజీ సర్పంచ్ దుర్గం నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జీఎం ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో "తేజస్ వర్క్‌షాప్" విజయవంతం

### ముఖ్య అతిథిగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాధం ప్రవీణ్



ములుగు జూలై 07;విజన్ ఆంధ్ర ప్రతినిధి జీఎం ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో తేజస్ వర్క్‌షాప్ మంగళవారం జిల్లా కేంద్రంలోని రాయల్ ప్లాజాలో ఘనంగా నిర్వహించారు. జీఎం ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ సిద్ధార్థ రెడ్డి అధ్యక్షత వహించగా, ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు 'బాధం ప్రవీణ్" ముఖ్య అతిథిగా పాల్గొనగా డిపి ఐఐటి ప్రతినిధులు వర్చువల్‌గా ఆవిష్కరణలు, పారిశ్రామిక అభివృద్ధి, స్టార్టప్‌లకు ఉన్న అవకాశాలు, కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలపై వివరించారు. సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు, సాంకేతికత వినియోగంతో యువత ముందుకు రావాలని, దేశ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. బాధం ప్రవీణ్ మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత పరిశ్రమల్లో ఆధునిక సాంకేతికత, విలువ ఆధారిత ఉత్పత్తులతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు, శిక్షణలను సద్వినియోగం చేసుకొని యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టి జి ఐ సి రమేష్, ఆర్ ఐ సి హెచ్ చరణ్ , ఎం ఎస్ ఎం ఈ ధనుంజయ్, డి ఆర్ డి ఎ ఎ పి డి శ్రీనివాస్, డిపిఎం దేవానందం, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, ఎస్ హెచ్ జి మహిళలు, పాలిటెక్నిక్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బొగత జలపాతాన్ని ఆకర్షణీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

### ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ ద్వారా స్థానిక వంటకాలు అందుబాటులో ఉంచాలి

### – జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



ములుగు జూలై 07;విజన్ ఆంధ్ర ప్రతినిధివాజేడు మండలంలోని బొగత జలపాతాన్ని రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో బొగత జలపాతం అభివృద్ధి, పర్యాటక సౌకర్యాలు, ఇందిరా మహిళా శక్తి ఫుడ్ కోర్ట్ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటకులకు ఆహ్లాదకరమైన అనుభూతి కలిగేలా పరిసరాలను పరిశుభ్రంగా, ఆకర్షణీయంగా ఉంచాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం, పార్కింగ్, విశ్రాంతి గదులు, భద్రత, దిశా నిర్దేశక బోర్డులు వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. స్థానిక సంస్కృతిని ప్రతిబింబించేలా ఫుడ్ కోర్ట్ ద్వారా జొన్న రొట్టె, బాంబూ చికెన్, నాటుకోడి, చేపల వంటకాలు తదితర సాంప్రదాయ ఆహారాలను అందుబాటులో ఉంచాలన్నారు. దీని ద్వారా స్థానిక మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి, ఆదాయం పెరుగుతుందని తెలిపారు. పర్యాటక ప్రాంతంలో నాణ్యమైన సేవలు అందించి, బొగత జలపాతాన్ని రాష్ట్ర స్థాయి ఆదర్శ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, డి.ఎఫ్.ఓ వికాస్ మీనా, టూరిజం అధికారి శివాజీ, అదనపు డి.ఆర్.డి.ఓ శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## బాచారం ప్రజల స్వచ్ఛంద పురావాస కాలనీ పరిశీలించిన జిల్లా కలెక్టర్

పెద్దకొత్తపల్లి జులై 7 : (విజన్ ఆంధ్ర)బాచారం వద్ద అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లోని గ్రామాల ప్రజల స్వచ్ఛంద పునరావాస కాలనీని పరిశీలించిన,లబ్ధిదారులకు అన్ని మౌలిక సదుపాయాలతో ఆదర్శవంతమైన పునరావాస కేంద్రాన్ని అభివృద్ధి చేయాలి అని అధికారులకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని అటవీ గ్రామాల ప్రజల స్వచ్ఛంద పునరావాసం కోసం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం బాచారం గ్రామం వద్ద నిర్మిస్తున్న పునరావాస (ఆర్ & ఆర్) కాలనీ పనులను, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సార్లపల్లి, కుడిచింతల బైలు, తాటిగుండాల పెంట, కొల్లంపెంట గ్రామాలకు చెందిన ఫేజ్ ▪× (ఆప్షన్ ▪××) లబ్ధిదారుల కోసం ఏర్పాటు చేస్తున్న కాలనీకి సంబంధించిన సమగ్ర లేఅవుట్ మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ప్రతి లబ్ధిదారునికి గృహ స్థలాలు, విశాలమైన అంతర్గత రహదారులు, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, పారిశుధ్య సదుపాయాలు, వర్షపు నీటి పారుదల వ్యవస్థలను నాణ్యతతో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల, ఆరోగ్య ఉపకేంద్రం, కమ్యూనిటీ హాల్, గ్రామ పరిపాలనా కార్యాలయం, రేషన్ దుకాణం, పార్కు, ఆట స్థలం వంటి సామాజిక మౌలిక సదుపాయాలను సమగ్ర ప్రణాళికతో అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా కాలనీని అన్ని సౌకర్యాలతో ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోని అటవీ గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా పునరావాసాన్ని ఎంచుకున్న నేపథ్యంలో, వారికి కొత్త ప్రాంతంలో మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. విద్య, వైద్యం, తాగునీరు, రవాణా, విద్యుత్, ఉపాధి అవకాశాలు వంటి అన్ని ప్రాథమిక సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా కాలనీని అభివృద్ధి చేయాలని సూచించారు. పునరావాస కాలనీ అభివృద్ధిలో అటవీ, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, రోడ్లు, భవనాల శాఖలు సమన్వయంతో పనిచేసి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు లబ్ధిదారుల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలను అమలు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు ప్రతిపాదిత లేఅవుట్, ప్లాట్ల విభజన, రహదారుల నిర్మాణం, తాగునీటి వనరులు, విద్యుత్ కనెక్షన్లు, ప్రజా వినియోగ స్థలాల కేటాయింపు తదితర అంశాలను కలెక్టర్‌కు వివరించారు. అవసరమైన చోట మార్పులు చేసి లబ్ధిదారులకు మరింత అనుకూలంగా కాలనీ రూపకల్పన చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట అటవీ శాఖ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేట్ విద్యా సంస్థల్లో పాఠ్య పుస్తకాల అమ్మకాలపై చర్యలు తీసుకోవాలి

### బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్(బిఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజశేఖర్ వర్మ.



ములుగు జూలై 07;విజన్ ఆంధ్ర ప్రతినిధిప్రైవేట్ విద్యా సంస్థల్లో ఇష్టానుసారంగా పాఠ్య పుస్తకాలు అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్(బిఎస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు కాడపాక రాజశేఖర్ వర్మ ఆరోపించారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఏ ప్రైవేట్ పాఠశాలలోనూ పాఠ్య పుస్తకాలు అమ్మేందుకు వీలులేదు. అయినప్పటికీ చట్టాన్ని అమలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అడ్మిషన్ ఫీజుల పేరుతో కూడా తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపడం శోచనీయమన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా జిల్లా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి జిల్లా ఉన్నతాధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

## ఫ్యూజ్ వేయబోయి ప్రాణాలు కోల్పోయిన రైతు

### ట్రాన్స్‌ఫార్మర్‌పై విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి

ముత్తారం,జూలై 07(విజన్ ఆంధ్ర) ముత్తారం మండలం పారుపల్లి గ్రామపంచాయతీ లోని శాల గుండ్లపల్లి శివారులో కరెంట్ షాక్కు గురై రైతు మరణించాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ముత్తారం గ్రామానికి చెందిన రైతు మారం వెంకటరెడ్డి (45) ట్రాన్స్‌ఫార్మర్‌కు ఫ్యూజ్ వేయడానికి వెళ్లారు. స్విచ్‌ను తెరిచినప్పటికీ అది పూర్తిగా ఓపెన్ కాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సరఫరా కొనసాగింది. ఈ విషయం గుర్తించకుండా ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కిన రైతు సమీపంలోని వైర్ తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులు రైతుల స్వయంగా ట్రాన్ఫార్మర్లకు ఫ్యూజులు వేయకూడదని విద్యుత్ శాఖ అధికారులకు తెలుపాలని సూచించారు. ఈ ఘటనతో ముత్తారం గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పరిశీలించి,కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## 20న ములుగులో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభజంపాల రవీందర్



ములుగుజూలై 0విజన్ ఆంధ్ర ప్రతినిధి. ఈ నెల 20వ తేదీన ములుగు జిల్లా కేంద్రంల భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలి జరుగుతుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ తెలిపారు. సంక్షేమ బోర్డులో అవకతవకలు, నిర్మాణ ధరల సమస్యలు, కార్మికుల ఇబ్బందులపై చర్చించి పరిష్కార మార్గాలు అన్వేషించేందుకు ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## పిల్లల అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలకం

### 3 నుండి 5 ఏళ్ల చిన్నారులను అంగన్వాడీకి పంపాలి

### సర్పంచ్ ఈసం సునీత

### పిల్లల్లో సమగ్రాభివృద్ధి జరగాలంటే తప్పనిసరిగా అంగన్వాడీ పాఠశాలకు పంపాలని

### ములుగు మండల రాయినిగూడెం సర్పంచ్ ఈసం సునీత తెలిపారు.



మంగళవారం రాయినిగూడెం గ్రామంలో జరిగిన పాఠశాల సంసిద్ధతా మేళా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గ్రామంలోని 3 నుండి 5 సంవత్సరాల చిన్నారులందరినీ అంగన్వాడీకి పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. అక్కడ ఆట, పాటలతో చదువు నేర్పడంతో పాటు పుష్టికరమైన ఆహారం కూడా అందజేస్తారని చెప్పారు. ప్రభుత్వం అందించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంగన్వాడీల్లో పిల్లలతో పాటు తల్లులు, గర్భిణులకు కూడా పౌష్టికాహారం అందుతుందన్నారు. శారీరక, భాషా, బుద్ధి వికాసం, పూర్వ గణితాభివృద్ధికి తోడ్పడే కార్యకలాపాలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వంతో పాటు ప్రథమ్ సంస్థ ద్వారా యూనిఫామ్స్, పుస్తకాలు, ఆట వస్తువులు కూడా అందిస్తారన్నారు. అంగన్వాడీ సంసిద్ధతా మేళాలో శారీరక, బుద్ధి, భాషా, పూర్వ గణిత వికాసాలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేసి పిల్లలతో కృత్యాలు చేయించామని, వీటి ద్వారా పిల్లల అభివృద్ధిని అంచనా వేయవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టర్ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి, అంగన్వాడీ టీచర్లు, తల్లులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హక ఫార్మర్ సర్విస్ రైతు సేవా సెంటర్ ను ప్రారంభించినఎమ్మెల్యే బండ్లకృష్ణమోహన్ రెడ్డి

గద్వాల జూలై 07 (విజన్ ఆంధ్ర బ్యూరో)గద్వాల మండల అనంతపురం సేజ్ నందు హక ఫార్మర్ సర్విస్ రైతు సేవా కేంద్రం ను గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించడం జరిగింది. ఎమ్మెల్యే కి షాప్ యజమాని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు ఫర్టిలైజర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాజారెడ్డి, మాజీ జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, నాయకులు నరసింహారెడ్డి, రాంబాబు గౌడ్, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# విద్యా సంస్థల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు

## కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టీకరణ

## మునిపల్లి జ్యోతిబాపూలే కళాశాల ఆకస్మిక తనిఖీ



నిజామాబాద్, జూలై 07 :( విజన్ ఆంధ్ర ) వసతి గృహాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్ళు, కళాశాలల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. జక్రాన్పల్లి మండలం మునిపల్లిలో గల మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ జూనియర్/డిగ్రీ కళాశాలను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్, డార్మెటరీ, తరగతి గదులు తదితర వాటిని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని పరిశీలన జరిపారు. అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, సదుపాయాల గురించి ఆరా తీశారు. వంట గది, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్ అపరిశుభ్రంగా ఉంది, ఈగలతో నిండి ఉండడాన్ని గమనించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిశుభ్రత గురించి పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నందున, ఏజెన్సీని మార్చాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వ్యాధులు ముప్పిరిగొనే ప్రమాదం ఉన్నందున పరిశుభ్రత విషయంలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అన్నారు. విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణలో రాజీ పడవద్దని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపిస్తూ, శుచి, శుభ్రతతో కూడిన పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. అనంతరం ఇంటర్ ద్వితీయ సంవత్సరం బై.పీ.సీ తరగతి గదిని సందర్శించి, విద్యార్థినులతో భేటీ అయ్యారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ తదితర సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి, విద్యార్థినుల నుండి సమాధానాలు రాబట్టారు. ప్రతిభ చూపిన బాలికలకు బహుమతులు అందించి ప్రోత్సహించారు. కలెక్టర్ వెంట స్థానిక తహసిల్దార్ కిరణ్మయి, కళాశాల ప్రిన్సిపాల్ అనూష తదితరులు ఉన్నారు.

# మల్కాజిగిరి , మౌలాలిలో చక్రం తిప్పుతున్న చైన్ మేలు విచ్చల విడిగా అక్రమ నిర్మాణాలు

## నిర్మాణదారులతో కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న నాక్ ఇంజనీర్స్

మల్కాజిగిరి, జూలై 7,(విజన్ ఆంధ్ర): మల్కాజిగిరి ,మౌలాలి డివిజన్ పరిధిలో అక్రమ నిర్మాణాలురోజురోజుకూ పుట్టగొడుగుల్లా పెరుగుతుండటం,అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహారించడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.ముఖ్యంగా గ్రీన్ హిల్స్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా సెట్ బ్యాక్ లేకుండా, పర్మిషన్ లేకుండా లేకుండా బహుళ అంతస్థుల భారీ భవన నిర్మాణాలు ఊపందు కున్నాయి. ఈ కట్టడాలు నిర్మాణ దశలో ఉండగా.సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంపై స్థానికంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమ భవన నిర్మాణాల నియంత్రణ, ప్రజల ఫిర్యాదుల పరిష్కారం వంటికీలక బాధ్యతలను నిర్వర్తించాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు అక్రమ నిర్మాణాల నియంత్రణలో ఘోరంగా విఫలమవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ కట్టడాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేయడం, నిబంధనలఉల్లంఘనలను గుర్తించి చర్యలు తీసుకోవడం,ఆక్రమణలను తొలగించడం వంటి బాధ్యతలు టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఉన్నప్పటికీ మౌలాలి సర్కిల్‌పరిధిలో టౌన్ ప్లానింగ్ అధికారులు పనితీరు భిన్నంగా ఉందని ప్రజలు మండిపడుతున్నారు. ప్రతిరోజూ ఏదో ఒక కాలనీలో అనుమతులు లేని నిర్మాణాలు, కమర్షియల్‌కాంప్లెక్సు నిర్మితమ వుతున్నా సంబంధిత



అధికారులు వాటి గురించి తెలిసి కూడా పట్టించుకోక పోవడంతో వారి పని తీరుపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనికి ప్రధాన సూత్ర దారులు. చైన్ మేలు,టౌన్ ప్లానింగ్ శ్రీనివాస్ అని ఆయన కనుసల్లోనే అమ్యామ్యాలన్నీ నడుస్తున్నాయని బహిరంగ ఆరోపణలు వినవస్తు న్నాయి. ఇదంతా చూస్తుంటే అసలు మల్కాజ్గిరి జోనల్ ఆఫీస్ లో కమిషనర్ ఉన్నాడా.. లేదా..? అని ప్రజలు ముక్కున వేలు వేసుకుంటున్నారు.. సెక్షన్ ఆఫీసులో పనిచేస్తున్న చైనా మేన్ లు.. వసూల్ రాజాగా మారుతున్నారు.. లక్షల్లో వసూలు చేసుకుంటూ అందరిని మేమే చూసుకుంటామంటూ ఇంటి యజమాని నుండి లక్షల్లో వసూలు చేస్తున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే నోటీసుల జారీ చేసి ఆ పేరుతో యజమానులు నుండి అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నారు. నాక్ ఇంజనీర్ సెక్షన్ లో పని చేస్తున్న కొంతమంది అక్రమ కట్టడాలకు వత్తాసు పలుకుతున్నారని బహిరంగ ఆరోపణలు వినపడుతున్నాయి. ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన సందర్భాల్లో కూడా కేవలంనోటీసులు జారీ చేయడం వరకు మాత్రమే పరిమితమవుతున్నారని, అనంతర చర్యలు లేకపోవడం వల్లనేనిర్మాణదారులు అక్రమ కట్టడాలను పూర్తి చేస్తు న్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.అక్రమ నిర్మాణాలు నిరాటంకంగాకొనసాగుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.క్షేత్రస్థాయిలో తనిఖీలు సక్రమంగా జరుగుతు న్నాయా..లేదా.. అనే సందేహాలు వ్యక్తమవు తున్నాయి. అక్రమనిర్మాణాల కారణంగా ప్రభుత్వానికి అనుమతి రుసుములు, అభివృద్ధి ఛార్జీలు, ఇతర పన్నుల రూపంలో రావాల్సిన కోట్ల రూపాయలు దొడ్డిదారిన అధికారులు, సిబ్బంది జేబులలోకి వెళు తుందని స్థానికులుఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు నిర్మాణదారులు, అధికారుల సహకారంతో నిబంధనలను ధిక్కరించి నిర్మాణాలు చేపడుతున్నా రనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. అధికారుల అవినీతి కారణంగా కొంతమందికి అక్రమ నిర్మాణాలు కాసులుపంటగా మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, అడిషనల్ కమిషనర్ (ప్లానింగ్), చీఫ్ సిటీ ప్లానర్ తదితరఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి మౌలాలి సర్కిల్ పరిధిలో నిరాటంకంగా కొనసాగు తున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరు తున్నారు.

# మాదిగ దండోరా పాత్ర ఛారిత్రాత్మకం

## తిప్పరపు. లక్ష్మణ్ మాదిగ, కేశపాగ రాంచందర్ మాదిగ



మల్కాజిగిరి, జూలై 7,(విజన్ ఆంధ్ర):ఎంఆర్ పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన మాదిగ దండోరా పాత్ర, పోరాటం ఛారిత్రాత్మకమైనదని ఎంఆర్ పి ఎస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇంచార్జ్ తిప్పరపు. లక్ష్మణ్ మాదిగ, ఎం ఎస్ పి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షు లు కేశపాగ రాంచందర్ మాదిగ లు అన్నారు. మంగళవారం మల్కాజిగిరి చౌరస్తాలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు ఎన్.వినయ్ ఆధ్వర్యంలోమాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్ పి ఎస్) 32వ ఆవిర్భావ దినోత్సవం, ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ మంద క్రిష్ణ మాదిగ 61వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు, ముఖ్య అధితులుగా హాజరై జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియ జేశారు. అనంతరం వీహెచ్ పీ జిల్లా అధ్యక్షుడు వినయ్ మాట్లాడుతూ మంద క్రిష్ణ మాదిగ వికలాంగులు, వృద్దులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికుల పెన్షన్స్ కోసం అనేక పోరాటాలు చేసి వాళ్ళ జీవితాల్లో వెలుగు నింపిన ఘనత మంద క్రిష్ణ మాదిగది అన్నారు. గుండె జబ్బు పిల్లల కోసం పోరాటం చేసి ఆరోగ్యశ్రీ రూపకర్త అయ్యా రని, ఇలా అలుపు అనేది లేకుండా ఎన్నో పోరాటాలు చేసి విజయాలు సాధించిన ఘనత మంద క్రిష్ణ మాదిగది అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సంధిగారి. నర్సింగ్ రావు జర్నలిస్ట్ ఫోరమ్ నాయకులు మనోహర్ శంకర్ మాదాసు. ఇస్తారీ బండారి. లక్ష్మి. మౌజెస్ కీర్తి జి. నర్సింహా తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన విద్యార్థులకు ఘన స్వాగతం




బైంసా :జూలై 07:విజన్ ఆంధ్రపట్టణంలోని గోపాల్‌రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ పరిచయ, ఆహ్వాన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య అధ్యక్షత వహించారు.పట్టణంలోని గోపాల్‌రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ పరిచయ, ఆహ్వాన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకుల మార్గదర్శకత్వంలో క్రమం తప్పకుండా తరగతులకు హాజరవుతూ పాఠ్యాంశాలపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు.కళాశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం, గ్రంథాలయం, ఆంగ్ల భాషా అభ్యాస కేంద్రం, నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం తదితర సదుపాయాలను వినియోగించుకొని పోటీ పరీక్షలకు సిద్ధమై ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థులకు సూచించారు.ముఖ్య అతిథిగా హాజరైన రాథోడ్ విజేష్‌కుమార్ మాట్లాడుతూ కళాశాలలో ఉన్న మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాలు, అధ్యాపకుల అంకితభావాన్ని అభినందించారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం ముఖ్య అతిథిని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం ఘనంగా సన్మానించారు.ఉప ప్రిన్సిపాల్ డాక్టర్ రఘునాథ్, అంతర్గత నాణ్యతాభివృద్ధి విభాగం సమన్వయకర్త డాక్టర్ రవికుమార్ కళాశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు, విద్యార్థులకు అందుబాటులో ఉన్న సదుపాయాలపై చిత్రాల సహాయంతో వివరించి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.అనంతరం సీనియర్, నూతన విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అల్వాల్ లో ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం

అల్వాల్, జూలై 7,(విజన్ ఆంధ్ర): పేదరికం, వెనుకబాటుతనం, నిరక్షరాస్యతను తొలగించుకోవడం కోసం రాజకీయాలకతీతంగా మాదిగ జాతి ఐక్యమత్యంతో ముందుకు సాగాలనికాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి నియోజకవర్గం ఇంచార్జి తోట లక్ష్మి కాంత్ రెడ్డి,మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) స్టేట్ సెక్రటరీ భైరపోగు శివకుమార్ మాదిగ, ఎం ఆర్ పీ ఎస్ మేడ్చల్ జిల్లా నాయకుడు, నియోజకవర్గ ఇంచార్జి బచ్చల కూర స్వామి మాదిగ అన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎం ఆర్ పీ ఎస్) 32వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆల్వాల్ మండల్ కేంద్రంలో యాదమ్మనగర్ కాలనీ లో జెండా ఆవిష్కరణ, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి నియోజకవర్గం ఇంచార్జి తోట లక్ష్మి కాంత్ రెడ్డి,మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) స్టేట్ సెక్రటరీ భైరపోగు శివకుమార్ మాదిగ, ఎం ఆర్ పీ ఎస్ మేడ్చల్ జిల్లా నాయకుడు, నియోజకవర్గ ఇంచార్జి బచ్చల కూర స్వామి మాదిగ మాట్లాడుతూ పాలకులు, ప్రతిపక్షాలు విస్మరించిన అంశాలను, రాజకీయ పార్టీలు పట్టించుకోని సమస్యలను ప్రధాన ఎజెండాగా చేసుకుని ప్రజల కోసం పోరాటం చేసిన అతి పెద్ద సామాజిక ఉద్యమం,



మూడు దశాబ్దాలుగా నేటికీ ప్రజల హృదయాల్లో సజీవంగా జీవించి ఉన్న ఏకైక ఉద్యమం ఎమ్మార్పీఎస్ అన్నారు. మూడు దశాబ్దాల పాటు రాజీ లేని పోరాటం చేసి ' పద్మశ్రీ ' మందకృష్ణ మాదిగ మాదిగ జాతికి ఎస్సీ వర్గీకరణను సాధించి పెట్టాడని కొనియాడారు. మాదిగ జాతి కోసం మొదలైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం, మాదిగల వరకే పరిమితం కాలేదని, సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాలకులతో పోరాడి అనేక సంక్షేమ ఫలితాలను ప్రజలకు అందించి పెట్టిన చరిత్ర ఎంఆర్పీఎస్ కు ఉన్నదన్నారు. అందులో భాగంగానే ఆరోగ్యశ్రీ, వృద్ధాప్య, వికలాంగ పెన్షన్, రేషన్ కోట బియ్యం పెంపు, ఫాస్ట్ ట్రాక్ కోర్టులు తదితర పథకాలు సాధించి పెట్టిందని తెలిపారు. ఇవన్నీ సమాజం కోసం చేసినవని గుర్తించు కోవాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు అందుతున్న 9 శాతం రిజర్వేషన్లను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకొని విద్యా , ఉద్యోగాలలో రాణించాలని కోరారు. మాదిగల్లో అక్షరాస్యత తక్కువగా ఉన్నందున ఇకపై ఎవరు చదువులకు దూరం కావద్దని, అన్ని మార్గాలను ఉపయోగించుకొని ప్రాథమిక విద్యా,మాధ్యమిక విద్య, ఉన్నత విద్యలో ముందుకు సాగాలన్నారు. వివిధ కారణాల వల్ల చదువులకు దూరమైన విద్యార్థిని విద్యార్థులు తక్షణమే బడి బాట పట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో ఎం ఆర్ పీ ఎస్ యాదమ్మ నగర్ కాలనీ అధ్యక్షులు రాసం మధు మాదిగ, సీనియర్ నాయకుడు రమేష్ మాదిగ,కాలనీ అధ్యక్షులు వెంకటస్వామి మాదిగ, వెంకటేష్,బాలపీర్, అనిల్, పొగాకు కురుమయ్య, పరుశరామ్, రాజు,రమేష్, మధు,మన్నెం,బాలస్వామి,రాము, నరసింహ, బాలకృష్ణ, గోవిందు,శివ,శ్రీకాంత్, నత్య, ప్రేమ్, సాయి,రవి,శివ, జస్వంత్,మల్లేష్,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం సహ చట్టం

## సమాచారాన్ని అడగడం పౌరుల హక్కు

## అదనపు కలెక్టర్ మధు మోహన్

గద్వాల జూలై 07 (విజన్ ఆంధ్ర బ్యూరో)సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం వంటిదని, సమాచారాన్ని అడగడం పౌరుల హక్కు అని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) మధుమోహన్ అన్నారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సహచట్టం జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి ఆయా శాఖల వారీగా వచ్చిన సహ చట్టం దరఖాస్తులు, వాటి పరిష్కారం, ఏ స్థాయిలో ఎన్ని పెండింగ్ లో ఉన్నాయనే తదితర అంశాల గురించి రాష్ట్ర సహ చట్టం కమిషన్ కు నివేదిక పంపించాల్సి ఉంటుందన్నారు. ఆయా శాఖల అధికారులు నిబంధనలను అనుసరించి పౌరులు అడిగే సమాచారాన్ని ఇవ్వవచ్చని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేసే కొంతమంది పౌరులు వివిధ శాఖల సమాచారాన్ని అడుగుతుంటారని, సంబంధిత అధికారులు పౌరుల హక్కులకు భంగం కలగకుండా నిర్దేశిత గడువులోగా సమాచారాన్ని ఇవ్వాల్సిందిగా



ఆదేశించారు. పౌరులకు మన బాధ్యతగా చేస్తున్న సేవలపై ప్రతి ఒక్క అధికారి ఆత్మవలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అనంతరం సమాచార హక్కు చట్టంలోని వివిధ సెక్షన్ల గురించి క్లుప్తంగా వివరించారు. అలాగే వివిధ శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారం, తదితర అంశాలపై అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, ఆర్టిఐ సెక్షన్ పర్యవేక్షకులు సరితా రాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ ను కలిసిన సమాచారశాఖ ఆర్జేడీ (జోన్-4)

కడప,జూలై 7 (విజన్ ఆంధ్ర) సమాచార పౌర సంబంధాల శాఖ జోన్ -4 ఆర్జేడీ గా బాధ్యతలు స్వీకరించిన ఎం. వెంకటేశ్వర ప్రసాద్ సోమవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అంతకుముందు.ఆయన సమాచార పౌర సంబంధాల శాఖ మచిలీపట్నం డిప్యూటీ డైరెక్టర్ గా పనిచేస్తూ. పదోన్నతి పొంది కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (జోన్-4) గా విధుల్లో చేరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచారశాఖ జోన్-4లోని అన్ని జిల్లాల అధికారులను సమన్వయం చేసుకుంటూ బాధ్యతాయుతంగా, కలిసికట్టుగా కర్తవ్య నిబద్ధతతో ఉద్యోగ ధర్మాన్ని నెరవేరుస్తామన్నారు



# మారుమూల ప్రాంతాల ప్రజలకు 24 గంటల వైద్యసేవలు అందుబాటులో ఉండాలి

## వన మహోత్సవంలో విరివిగా మొక్కలు నాటాలి

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

## పెంబి మండలంలో ఆకస్మిక తనిఖీల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశాలు

నిర్మల్ జిల్లా,జూలై 07,(విజన్ ఆంధ్ర );మారుమూల ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24 గంటల పాటు నాణ్యమైన వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం పెంబి మండలంలో ఆకస్మికంగా పర్యటించిన ఆయన ఆరోగ్య కేంద్రం, పాఠశాల, కేజీబీవీ, గ్రామపంచాయతీ కార్యాలయాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు.ముందుగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, ఓపీ విభాగం, మందుల నిల్వ గది, ఇతర విభాగాలను పరిశీలించారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని, రోజువారీ ఓపీ నమోదు, వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించి అన్ని రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. వర్షాకాలంలో కాలానుగుణ వ్యాధులు, పాముకాటు కేసులు పెరిగే అవకాశమున్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు తాగునీరు, కూర్చునే సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించిన కలెక్టర్, వన మహోత్సవంలో భాగంగా మొక్క నాటి, వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులతో ముచ్చటిస్తూ చదువులో ప్రతిభ కనబర్చాలని, ప్రతిరోజూ తప్పనిసరిగా పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. బడికి రాని విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.మందపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్, ఎన్యుమరేషన్ ఫారాల ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులను అభినందించి, క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రోత్సహించారు.ఈ పర్యటనలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంఈఓ రామ్‌చందర్, ఎఫ్ఆర్ఓ కల్పనాదేవి, సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



# గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 7 (విజన్ ఆంధ్ర)గ్రామ పంచాయతీలను ఆర్థికంగా, పరిపాలనాపరంగా బలోపేతం చేసి గ్రామాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్ నుంచి గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక(జిపిఎస్ ఏపీ) అమలు, గ్రామస్థాయి అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వనపర్తి జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీసీ హాల్ నుంచి లిజిల్లా కలెక్టర్ ఖీమ్య నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ప్రణాళికలు ప్రజల అవసరాలను కేంద్రంగా చేసుకుని రూపొందించాలని సూచించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, వీధి దీపాలు, మురుగునీటి పారుదల, హరితహారం, ప్రజా వసతులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి గ్రామ అవసరాలను గుర్తించి దీర్ఘకాలిక అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని పేర్కొన్నారు. నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా నిధులు ఖర్చు చేయరాదని ఆదేశించారు.రేపటి నుంచి 3 రోజుల పాటు సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులకు ఊూబూ, 16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, గ్రామ పాలన, ఆర్థిక నిర్వహణపై సమగ్ర శిక్షణ ఇవ్వాలని తెలిపారు. వీబీజీ రామ్-జి చట్టంపై కూడా పూర్తి అవగాహన కల్పించాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని, నీటి కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ యాదయ్య, డీఆర్డీఓ ఉమాదేవి, డీపీఓ రఘునాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# అధిక లాభాలు అందించే ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలి

### అవగాహన సదస్సులో కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపు
### ఆయిల్ పామ్ సాగు అన్ని విధాలుగా శ్రేయస్కరం
### స్వీయ అనుభవాన్ని వెల్లడించిన ఆదర్శ రైతులు



నిజామాబాద్, జూలై 07 :( విజన్ ఆంధ్ర) అధిక దిగుబడి, మంచి మద్దతు ధరతో గణనీయమైన లాభాలను అందించే ఆయిల్ పామ్ పంట సాగు చేసేందుకు జిల్లాలోని ఆదర్శ రైతులు చొరవ చూపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. మాక్లూర్ మండలం చిన్నాపూర్ రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగుపై మంగళవారం స్థానిక రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, సంప్రదాయ వరి పంట స్థానంలో ఆయిల్ పామ్ సాగు చేపడితే కలిగే ప్రయోజనాల గురించి అధికారులు రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయిల్ పామ్ సాగు చేపట్టి దిగుబడులు పొందుతున్న ఆదర్శ రైతులు జైడి మధుసూదన్, లక్ష్మణ్, గడ్డం గంగారెడ్డి, సుధాకర్ తదితరులు తమ స్వీయ అనుభవాలను తోటి రైతులకు తెలియజేశారు. ప్రభుత్వ సబ్సిడీతో తాము ఆయిల్ పామ్ పంట సాగు చేశామని, ప్రస్తుతం మంచి దిగుబడి చేతికి వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అంతర పంట సాగు ద్వారా అదనపు ఆదాయాన్ని సైతం ఆర్జించడం జరిగిందని వివరించారు. డ్రిప్ ఏర్పాటు కోసం 90 శాతం సబ్సిడీతో ప్రభుత్వమే డ్రిప్ పరికరాలను సమకూర్చిందని అన్నారు. తాము సహచర ఆదర్శ రైతులు కలిసి ఖమ్మం జిల్లా అశ్వారావుపేట, సత్తుపల్లి ప్రాంతాలకు వెళ్లి ముందుగా ఆయిల్ పామ్ సాగును అధ్యయనం చేశామని, ఏ రకంగా చూసినా ఈ పంట అధిక లాభాలు అందిస్తుందని గమనించి తాము కూడా ఆయిల్ పామ్ సాగు చేశామన్నారు. వరి, పసుపు వంటి పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్ సాగు ఎంతో శ్రేయస్కరం అని నిరూపితం అయ్యిందని రైతులు తమ స్వీయ అనుభవాన్ని తోటి రైతులతో పంచుకున్నారు. బైబ్యాక్ ఒప్పందాన్ని అనుసరిస్తూ, ప్రీ-యూనిక్ కంపెనీ వారు మద్దతు ధర చెల్లిస్తూ కలెక్షన్ సెంటర్ల ద్వారా ఆయిల్ పామ్ పంట దిగుబడిని సేకరిస్తున్నారని అన్నారు. పంట సాగులో తమకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని, పైపెచ్చు ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్ పామ్ సాగుకు శ్రమ, ఖర్చు కూడా ఎంతో తక్కువ అని తన వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, మిగితా రైతులు కూడా ఇదే స్ఫూర్తితో ఆయిల్ పామ్ సాగును చేపట్టి అధిక లాభాలు పొందాలని సూచించారు. ఈ పంట సాగుకు జిల్లాలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని, పంట సాగుకు అవసరమైన ఆయిల్ పామ్ మొక్కలు నర్సరీలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ సీజన్ లో 1600 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా, రైతుల ప్రయోజనార్థం కనీసం 2000 ఎకరాల విస్తీర్ణంలో ఈ పంట సాగును ప్రోత్సహించాలని నిర్ణయించామని అన్నారు. స్థానికంగా జిల్లాలోనే ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ కూడా ఏర్పాటు కానుందని, ఇప్పటికే ఆయిల్ పామ్ దిగుబడుల సేకరణ కోసం కలెక్షన్ సెంటర్లను అందుబాటులో ఉంచామని గుర్తు చేశారు. వరి సాగు వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని, ప్రధానంగా కూలీల కొరతతో అవస్థలకు గురి కావాల్సి వచ్చిందని అన్నారు. అంతేకాకుండా ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు ఎంతో శ్రేయస్కరమని ఈ పంట ప్రయోజనాల గురించి ప్రతి రైతు అవగాహన కల్పించుకుని నూతనత్వం కోసం, ప్రయోగాత్మక పద్ధతిలో అయినా సాగుకు ముందుకు రావాలని సూచించారు. వంట నూనె తయారీతో పాటు ఇతర అనేక ఉత్పత్తుల్లో వినియోగించే ఆయిల్ పామ్ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. ఆయిల్ పామ్ పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తే, రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని, ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీలతో కూడిన ప్రోత్సాహకాలను అందిస్తోందని వివరించారు. ఈ పంట సాగు చేస్తున్న రైతులకు ఎకరాకు సాలీనా 4200 రూపాయల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఇన్‌పుట్ సబ్సిడీని రైతు ఖాతాలో జమ చేస్తోందని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ యూనిట్ ను 90 శాతం సబ్సిడీతో మంజూరు చేస్తోందని, ఆయిల్ పామ్ మొక్కలపై కూడా సబ్సిడీని అందిస్తోందని అన్నారు. ఆయిల్ పామ్ బోర్డు ఉన్నందున పంట అమ్మకం, మద్దతు ధర విషయంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన పని లేదన్నారు. మొక్కలు అందించిన కంపెనీలే, బోర్డు ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు పంటను కొనుగోలు చేస్తాయని తెలిపారు. ఎకరం విస్తీర్ణంలో సుమారు పది టన్నుల వరకు దిగుబడి వస్తుందని, అంతర పంట వేసుకొని అదనపు లాభాలను పొందవచ్చని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం మార్కెట్లో ఈ పంటకు ఉన్న డిమాండ్ ను బట్టి చూస్తే ఎకరానికి కనీసం రూ. లక్షన్నర నుండి రెండు లక్షల రూపాయల వరకు ఆదాయం ఆర్జించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఒక్కసారి ఆయిల్ పామ్ సాగు చేపడితే, కనీసం ముప్పై సంవత్సరాల పాటు ఈ పంట ద్వారా గణనీయమైన ఆదాయం పొందవచ్చని సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చే రైతులకు జిల్లా యంత్రాంగం తరఫున అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ పామ్ పంట సాగుకు ఉపయోగపడే ఆధునిక పరికరాలను సబ్సిడీపై అందించేలా చొరవ చూపుతామని అన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తిని కనబరుస్తూ, అవగాహన సదస్సులో కలెక్టర్ సమక్షంలోనే డీ.డీలు చెల్లించేందుకు ముందుకు రాగా, కలెక్టర్ వారిని అభినందించారు. అదేవిధంగా ఆయిల్ పామ్ సాగు ద్వారా ఆదర్శంగా నిలుస్తున్న బాశెట్టి గంగాధర్, రాహుల్ రాజ్, బాశెట్టి లక్ష్మణ్ తదితర రైతులను ఘనంగా సన్మానించారు. ఆయిల్ పామ్ పంట దిగుబడులతో కూడిన ఉత్పత్తులు, అధునాతన వ్యవసాయ పరికరాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను రైతులకు కలిసి సందర్శించారు. ఈ సదస్సులో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, ప్రీ-యూనిక్ కంపెనీ ఏరియా మేనేజర్ సాయి కిరణ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# సమన్వయ సహకారాలతో.. ముందుకెలదాం!

## సమాచార పౌర సంబంధాల శాఖ జోన్ -4 నూతన ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్



కడప,జూలై 7 (విజన్ ఆంధ్ర): రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారాలు, సమాచారశాఖ, మీడియా సమిష్టి కృషితో.. ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి ఫలాలను ప్రజలకు చేరవేసేందుకు పాటుపడదాం అని ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ కోరారు.మంగళవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ లోని సమాచార పౌర సంబంధాల శాఖ ఆర్జేడీ కార్యాలయంలో. జిల్లాలోని మీడియా స్టాఫర్లు, సిబ్బందితో ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ ఆత్మీయ పరిచయ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.వైఎస్ ఆర్ కడప జిల్లాలో జోన్-4 కార్యాలయంలో ఆర్జేడీగా విధులు నిర్వర్తించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. జోన్-4 పరిధిలోని జిల్లాల్లో సమాచార శాఖ, మీడియా పబ్లికేషన్స్, ప్రసారాల ద్వారా విస్తృతమైన సేవలు అందాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్యంగా ఈ జిల్లాల్లో అక్షరాస్యత,పేదరిక నిర్మూలన, వ్యవసాయం, ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ రకాల కార్యక్రమాలను, సంక్షేమ అభివృద్ధి ఫలాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో మీడియా పాత్ర చాలా కీలకమైనదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా, ప్రజలు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుల సమన్వయ సహకారంతో మీడియా ప్రతినిధులు కర్తవ్య నిబద్ధతతో, పారదర్శకంగా వృత్తి ధర్మాన్ని నెరవేర్చాలన్నారు.సమాచార శాఖను పటిష్టం చేయడంతో పాటు.జోన్-4 పరిధిలోని జిల్లాల్లో పాత్రికేయులకు వృత్తి పరంగా సహాయసహకారాలు అందించడంలో ఎల్లపుడు ముందుంటామన్నారు. సమాచార శాఖ, పాత్రికేయుల మధ్య సత్సంబంధాలు కొనసాగినప్పుడే.ప్రభుత్వ ఫలాలు ప్రజలకు సంతృప్త స్థాయిలో అందగలవని, అందుకోసం అందరం సమిష్టిగా కృషి చేయాలని మీడియా ప్రతినిధులకు పిలుపునిచ్చారు.అనంతరం పలువురు పాత్రికేయులు, సిబ్బంది ఆర్జేడీ కి పుష్ప గుచ్చాలు అందజేసి. దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు, సమాచార శాఖ ఎడి కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జూలై 8 నుంచి పీఎం విశ్వకర్మ రుణ అవుట్‌రీచ్ శిబిరాలు



కడప,జూలై 7: (విజన్ ఆంధ్ర) వైఎస్ఆర్ కడప జిల్లాలో ప్రధాన్ మంత్రి విశ్వకర్మ పథకం కింద గతంలో తిరస్కరణకు గురైన రుణ దరఖాస్తులను పునఃపరిశీలించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు జూలై 8 నుంచి 18 వరకు ప్రత్యేక రుణ అవుట్‌రీచ్ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) జి. జనార్దనం తెలిపారు.భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎంఎస్ఎంఈ అభివృద్ధి మరియు సౌకర్యాల కార్యాలయం, విశాఖపట్నం ఆధ్వర్యంలో జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయం సహకారంతో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంప్రదాయ వృత్తిదారులు, కళాకారులకు సకాలంలో బ్యాంకు రుణాలు అందించి స్వయం ఉపాధిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరాలు నిర్వహించ బడతాయని తెలిపారు. జూలై 8న బద్వేలు ఎంపీడీవో కార్యాలయంలో, 9న సిద్దవటం ఎంపీడీవో కార్యాలయంలో, 10న పులివెందుల ఎంపీడీవో కార్యాలయంలో, 14న జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయంలో, 16న ప్రొద్దుటూరు ఎంపీడీవో కార్యాలయంలో, 18న కడప జిల్లా పరిశ్రమల కేంద్రంలో శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.శిబిరాలకు హాజరయ్యే పీఎం విశ్వకర్మ లబ్ధిదారులు ఆధార్ కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ ఫోన్, పాన్ కార్డు (ఉన్నవారు), పీఎం విశ్వకర్మ ప్రాథమిక శిక్షణ పూర్తి చేసిన ధ్రువీకరణ పత్రం, దరఖాస్తులో పేర్కొన్న బ్యాంకు ఖాతా పాస్‌బుక్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు.వైఎస్ఆర్ కడప జిల్లాలోని అర్హులైన సంప్రదాయ వృత్తిదారులు, కళాకారులు తమకు సమీపంలోని శిబిరానికి నిర్ణీత తేదీన హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎల్డిఎం విజ్ఞప్తి చేశారు.

### బిజెపి జాతీయ కౌన్సిల్ మెంబర్, మాజీ మహిళ మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీత మూర్తి ని పరామర్శించిన తెలంగాణ బిసి గ్రాడ్యుయేట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బిజెపి నాయ కులు అబ్బగోని అశోక్ గౌడ్



నిజామాబాద్, జులై 07 (విజన్ ఆంధ్ర) : భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ మెంబర్ మరియు మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతా మూర్తి గారి సోదరులు వెంగిలి కిషన్ రావు గారు పరమపదించారు.వెంగిలి కిషన్ రావు, స్టేట్ బ్యాంక్ లో ఆఫీసర్ గా పదవీ విరమణ చేసిన తర్వాత లయన్స్ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ లో ఉచిత సేవలు అందిస్తూ ఉండే వారు.ఆయన చేసిన సేవలు మరువలేనివి అశోక్ గౌడ్ కొనియాడారు, ఈ మేరకు గీత మూర్తి గారిని నిజాంబాద్ వెళ్లి పరామర్శించిన తెలంగాణ బీసీ గ్రాడ్యుయేట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు మరియు బిజెపి నాయకులు అబ్బ గోని అశోక్ గౌడ్, మరియు ఆర్.ఎస్.ఎస్ మరియు బీజేపీ సీనియర్ నాయకులు వివేకానంద స్వామి, నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు

# సామాజిక సేవకు రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా గంజికుంట్ల వెంకన్నకు సత్కారం



ఖమ్మం జూలై 07 (విజన్ ఆంధ్ర) నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు ప్రజావేదిక ఎడిటర్ గంజిగుంట్ల వెంకన్నను మంగళవారం ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లో రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ మెమెంటోతో సత్కరించారు గ్రామాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు గుర్తింపుగా ఈ సన్మానం నిర్వహించారుచెన్నారం గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు భారీ విరాళం అందించడంతో పాటు చెన్నారం గ్రామపంచాయతీతో పాటు కొత్తూరు మంద్రాజూపల్లి తదితర గ్రామపంచాయతీలకు ఉచితంగా ఇంటర్నెట్ సౌకర్యం కల్పించిన సేవలను గుర్తిస్తూ ఈ సత్కారం చేసినట్లు గంజిగుంట్ల వెంకన్న తెలిపారుఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ పోలీసు శాఖ పిలుపునకు స్పందించి సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో ముందుండి సేవలందించడం అభినందనీయమని పేర్కొన్నారు భవిష్యత్తులోనూ ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలను మరింత విస్తరించి సమాజంలో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# వెంకటేశ్వర స్వామి ఆలయానికి మరో రూ.2 కోట్లు మంజూరు

## ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 6 (విజన్ ఆంధ్ర)వనపర్తి పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు జీవో ఆర్టీ నెంబర్ 147ను జారీ చేసింది. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో ఈ నిధులు సాధించినట్లు ఆయన తెలిపారు. గతంలో రూ.1 కోటి మంజూరు కాగా, ఇప్పుడు అదనంగా రూ.2 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పూజారుల గదులు, మండపాలు తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.వచ్చే ఏడాది మార్చిలో ఆలయం నిర్మించి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా జరిగే బ్రహ్మోత్సవాలకు ముందే ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మేఘారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్ ఐఆర్ కార్యక్రమాన్ని పండగలా నిర్వహించాలి

## ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 7 (విజన్ ఆంధ్ర)గ్రామ గ్రామాన సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ ఐఆర్ కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శివసేన రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పెబ్బేరు పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పెబ్బేరు, శ్రీరంగాపురం మండలాలు, పెబ్బేరు, వనపర్తి పట్టణాలకు చెందిన బిఎల్ ఏఎల్ -2 అవగాహన సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ఎన్నికల పరంగా అత్యంత కీలకమని, ప్రతి కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్త దీన్ని బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఈ కార్యక్రమం పండుగలా జరిగేలా ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ ఎ లతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు, సింగిల్ విండో అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎస్ ఐ ఆర్ కు ఇంకా 20 రోజులు మాత్రమే సమయం ఉందని గుర్తుచేసిన వారు, ఈరోజు నుంచే ప్రతి నాయకుడు, కార్యకర్త గడపగడపకు వెళ్లి అర్హుల వద్ద దరఖాస్తులు నమోదు చేయించాలని ఆదేశించారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఒక్క అర్హుడి ఓటు కూడా మిగిలిపోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, గత రెండున్నరేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని సూచించారు. ప్రభుత్వం మనదే కదా అనే ఓవర్ కాన్ఫిడెన్స్‌తో నిర్లక్ష్యం చేయవద్దు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నిర్లక్ష్యం చేసే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవు" అని ఎమ్మెల్యే హెచ్చరించారు. ప్రతిపక్షాలు దొంగ ఓట్ల నమోదుకు ప్రయత్నించే అవకాశం ఉందని, ప్రతి బూత్ స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. "మన ఓటును మనం కాపాడుకుంటూనే కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ అనుకూల ఓటర్ల ఓట్లను పరిరక్షించడం ప్రతి కార్యకర్త బాధ్యత" అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.

# నేడు వనపర్తికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 7 (విజన్ ఆంధ)రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం వనపర్తి జిల్లాకు విచ్చేస్తున్నట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ఉదయం 9:15 గంటలకు వనపర్తి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రూ.2 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 9:30 గంటలకు రాజాగారి బంగ్లాలో రూ.10 కోట్లతో చేపట్టనున్న పాలిటెక్నిక్ కళాశాల పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం రేవల్లి మండల కాంప్లెక్స్ సముదాయ నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో పూరి గుడిసెల్లో నివసించే నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల 2వ విడత ప్రొసీడింగ్ కాపీలు అందజేస్తారు. అదేవిధంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు కూడా ప్రొసీడింగ్ కాపీలు అందజేయనున్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగే సమీక్షా సమావేశంలో పాల్గొని మాట్లాడనున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శివసేన రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తదితరులు పాల్గొంటారు.

# పి ఎస్ ఆర్ సూపర్ మార్కెట్ ను సందర్శించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 7 (విజన్ ఆంధ్ర)పెబ్బేరు మున్సిపాలిటీ అంబేద్కర్ చౌరస్తా వద్ద రెండు రోజుల క్రితం ప్రారంభమైన పిఎస్ ఆర్ సూపర్ మార్కెట్ ను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శివసేన రెడ్డి మంగళవారం సందర్శించారు. బునాదిపురం గ్రామానికి చెందిన శివరాజ్ యాదవ్ ఈ సూపర్ మార్కెట్ ను ప్రారంభించారు. బునాదీపురం కాంటెస్టెడ్ సర్పంచ్ వనం మల్లేష్ యాదవ్ విజ్ఞప్తి మేరకు వారు మార్కెట్ ను సందర్శించి యజమాని శివరాజ్ యాదవ్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యమైన వస్తువులను వినియోగదారులకు అందించి, వ్యాపారంలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు మార్కెట్ వైస్ చైర్మన్ విజయ్ వర్ధన్ రెడ్డి, జిల్లా యువజన నాయకులు రంజిత్ కుమార్, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, వనం మల్లేష్ యాదవ్, నాయకులు నరసింహ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## నాగర్‌కర్నూల్ జిల్లాలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన

### మంత్రి పర్యటనకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు పూర్తి

నాగర్ కర్నూల్ జిల్లా (విజన్ ఆంధ్ర) జూలై 01 మంగళవారం : నాగర్ కర్నూల్ ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్,నూతన జిల్లా ఆర్టీఓ కార్యాలయ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమ వేదిక, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుధ్య ఏర్పాట్లపై అధికారులకు ఆదేశాలను చేశారు. నాగర్‌కర్నూల్ నూతన ఆర్టీసీ బస్ స్టాండ్ శంకుస్థాపన స్థలాన్ని పరిశీలించిన అధికారులు, శంకుస్థాపన కార్యక్రమం నిరాటంకంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రోటోకాల్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. పటిష్ట భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, మంత్రి చేతుల మీదుగా నూతన ఆర్టీఓ కార్యాలయం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ నూతన ఆర్టీసీ బస్ స్టేషన్ నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన. కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగానికి సమగ్ర కార్యాచరణను తెలియజేశారు.

## సత్తుపల్లి ఓపెన్‌కాస్ట్ బ్లాస్టింగ్, డస్ట్ కాలుష్యాన్ని అరికట్టాలి

### సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్"

సత్తుపల్లి, జూలై 07(విజన్ ఆంధ్ర) సత్తుపల్లి సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లో జరుగుతున్న బ్లాస్టింగ్, దుమ్ము కాలుష్యంతో పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం సత్తుపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ బొగ్గు వెలికితీత కోసం నిర్వహిస్తున్న భారీ బ్లాస్టింగ్‌ల వల్ల రేజర్ల, కిష్టారం, రాజీవ్‌నగర్, ఎన్‌టీఆర్ కాలనీ, మెంగళరావునగర్, కాకర్లపల్లి, కొత్తూరు గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. బ్లాస్టింగ్ కారణంగా ఇళ్లలో కంపనలు, గోడలకు పగుళ్లు, పంటలకు నష్టం, గాలిలో దుమ్ము వ్యాపించి ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని, వైద్య ఖర్చులతో పేద కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. సత్తుపల్లి ఓపెన్‌కాస్ట్‌లో ఉత్పత్తి అయ్యే ప్రతి టన్ను బొగ్గుపై ఖనిజ నిధి కింద జమయ్యే నిధులను ప్రభావిత గ్రామాల అభివృద్ధికే వినియోగించాలని డిమాండ్ చేశారు. బ్లాస్టింగ్‌ను శాస్త్రీయ



ప్రమాణాలకు అనుగుణంగా నిర్వహించడం, గనుల పరిసరాల్లో నిరంతరం నీరు చల్లి దుమ్ము నియంత్రించడం, ప్రభావిత గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించడం, ఇళ్లకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి పరిహారం చెల్లించడం, హరితవనాల అభివృద్ధితో కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే సింగరేణి సంస్థ ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్లలో పనిచేయని వాటిని వెంటనే మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో: సీపీఎం మండల కమిటీ సభ్యులు కువ్వారపు లక్ష్మణరావు, బండి వేలాద్రి, బెజవాడ లక్ష్మీనారాయణ, తడికమళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## హోర్ముజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్తత

### రెండు నౌకలపై ఇరాన్ మిస్సైల్ దాడి

టెహ్రాన్,జూలై7 హోర్ముజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. హోర్ముజ్‌లో ప్రయాణిస్తున్న రెండు నౌకలపై ఇరాన్ రెవల్యూషనరీ కార్ప్స్ గార్డ్స్ దాడులు చేసింది. రెండు నౌకలపై మిస్సైల్స్ ప్రయోగించింది. ఈ దాడుల్లో రెండు నౌకలు దెబ్బ తిన్నాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ విషయాన్ని అమెరికా అధికారులు మీడియాకు వెల్లడించారు. కాగా, మూడు వారాల క్రితం అమెరికా, ఇరాన్ దేశాలు మెమొరాండమ్ ఆఫ్ అండర్‌స్టాండింగ్‌పై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం హోర్ముజ్ జలసంధిలో దాడులు ఆపేస్తామని ఇరాన్ ప్రకటించింది. రెండు దేశాల మధ్య శాంతి ఒప్పందం జరిగిన తర్వాత కూడా ఇరాన్ దాడులకు పాల్పడటంపై అమెరికా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. మరో ఘటనలో.. ఒమన్‌లోని లిమా తీరంలో దక్షిణ దిశగా ప్రయాణిస్తున్న ఓ ఆయిల్ ట్యాంకర్‌ను పేలుడు వస్తువు బలంగా ఢీకొట్టింది. దీని కారణంగా ఆ నౌక ఎడమ వైపు భాగంలో భారీగా మంటలు చెలరేగాయి.

## పి ఆర్ సి రిపోర్టును తెప్పించుకొని వెంటనే అమలు చేయాలి

### టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్"

సత్తుపల్లి/వేంసూరు,జూలై 07(విజన్ ఆంధ్ర) తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఖమ్మంజిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్ సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలంలో సభ్యత్వ క్యాంపైన్లో భాగంగా విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా అడసర్ల పాడు ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మానిఫెస్టోలో ప్రకటించిన విధంగా సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అదేవిధంగా ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వం ఆరు డి ఏ లను పెండింగ్లో పెట్టిందని పెండింగ్ డీఏలను తక్షణమే విడుదల చేయాలని, పి ఆర్ సి కమిషన్ నుండి రిపోర్టు తెప్పించుకొని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగిందిఅంతేకాక ఉద్యోగుల ఆరోగ్య పథకం విధానంలో కూడా చాలా లోపాలు ఉన్నాయని సమగ్రమైన విధానాన్ని రూపొందించి తక్షణమే అమలు చేయాలని, ట్రీట్మెంట్ పొందే హాస్పిటల్స్ వివరాలు, స్పోజ్ విషయంలో నగదు మినహాయింపు, తదితర విషయాల మీద ఉద్యోగులలో అనేక అనుమానాలు ఉన్నాయని



వాటన్నింటినీ తక్షణమే నివృత్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందని పేర్కొనడం జరిగింది. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, పెన్షనర్ల బకాయిలు తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నిర్మల కుమారి, చంద్రశేఖర్, ఈశ్వరా చారి , సత్యవతి, మారేశ్వరరావు, ప్రసాద్, రవికుమార్, రామశేషు, నాగమణి, ఉష ,రాధాకృష్ణ వీరాంజనేయ,ప్రసన్నకుమార్, రాధాకృష్ణ, సతీష్ , రాంబాబు, నరేష్,కిషోర్,తదితరులు పాల్గొన్నారు.


## గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, జూలై 07(విజన్ ఆంధ్ర): గిరిజన విద్యార్థులకు వారి ఆవాసాల్లోనే నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. మంగళవారం భీంపూర్ మండలం టెక్డిగూడ గ్రామంలో ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పఠన సామర్థ్యాలను కలెక్టర్ పరిశీలించి, వారి నైపుణ్యాలకు సంతృప్తి చెంది అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో శిథిలావస్థకు చేరిన భవనం వల్ల హనుమాన్ ఆలయ మందిరంలో నడిచిన బెల్సాయి రాంపూర్, టేకడి రాంపూర్ గిరిజన ప్రాథమిక పాఠశాలను, గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు త్వరితగతిన నిధులు మంజూరు చేసి నూతన భవనాన్ని నిర్మించి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రాథమిక దశలోనే పిల్లలు భాషా నైపుణ్యాలు, ప్రాథమిక గణితం నేర్చుకుంటే ఉన్నత చదువులకు సులువుగా ఉంటుందని పేర్కొన్నారు. పిల్లలను రోజూ బడికి పంపాలని, ఉపాధ్యాయులు ఇచ్చే హోంవర్క్ చేసేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని కోరారు. పాఠశాలలో మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇస్తూ, భవన నిర్మాణానికి సహకరించిన ఐటీడీఏ, ఇంజనీరింగ్ అధికారులు, గ్రామస్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్కను నాటి, ఇంటింటికి ఐదు మొక్కల చొప్పున



గ్రామస్థులకు అందజేశారు. గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ప్రారంభం కాని ఇళ్లను పక్షం రోజుల్లోగా నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో ఏటిడిఓ నిహారిక, హౌసింగ్ పిడి శంకర్, తహసీల్దార్ రమేష్, ఎంఈఓ రాధాకృష్ణ, సర్పంచ్ కేశవ్, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, జూలై 07(విజన్ ఆంధ్ర): ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా అందించడమే లక్ష్యంగా రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసి, నాణ్యత ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఈదులసావర్గామ్ నుంచి నిపాని మీదుగా అర్లీ(టీ) వరకు రూ.18 కోట్ల వ్యయంతో చేపడుతున్న రోడ్డు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు రూ.5 కోట్లతో చేపట్టిన పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం రూ.3 కోట్ల వ్యయంతో సుమారు మూడు




కిలోమీటర్ల మేర దెబ్బతిన్న రహదారిని పునర్నిర్మిస్తున్న పనులను ఆయన పరిశీలించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనులను మరింత వేగవంతం చేయాలని, ఎక్కడా నాణ్యతలో రాజీ పడకుండా ఇంజినీరింగ్ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రహదారి పనుల కారణంగా ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని, హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేసి, త్వరితగతిన రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత శాఖ అధికారులు, కాంట్రాక్టర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నర్సయ్య, కాంట్రాక్టర్ నవీన్, సుమన్, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జంతు సంరక్షణ చట్టాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవు

### – సీఐ కె. నాగరాజు

ఆదిలాబాద్, జూలై 07(విజన్ ఆంధ్ర): జంతువులను అక్రమంగా వధశాలలకు తరలిస్తూ చట్టాలను ఉల్లంఘించే వారిపై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక నిఘా కొనసాగిస్తోందని, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. నాగరాజు హెచ్చరించారు. గత రాత్రి టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చేపట్టిన ప్రత్యేక వాహన తనిఖీలలో ఒక అనుమానాస్పద వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, అందులో 9 చిన్న ఎడ్లను అమానుషంగా తాళ్లతో కట్టి వధశాలలకు తరలిస్తున్న ముఠా పట్టుబడింది. తనిఖీలో 5 కిలోల మాంసం కూడా స్వాధీనం చేసుకుని, ఎడ్లను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేశారు. విచారణలో నిందితులు నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలానికి చెందిన అబ్దుల్ జహీర్, అబ్దుల్ నజీర్, అబ్దుల్ రఫీక్, అబ్దుల్ బషీర్ గా గుర్తించారు. ఎలాంటి చట్టబద్ధమైన అనుమతులు, వెటర్నరీ వైద్యుడి ఆరోగ్య ధ్రువీకరణ పత్రం లేకుండానే జంతువులను అక్రమంగా తరలిస్తున్నట్లు, అలాగే కొనుగోలుకు సంబంధించిన పత్రాలు కూడా లేవని



పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న 9 చిన్న ఎడ్లను గోశాలకు తరలించి సంరక్షణకు అప్పగించారు. ఈ ఘటనపై టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. జంతువులను అక్రమంగా రవాణా చేయడం, వధించడం, మాంసం అక్రమ వ్యాపారం నిర్వహించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై జిల్లా పోలీస్ శాఖ నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తోందని, ఇటువంటి సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని టూ టౌన్ సీఐ కె. నాగరాజు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం.. మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు



ఆదిలాబాద్, జూలై 07 (విజన్ ఆంధ్ర): జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ దండోరా జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ మాట్లాడుతూ.. 1994 జులై 7న ప్రకాశం జిల్లా ఈదుమూడి అనే ఒక చిన్న కుగ్రామంలో కేవలం 18 మంది యువకులతో మొదలైన దండోరా ఉద్యమం నేడు మహా వృక్షమైందని అన్నారు. బాబాసాహెబ్ డా. బి.ఆర్. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు అందరికీ సమానంగా అందాలన్నదే ఈ ఉద్యమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డీ ల వర్గీకరణ కోసం పాలకుల కుట్రలను, జైలు నిర్బంధాలను, అక్రమ కేసులను ఎదుర్కొంటూ.. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నేతృత్వంలో సుదీర్ఘంగా 30 సంవత్సరాల పాటు పోరాడి ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నామని ఆయన గుర్తుచేశారు. ఈ వర్గీకరణ ఫలితాలను మాదిగ జాతి యువత, విద్యార్థులు అందిపుచ్చుకుని, దేశానికి మానవ వనరులుగా మారి రాజ్యాధికారం దిశగా ప్రయాణించాలని పిలుపునిచ్చారు. ఒకవైపు వర్గీకరణ ఉద్యమం చేస్తూనే, మరోవైపు సమాజంలో పేదలకు సంక్షేమ ఫలాలు అందేలా ఎమ్మార్పీఎస్ బలమైన పునాదిగా నిలిచిందని మల్లేష్ మాదిగ కొనియాడారు. ఎమ్మార్పీఎస్ చేసిన పోరాటాల వల్లే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం, ఆరోగ్యశ్రీ పథకం సాధన, నిరాదరణకు గురైన అన్ని వర్గాలకు ఆసరా పెన్షన్ల మంజూరు, రేషన్ బియ్యాన్ని 4 కిలోల నుండి 6 కిలోలకు పెంచడం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ బలహీనపడకుండా యథావిధిగా కాపాడటం మరియు మహిళలపై దాడుల నివారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటు వంటి ఎన్నో సామాజిక మార్పులు సాధ్యమయ్యాయని ఆయన వివరించారు. ఈ దేశంలో ఎక్కడ దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల మీద దాడులు, దౌర్జన్యాలు జరిగినా తక్షణమే స్పందించే ఏకైక సామాజిక బాధ్యత గల సంఘం ఎమ్మార్పీఎస్ అని, అందుకే ఈ సంఘం దేశ ప్రధానులు, రాష్ట్రపతులు, ముఖ్యమంత్రుల చేత కీర్తించబడిందని అన్నారు. రాబోయే రోజుల్లో మందకృష్ణ మాదిగ నేతృత్వంలో మెజార్టీ జనాభా కలిగిన మాదిగలు రాజకీయ శక్తిగా ఎదిగి, ఈ రాష్ట్రాన్ని, దేశాన్ని పరిపాలించే రాజ్యాంగబద్ధమైన హక్కును సాధించుకుంటారని స్పష్టం చేశారు. ఈ వేడుకల్లో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఇండ్ల ఎల్లన్న మాదిగ, మాదిగ ఉద్యోగుల సమైక్య నాయకులు గుర్రాల ఆశన్న, ఆరేపల్లి గణేష్, కడదారపు పోచన్న, పెద్దింటి సూర్యప్రసాద్, మేకల జితేందర్, వీహెచ్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నాందేవ్ విలాస్, రాచర్ల శరత్, సుద్దాల భాస్కర్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక కార్యాచరణ: ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్, జూలై 07(విజన్ ఆంధ్ర): గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ చట్టపరమైన చర్యలతో పాటు వ్యసనగ్రస్తులకు వైద్య చికిత్స అందించి వారిని సాధారణ జీవితంలోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మంగళవారం స్థానిక రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రిమ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న డి–అడిక్షన్ సెంటర్ ను జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని వైద్య సదుపాయాలు, చికిత్సా విధానాలు, వ్యసనగ్రస్తులకు అందించనున్న కౌన్సెలింగ్, పునరావాస సేవలపై వైద్య బృందంతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి సరఫరా, విక్రయం, రవాణాపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు గంజాయికి బానిసైన వారిని గుర్తించి వారికి శాస్త్రీయ పద్ధతిలో వైద్య చికిత్స, మానసిక కౌన్సెలింగ్ అందించడం ద్వారా శాశ్వతంగా వ్యసనం నుంచి బయటపడేలా చేయడం అత్యంత అవసరమని అన్నారు. శిక్షతో పాటు సంస్కరణ కూడా సమాజానికి అవసరమని, అందుకే జిల్లా పోలీస్ శాఖ వైద్య శాఖతో సమన్వయం చేసుకొని డి–అడిక్షన్ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తోందన్నారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి సేవించే వ్యక్తులను గుర్తించి, మత్తు పదార్థాలకు బానిస అయిన వారిని గుర్తించి, వారి కుటుంబ సభ్యుల సహకారంతో స్వచ్ఛందంగా డి–అడిక్షన్ సెంటర్‌కు తరలించి చికిత్స అందించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. చికిత్స అనంతరం మళ్లీ మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా నిరంతర కౌన్సెలింగ్, పర్యవేక్షణ కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనిస్తే వెంటనే పోలీసులకు లేదా వైద్య అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే గంజాయి రహిత ఆదిలాబాద్ జిల్లాను నిర్మించగలమని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, రిమ్స్ డైరెక్టర్ డా. రాథోడ్ జైసింగ్, డి–అడిక్షన్ సెంటర్‌కు చెందిన సైకాలజిస్టులు, వైద్యులు, సీఐలు కె. నాగరాజు, బి.డి. ప్రేమ్ కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా నుంచి తరలి వెళ్లిన సిఓఈ కాలేజీ వెంటనే వెనక్కి తీసుకురావాలి

### బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ రామచంద్రారెడ్డి

అయిజ జూలై 07 (విజన్ ఆంధ్ర)తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలలో ఉన్న సిఓఈ. కాలేజీలు అన్ని జిల్లాల్లో ఉన్నాయి. కాని జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఇటిక్యాలలో ఉన్నటువంటి సిఓఈ కాలేజీ గతంలో ఉండేది, మరి




ఇప్పుడు ఆ కాలేజీని వేరే ప్రాంతానికి తరలించడం జరిగినది. తరలించడానికి గల కారణాలు ఏమిటి గత పాలకుల నిర్లక్ష్యమా ఇప్పుడున్నటువంటి ప్రభుత్వం కాంగ్రెస్ నిర్లక్ష్యమా కానీ ఈ జోగులాంబ గద్వాల జిల్లాలో ఉన్నటువంటి పేద రైతు విద్యార్థులు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారు. సిఓఈ కాలేజీ ఉండడం వలన పేద విద్యార్థులకు ఎంసెట్, నీట్, పై చదువులకు మంచి విద్య అందించేదని అన్నారు. ఈరోజు మరి అటువంటి కాలేజీ ఈ జోగులాంబ జిల్లాలో సిఓఈ కాలేజి ఎందుకు మూసివేయడం జరిగినదని, దానికి గల కారణాలు ఏమిటి ఈ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం దానిపైన ఆలోచన చేసి కచ్చితంగా ఈ జోగులాంబ జిల్లాలో గతంలో ఉన్నటువంటి ఇటిక్యాల మండలం కొత్తదేవరపల్లి గ్రామ సమీపాన ఉన్న సిఓఈ కాలేజీని వెంటనే వెనక్కి తీసుకొని రావాలి తెలిపారు భారతదేశంలోని వెనుకబడినటువంటి మండలాలు ఈ జిల్లాలో ఉన్నాయి. మరి అటువంటి జిల్లాలో ఇటువంటి మంచి సిఓఈ కాలేజీని మూసివేయడం చాలా దురదృష్టకరం అని, కార్పొరేట్ కాలేజీలలో లక్షలకు లక్షలు పెట్టి పేద విద్యార్థులు విద్యను అభ్యసించలేరు. మరి అటువంటి పేద విద్యార్థులను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని వెంటనే గతంలో ఉన్నటువంటి కాలేజీని వెనక్కి తీసుకొని రావాలని,లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి అయిజ మండల అధ్యక్షులు గోపాలకృష్ణ పట్టణ అధ్యక్షులు నరసింహ, పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, భీమన్న శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## జనం మధ్యన జగ్గారెడ్డి,జయా రెడ్డి జన్మదిన వేడుకలు

సంగారెడ్డి, జూలై :07(విజన్ ఆంధ్ర)సంగారెడ్డి లో ఘనంగా పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జయా రెడ్డి జన్మదిన వేడుకలకు వేలాది సంఖ్య లో హాజరైన కార్యకర్తలు, అభిమానులు డప్పు చప్పుళ్ళు, వాయిద్యాలు, డాన్స్ లతో హోరెత్తిన సంబురాలు లో జగ్గారెడ్డి మాట్లాడుతూనా తల్లిదండ్రులు జమాయమ్మ, జగ్గారెడ్డిలు నాకు అదృష్టంతో కూడిన పుట్టుకనిచ్చిరనిఈ అరవై ఏళ్లలో ఎన్నో అవమానాలు, సన్మానాలు, అజ్ఞాత వాసాలు, కష్టాలు, సుఖాలు. ఇదే నా జీవితం అని జగ్గారెడ్డి తెలిపారు. నాది బ్రహ్మాండమైన పుట్టుక, జన్మ అదృష్టంతో కూడిన జన్మను నా తల్లి జమాయమ్మ, జగ్గారెడ్డి నాకు ఇచ్చారు అన్నారు. ఎవరికి కష్టం వచ్చినా సాయం చేసే గుణం మా నాయిన, అమ్మది అదే గుణం నాకు వచ్చింది అని తెలిపారు. అందుకే మా నాన్న దోస్తులు నా పేరును జగ్గారెడ్డిగా మార్చారు అన్నారు. నేను పుట్టిన రోజే నా కూతురు కూచమ్మ (జయారెడ్డి) పుట్టింది. జీవితం అంటేనే ఆడాలి పాడాలి ఆస్వాదించాలి అనుభవించాలి అన్నారు. ఈరోజు నా బర్త్ డే అయినా రాజకీయ నాయకుడిగానే మాట్లాడతారాజకీయంగా సోనియా గాంధీ , రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి చీఫ్ మహేష్ గౌడ్, ఇంచార్జి మీనాక్షి ల నాయకత్వంలో మంత్రులందరి సహకారము ఉంది అని తెలిపారు. పోయిన ప్రభుత్వానికి దీనికి తేడా ఉందా లేదా ఇది కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం పదేళ్లలో కలెక్టర్ కు ప్రజా సమస్యలు చెప్పుకునే పరిస్థితి ఉండేదా పోలీసులు అనుమతులు ఇచ్చేవాళ్ళాఇప్పుడు డైరెక్ట్ గా కలెక్టర్ దగ్గరకు పోతున్నారుగా పోలీసులు





ఆపడం లేదుగాఏదేమైనా కాంగ్రెస్ కాంగ్రెస్సే సంసారం అన్నాక సమస్యలు ఉంటాయి.. కానీ సమస్యలు చెప్పుకుని పరిష్కరించుకునే స్వేచ్ఛ కాంగ్రెస్ లోనే ఉంటుంది తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో సీత్లా పండుగ



వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై07(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండలంలోని ఇస్లావత్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం సీత్లా పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్లావత్ తండా, ధరంసోత్ తండా, భూక్యా తండా , మూడు తండా, మంగళిబోడు తండాల్లో మహిళలు అమ్మవారికి నైవేద్యం, బెల్లం అన్నం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని, పిల్లాపాపలను చల్లగా చూడమని వేడుకున్నారు. సాయంత్రం పశువులతో (దాటోడి) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి, సునీత, యాకమ్మ , బుజ్జి, విమల, లాక్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై బిఆర్ఎస్ సమరశంఖం

**- ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధం**

**- డివిజన్ నాయకులు రావులపల్లి రామ్ ప్రసాద్ , మానే రామకృష్ణ**




చర్ల , జూలై 7 ( విజన్ ఆంధ్ర): మండల కేంద్రంలోని స్థానిక బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అత్యవసర సమావేశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది, ఈ సమావేశానికి డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ మరియు మానే రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల జీవన ప్రమాణాలు పూర్తిగా దిగజారిపోయాయని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని నాయకులు ఆరోపించారు రాష్ట్రంలో ప్రజా సంక్షేమం పూర్తిగా గాలికి వదిలేశారని, ముఖ్యంగా అన్నదాతలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు, రైతులకు సకాలంలో రైతు బీమా అందకపోవడంతో పాటు, ఎరువుల కొరతతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని వారు పేర్కొన్నారు. భద్రాచలం డివిజన్ పరిధిలోని భద్రాచలం నుండి పేరూరు వరకు గల ప్రధాన రహదారులు అధ్వానంగా తయారయ్యాయని, గుంతలమయమైన రోడ్ల కారణంగా ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారని మండిపడ్డారు, ప్రధానంగా చర్ల నుండి వెంకటాపురం వరకు సాగే ప్రయాణం అత్యంత దుర్భరంగా మారిందని నాయకులు విమర్శించారు, సాధారణంగా రెండు గంటల్లో సాగాల్సిన ఈ ప్రయాణం, రోడ్లపై అడ్డగోలుగా ఆపేస్తున్న ఇసుక లారీల వల్ల నాలుగు గంటలకు పైగా పడుతోందని, దీనివల్ల సామాన్య ప్రజలు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు, ఇసుక రాంపుల నిర్వహణపై ఉన్న శ్రద్ధ ప్రజా రవాణా వ్యవస్థపై లేదని వారు దుయ్యబట్టారు, అలాగే తాలిపేరు ప్రాజెక్టు ద్వారా ఆయకట్టు రైతులకు సకాలంలో సాగునీరు అందించకపోవడం ప్రభుత్వం యొక్క నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు విమర్శించారు, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రజా సమస్యలపై దృష్టి సారించి తక్షణమే పరిష్కార మార్గాలను అన్వేషించాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజల పక్షాన నిలబడి బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని, ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని వారు హెచ్చరించారు,ఈ కార్యక్రమంలో చర్ల మండల బిఆర్ఎస్ పార్టీ కన్వీనర్ దొడ్డి తాతారావు, నాయకులు పవన్ కుమార్, అజీమ్, కాకి అనిల్, అంబోజు సతీష్ కుమార్ లతో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆరోగ్య పరిరక్షణలో ఆశా కార్యకర్తల పాత్ర వెలకట్టలేనిది

**- ఆశా కార్యకర్తలే ఆరోగ్య వ్యవస్థకు వెన్నెముక - డిప్యూటీ కలెక్టర్ మురళి**



చర్ల, జూలై 7 (విజన్ ఆంధ్ర): చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశా కార్యకర్తల సమీక్షా సమావేశానికి డిప్యూటీ కలెక్టర్ మురళి ముఖ్య అతిథిగా హాజరయ్యారు, ఈ సందర్భంగా ఆయన ఆశా కార్యకర్తల నిస్వార్థ సేవలను మనస్ఫూర్తిగా అభినందిస్తూ, వారి బాధ్యతలను, సేవా ప్రాధాన్యతను సవివరంగా వివరించారు సమావేశంలో మురళి మాట్లాడుతూ, సమాజ ఆరోగ్య పరిరక్షణలో ఆశా కార్యకర్తల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు, తల్లి తర్వాత తల్లిగా ఉంటూ, సమాజంలో అత్యంత కీలకమైన ఆరోగ్య సేవలను మీరు అందిస్తున్నారు, ముఖ్యంగా మొదటిసారి గర్భం దాల్చిన మహిళలకు, ప్రసూతి తర్వాత తల్లులకు ఆరోగ్య పరిజ్ఞానంపై అవగాహన కల్పించడంలో మీరు చూపే చొరవ, బాధ్యత అభినందనీయం అని ఆయన ప్రశంసించారు, ఆశా కార్యకర్తలు ధరించే తెల్లని వస్త్రాలు కరుణామయి మదర్ థెరిస్సాను గుర్తుచేస్తాయని, అదే స్ఫూర్తితో ఎంతో ఓపికను, సహనాన్ని పాటిస్తూ, ఎటువంటి అలసట లేకుండా ప్రజలకు నిరంతరం సేవలందించాలని ఆయన పిలుపునిచ్చారు, సేవ చేసే క్రమంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ, ప్రశాంత వాతావరణంలో సేవలందించడం వల్ల రోగులకు మరింత మానసిక ధైర్యం కలుగుతుందని ఆయన సూచించారు, వర్షాకాలం దృశ్య మరింత అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా మురళి అన్నారు, సమావేశం అనంతరం డిప్యూటీ కలెక్టర్ మురళి నేరుగా హాస్పిటల్‌లోని వివిధ విభాగాలను, రోగుల వార్డులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు, ఆసుపత్రి ప్రాంగణం, గదులు పరిశుభ్రంగా ఉండాలని, రోగులకు అందించే వైద్య సేవల్లో ఎటువంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. ఆసుపత్రికి వచ్చే సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా, వారికి ఏ ఇబ్బంది కలగకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు, వైద్య సిబ్బందికి ఆయన కఠినమైన దిశానిర్దేశం చేశారు. మెరుగైన ఆరోగ్య వ్యవస్థ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన ఉద్బోధించారు ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హారిక, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఆశా కార్యకర్తలు తమ విధుల్లో ఎదుర్కొంటున్న అంశాలపై చర్చించగా, వాటి పరిష్కారానికి సానుకూల చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కలెక్టర్ హామీ ఇచ్చారు.

# మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన గద్వాల డీఎస్పీ మొగులయ్య



గద్వాల జూలై 07 (విజన్ ఆంధ్ర బ్యూరో) : తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జోగులాంబ గద్వాల జిల్లా పర్యటన సందర్భంగా శరవేగంగా జరుగుతున్న సభ ఏర్పాట్లను మంగళవారం గద్వాల డీఎస్పీ మొగులయ్య క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ధరూర్ మండల పరిధిలోని ర్యాలంపాడు నూతన ఆర్ అండ్ ఆర్ సెంటర్‌లో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ మొగులయ్య, ధరూర్ మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి తో కలిసి సభ ప్రాంగణం, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ స్థలాలను, భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. మంత్రి పర్యటనకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా, కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఈ సందర్భంగా డీఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకట్రామ్ రెడ్డి, సత్య రెడ్డి, మాజీ ఎంపీటీసీ భీమ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు చిట్టెం పురుషోత్తం రెడ్డి, పలువురు మాజీ సర్పంచ్‌లు, పోలీస్ సిబ్బంది, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలి

**- ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గొడం నగేష్**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 7, (విజన్ ఆంధ్ర) : జిల్లా అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గొడం నగేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ జిల్లా స్థాయి కమిటీ సమావేశానికి జిల్లా కలెక్టర్ కె.హరిత, సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, కోవ లక్ష్మి, ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి నంద మకరందు, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాను అన్ని రంగాలలో ముందంజలో ఉంచాలని, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఆకాంక్షిత జిల్లా అని అన్నారు. శిశు సంక్షేమ శాఖలో అంగన్వాడి కేంద్రాలు 1 వేయి 6 ఉన్నాయని, పక్క భవనాలు లేని అంగన్వాడీలను గుర్తించి భవన నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. 119 అంగన్వాడీ ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, భర్తీకి చర్యలు తీసుకోవాలని టీచర్లు, ఆయాలు లేని కేంద్రాలలో ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని తెలిపారు. మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో జల్ జీవన్ మిషన్ క్రింద ప్రతి గ్రామానికి శుద్ధమైన త్రాగు నీరు అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు ధర్తీ ఆభ జన జాతీయ మహోత్సవం క్రింద ఆదివాసి, పి.వి.టి.జి. గ్రామాలకు విద్యుత్ సౌకర్యం, గృహాలకు విద్యుత్ కనెక్షన్లు అందించాలని, రహదారి భవనాల శాఖ అధికారులు తమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులు, వంతెనలు, రహదారుల పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. అటవీశాఖ అనుమతులు త్వరగా తీసుకోవాలని తెలిపారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జన్ మన్ క్రింద పి.వి.టి.జి. గ్రామాలలో వైద్య సేవలు అందించాలని, వైద్యులు, సిబ్బంది ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని, మారుమూల గ్రామాలకు అంబులెన్స్ వెళ్లేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్య ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో ఎం.పి. లాడ్స్ నిధులతో సంబంధిత ఏజెన్సీలలో పని చేయించి ఖర్చు చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత మిషన్ క్రింద భూసార పరీక్షలు నిర్వహించాలని, యూరియా, విత్తనాల కొరత లేకుండా అధికారులు కృషి చేయాలని, కిసాన్ సమ్మాన్ నిధి క్రింద అర్హులైన లబ్ధిదారుల సంఖ్య పెంపొందించాలని తెలిపారు. జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారులకు ఇరువైపులా గల గ్రామాలలో అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బి.ఎస్.ఎన్.ఎల్. శాఖ వారు మారుమూల గ్రామాలలో ఇంటర్నెట్ సౌకర్యం కల్పనకు టవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజనాలను అందించాలని తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని సూచించారు. పలు శాఖల పురోగతిపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులలో ప్రజాప్రతినిధులు, అధికారులకు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, తదితరులు పాల్గొన్నారు.

# వామ్మో ఇసుక లారీలు

**- రాష్ట్రంలో ప్రథమ ప్రమాద భరితమైన రహదారిగా చర్ల**

**- రహదారుల వెంట బార్లు తీరిన ఇసుక లారీలు**

**- ట్రాఫిక్ జామ్ లతో ప్రయాణికుల తంటాలు**

**- ఎక్కడ చూసినా ఇసుక లారీలే**

**- వెంకటాపురం వెళ్లేందుకు ప్రయాణం కత్తి మీద సామే**

**- ఇసుక లారీలతో పూర్తిగా ధ్వంసమైన ప్రధాన రహదారులు**

**- వేల సంఖ్యలో లారీల క్యూలు**

**- లోతైన గోతులు ర్యాంపుల గడువు ముగిసే వరకు మారని తల రాతలు**

చర్ల , జులై 7 (విజన్ ఆంధ్ర): మండల వ్యాప్తంగా ఇసుక లారీలతో నిత్యం ఏదో ఒక సమస్య ఉంటూనే ఉంది అధికారులు ప్రజా నాయకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తో విచ్చలవిడిగా ఇసుక లారీల ఆగడాలు మితిమీరిపోతున్నాయి, క్రమ పద్ధతిలో లారీ వెళ్తే ఎటువంటి సమస్య ఉండదు కానీ అస్తవ్యస్తంగా వెళ్లడంతో నిత్యం ట్రాఫిక్ జాములతో ప్రజలు తండాల పడుతున్నారు, చర్ల వెంకటాపురం ప్రధాన రహదారి పైన ఇసుక ర్యాంపులకు వెళ్లే ఇసుక లారీలు భద్రాచలం నుండి పేరూరు వరకు ఇసుక లారీలతో ట్రాఫిక్ జామ్ కావడం తో భద్రాచలం ,చర్ల రహదారికి తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది ,ఇసుక లారీలు రాంపుల నుంచి ఒక్కసారిగా లోడుతో బయలుదేరడంతో విపరీతంగా ట్రాఫిక్ జామ్ తో ఆర్టీసీ బస్సులు ఆటోలు, మరియు ద్విచక్ర వాహనాలు వెళ్లలేని పరిస్థితి , దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆదివాసి ప్రజలు, అనారోగ్యం సరిగా లేక ప్రయాణికులు ఎమర్జెన్సీ పరిస్థితుల్లో కూడా 108 కూడా వెళ్లలేని పరిస్థితిలో లారీలు అడ్డుపడడంతో చేసేదిలేక లబోది ఇవ్వమంటూ ఉరుకులు పరుగులు పెడుతున్నారు ప్రయాణికులు, నిత్యం వేల సంఖ్యలో లారీలు ప్రాణాలు చేస్తుంటే ప్రజల ప్రాణాల మీదికి వస్తుంది, మితిమీరిన వేగం అధిక బరువైన లోడ్ తో లారీలు ప్రయాణం చేస్తుడడంతో రాష్ట్రంలో ప్రథమ ప్రమాద భరితమైన రహదారిగా భద్రాచలం , చర్ల వెంకటాపురం ,వాజేడు రహదారిగా మారింది,భద్రాచలం చర్ల వెంకటాపురం



వెంకటాపురం ప్రధాన రహదారి లారీలతో నిత్యం ట్రాఫిక్ జాం

రహదారులన్నీ ఇసుక లారీల ద్వారా ధ్వంసం అవటమే కాకుండా ప్రయాణికులకు తీవ్ర ఆటంకం ఏర్పడి ప్రయాణంతో విసుగెత్తిపోతున్నారు, ఈ కారణం వలన వెంకటాపురం చర్ల భద్రాచలం బస్ రవాణాకు తీవ్ర అంతరాయం కలిగి బస్సు రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది, కొన్ని సందర్భాలలో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిపి వేయడం జరిగింది. ...రోడ్డు ఎక్కాలంటే ఎప్పుడు ఏం జరుగుతుందో అంటూ భయాందోళనతో కుటుంబ సభ్యులు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది. ఇంత ఘోరం జరుగుతున్న ఒక్కరు కూడా పట్టించుకోని పరిస్థితి మండల వ్యాప్తంగా కనిపిస్తుంది ట్రాఫిక్ జామ్ అయినప్పుడు పోలీసు వారి సహాయంతో ట్రాఫిక్ ని క్రమబద్ధీకరిస్తున్నారే తప్ప ఇటువంటి సమస్యనికి శాశ్వత పరిష్కారం మాత్రం వెతకలేకపోతున్నారు. ఏది ఏమైనప్పటికీ చర్ల మండలం భద్రాచలం వెంకటాపురం ఇసుకరాంపులతో విసుగెత్తిపోతున్న ప్రజల గోడును వినిపించుకునే అధికారులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులతో దేవుడిపై భారం వేసి సమస్యలు గాలికొదిసినట్టుగా పరిస్థితి మారింది ఈ బతుకులు ఎప్పుడు మారతాయి అంటూ ప్రజలు గోసపడుతున్నారు.

**వరుస ఇసుక లారీలతో వ్యాపారస్తుల ప్రయణికుల తంటాలు**

వరుస ఇసుక లారీలు విపరీతంగా రావడంతో ఎదురుగా వస్తున్న మనిషి కూడా కనబడని పరిస్థితి ఈ మండలంలో కనిపిస్తోంది ,నిత్యం దుకాణాలకు దుమ్ము వలన కవర్లు కప్పుకునే పరిస్థితి చర్ల మండలంలో కనిపిస్తుంది ,ప్రధానంగా అంబేద్కర్ సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్ ,బస్టాండ్ ఏరియాలో రహదారి వెంట విపరీతమైన రద్దీ పెరిగి ప్రాణ భయం తో ప్రజలు అల్లాడుతున్నారు, బయటికి వెళ్లిన వ్యక్తుల తిరిగి వస్తారు అనే



రోడ్లు పై అస్తవ్యస్థంగా లారీలు

నమ్మకం కూడా కోల్పోయే పరిస్థితి వచ్చింది , ఈ సమస్యకు పరిష్కారం కోసం మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు.

**కరకట్ట గోదావరికే అడ్డుకట్ట మాత్రమేనా ఇసుక లారీల ప్రయాణాలకు ప్రణాళిక చేయలేరా**

చర్ల మండల శివారులో వెంకటాపురం ప్రధాన రహదారిపై ఉన్నటువంటి ఇసుక వనరు మేలిమి ఇసుక కావడంతో ఈ ఇసుక ర్యాంపుల కోసం ఇతర రాష్ట్రాల నుంచి పెట్టుబడిదారులు వచ్చి బినామీ పేర్లతో వ్యాపారం చేస్తున్నారు , ఇసుక వ్యాపార లావాదేవీలకు ప్రధాన అడ్డగా చర్ల వెంకటాపురం మండలాలు నిలుస్తున్నాయి, ఇసుక వ్యాపారంతో కోట్లు గడుస్తున్న కాంట్రాక్టర్లు, గుత్తేదారులు, రవాణా వ్యవస్థకు సరైన మార్గాన్ని తెచ్చుకోకుండా ప్రజా ఉపయోగమైనటువంటి రహదారులను ఉపయోగించడంతో రహదారులన్నీ ధ్వంసమై ప్రజలకు తీవ్ర ఆటంకాలను కలిగిస్తున్నాయి , చర్ల మండలానికి గోదావరి ఆనుకొని ఉండడంతో గోదావరి సీతమ్మ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వరద తాకిడిని తట్టుకునేందుకు కరకట నిర్మాణం జరిగింది. ఈ నిర్మాణం కూడా అసహపూర్తిగా జరగడంతో ఎటు ఉపయోగపడిన పరిస్థితి ఉంది. ఈ కర్కట నిర్మాణం పూర్తిగా నిర్మించినట్లయితే సరాసరి భద్రాచలంలోని గోదావరి బ్రిడ్జి వరకు కరకట్ట ద్వారా ఇసుక లాయర్లను ప్రత్యేకంగా తరలించవచ్చు అవకాశం ఉన్నప్పటికీ ఈ మార్గాన్ని ఎంచుకోకపోవడం అభివృద్ధి చేయకపోవడం తో చర్ల మండలం వెంకటాపురం భద్రాచలం ఇసుక లారీల తో రహదారులన్నీ దారి తోచని పరిస్థితిలో ఉన్నాయి , ఎక్కడికక్కడ గుంతలమయం గా మారి రాకపోకలకు పెద్ద ఆటంకంగా నిలుస్తున్నాయి ఇసుక లారీల తో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజల సంక్షేమాన్ని గుర్తుంచుకొని జిల్లా అధికారులు ముందుకు రావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ఉచిత ఆరోగ్య శిబిరం

మల్కాజిగిరి, జూలై 7,(విజన్ ఆంధ్ర): రెటినోవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమం మల్కాజిగిరి కమిషనరేట్ పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ చొరవతో, డీసీపీ ట్రాఫిక్ జోన్–I కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ పర్యవేక్షణలో, ఏసీపీ మల్కాజిగిరి ట్రాఫిక్ డివిజన్ పి.సుబ్బయ్య, మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బి. నరసింహ ఆధ్వర్యంలో ఈ ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో శ్రీకర హాస్పిటల్స్, ఈసీఐఎల్, పద్మ సాయి డెంటల్ హాస్పిటల్, స్కై ఫిట్ ఫిజియోథెరపీ, ప్లానెట్ ఆప్టిక్స్ వైద్య సేవలను అందించాయి. ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఎక్కువ సమయం రహదారులపై నిలబడి విధులు నిర్వ హించాల్సి ఉండటంతో వారి ఆరోగ్యం మెరుగు పడేందు కు, భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలను నివారించేం దుకు ఈ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పోలీసు సిబ్బంది అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

## వైద్యునిపై చర్యలు తీసుకోవాలి

మందమర్రి, జూలై 7 (విజన్ ఆంధ్ర) : సింగరేణి ఏరియా ఆసుపత్రికి చికిత్స కొరకు వస్తున్న కార్మిక కుటుంబ సభ్యులతో వైద్యులు వ్యవహరిస్తున్న తీరు ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది. ఓ కార్మికుడు ప్రమాదంలో గాయపడి కరీంనగర్లో సర్జరీ పూర్తి చేసుకొని తిరిగి రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి వచ్చిన వారి కుటుంబ సభ్యులతో ఓ వైద్యుడు అసభ్యకరంగా మాట్లాడారంటూ కార్మికుని భార్య ఆసుపత్రి డివైసీఎంఓ మధు కుమార్ కు మంగళవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. తక్షణమే సంబంధిత వైద్యునిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరింది. కాగా వైద్యుడు మాత్రం ఎక్కడ అసభ్యకరంగా మాట్లాడలేదంటూ చెప్తున్నారు.

## ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ సంపత్ కుమార్ ని కలిసిన అయిజ,రాజోలి,ఉండవల్లి ఎస్ఐ లు



అయిజ జులై 07 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజక వర్గం లోని అయిజ, రాజోలి, ఉండవల్లి, పోలీస్ స్టేషన్ లకు కొత్త గా అయిజ పోలీస్ స్టేషన్ కు గురుస్వామి,రాజోలి పోలీస్ స్టేషన్ కు కిరణ్ కుమార్,ఉండవల్లి పోలీస్ స్టేషన్ కు సురేష్ లు బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా వీరు మంగళవారం ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ .ఏ .సంపత్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

## జూలై 8న జిల్లాలో మంత్రి పర్యటన

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

గద్వాల జూలై 07 (విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ర్యాలంపాడు పునరావాస కేంద్రంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లాకు వస్తున్నట్లు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు మంత్రి ర్యాలంపాడు చేరుకొని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

## జె.వి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు అవగాహన సదస్సు


సత్తుపల్లి, జూలై 07(విజన్ ఆంధ్ర) జె.వి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్), సత్తుపల్లిలో 202627 విద్యా సంవత్సరానికి ప్రవేశం పొందిన ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్. గోపి అధ్యక్షత వహించారు. విద్యార్థులకు కళాశాల విద్యా విధానం, అకాడమిక్ నిబంధనలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, విద్యార్థి సంక్షేమ పథకాలు, గ్రంథాలయ వినియోగం, పరీక్షల విధానం మరియు ఉన్నత విద్యలో లభించే అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ నంద్రు గోపి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని, కళాశాల కల్పిస్తున్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. షేక్ పీర్ సాహెబ్ మాట్లాడుతూ, విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలు మరియు నైతిక విలువలను పెంపొందించుకోవడం ద్వారా సమాజంలో ఆదర్శ పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. వై. మహేష్ మాట్లాడుతూ, ఉన్నత విద్య ప్రాముఖ్యతను వివరించి, ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, నిరంతర శ్రమతో లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని కోరారు.పరీక్షల విభాగం నుంచి ఎస్. బాబు మాట్లాడుతూ కళాశాల అకాడమిక్ క్యాలెండర్, హాజరు నిబంధనలు, పరీక్షల విధానం, గ్రంథాలయ వినియోగం, కెరీర్ అవకాశాలు మరియు ఉపాధి మార్గాలపై విద్యార్థులకు సమగ్రంగా వివరించారు.



కళాశాల తెలుగు విభాగధిపతి ఇంచార్జ్ ఫిజికల్ డైరెక్టర్ డా. సి.హెచ్. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిలలో రాణించేందుకు కళాశాల తరఫున అవసరమైన అన్ని సౌకర్యాలు, ప్రోత్సాహం మరియు సహకారం అందిస్తామని తెలిపారు. విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించడం ద్వారా శారీరక, మానసిక వికాసం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాఎం. బాలకృష్ణ, డా బి. వెంకటేశ్వర్లు, డా ఓ. చెన్నారావు, డా కె. పద్మారాణి, డాఎం. మాధవి, జి. సుభాషిని తదితరులతో పాటు కళాశాల బోధనేతర సిబ్బంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భర్తతో గొడవపడి ఇంట్లో నుండి బయటకు వెళ్లిన భార్య అదృశ్యం



మల్కాజిగిరి, జూలై 7,(విజన్ ఆంధ్ర): భర్తతో గొడవపడి ఇంట్లో నుండి బయటకు వెళ్లిపోయిన భార్య అదృశ్యమైన సంఘటన నేరేడ్ మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ..నేరేడ్ మెట్ దేవినగర్ కు చెందిన కౌశోత్ బిల్లా, మానస భార్య భర్తలు. ఇటీవల ఇంట్లో డబ్బుల విషయంలో భార్యభర్తల మధ్య చిన్న గొడవ జరిగింది. దానితో మనస్థాపం చెందిన భార్య మానస, తన భర్త ఇంట్లో లేని సమయంలో చెప్పకుండా ఇంట్లో నుండి వెళ్లిపోయింది. ఆమె కోసం భర్త బిల్లు వెతికినా ఫలితం లేకపోవడంతో నేరేడ్మెట్ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం.. ఇద్దరు ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేట



కొత్తగూడెం బ్యూరో జూలై 08(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని చర్ల మండలం గుంపెనగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు సెకండరీ గ్రేడ్ టీచర్లపై జిల్లా విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకుంది. సేవా నిబంధనలను ఉల్లంఘించడం, విధులకు తరచూ గైర్హాజరు కావడం, విద్యా కార్యక్రమాలకు అంతరాయం కలిగించడం వంటి ఆరోపణలు రుజువుకావడంతో వారిని తక్షణమే సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా విద్యాధికారి డి. వాసంతి తెలిపారు. శ్యామల సత్తిబాబు పై అనుమతి లేకుండా తరచూ సెలవులు తీసుకోవడం, విధులకు హాజరు కాకపోవడం, అలాగే మద్యం సేవించిన స్థితిలో పాఠశాలకు వచ్చినట్లు ఆరోపణలు నమోదయ్యాయి. మరో ఉపాధ్యాయురాలు మామిడి చూడామణి కూడా అనుమతి లేకుండా తరచూ సెలవులు తీసుకోవడం వల్ల విద్యా కార్యక్రమాలకు ఆటంకం కలిగించినట్లు నిర్ధారణకు వచ్చినట్లు వెల్లడించారు. ఈ చర్యలు విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు ప్రభుత్వ సేవా నియమాలకు విరుద్ధంగా ఉన్నందున, తెలంగాణ సివిల్ సర్వీసెస్ నియమావళి1991 ప్రకారం ఇద్దరినీ తక్షణమే సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాధికారి తెలిపారు. జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదల, పాఠశాలల్లో క్రమశిక్షణ, విద్యార్థుల భవిష్యత్తు పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే ఉద్యోగులపై ఇలాంటి కఠిన చర్యలు భవిష్యత్తులోనూ కొనసాగుతాయని జిల్లా విద్యాధికారి స్పష్టం చేశారు.

# బూడిదగడ్డ ప్రభుత్వ హైస్కూల్‌లో షీ టీమ్ అవగాహన కార్యక్రమం



కొత్తగూడెం బ్యూరో జూలై 08(విజన్ ఆంధ్ర) : బూడిదగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థినుల భద్రత, మహిళల రక్షణ మరియు అత్యవసర సేవల వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డయల్112 అత్యవసర సేవలు, టీ సేఫ్ యాప్ , మహిళలు, బాలికలపై జరిగే నేరాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఎస్ఐ లక్ష్మణ్ మాట్లాడుతూ, సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాల పట్ల అవగాహనతో పాటు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని, చెడు సావాసాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండి జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని ఎంచుకుని దాని సాధనకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. డయల్112 సేవల ద్వారా పోలీసు, అగ్నిమాపక, అంబులెన్స్, మహిళా మరియు బాలల రక్షణకు సంబంధించిన అత్యవసర సహాయాన్ని ఒకే నంబర్ ద్వారా పొందవచ్చని వివరించారు. అలాగే టీ సేఫ్ యాప్ ద్వారా ప్రయాణ సమయంలో తమ భద్రతను మరింత మెరుగుపరుచుకోవచ్చని, యాప్‌ను ఉపయోగించే వారి ప్రయాణాన్ని పోలీసులు పర్యవేక్షిస్తూ అవసరమైన భద్రతా చర్యలు తీసుకుంటారని తెలిపారు. మహిళలు, విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా భయపడకుండా షీ టీమ్‌ను 8712682131 నంబర్‌లో సంప్రదించాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మధురవాణి, ఉపాధ్యాయులు, షీ టీమ్ ఏఎస్ఐ నాగయ్య, కానిస్టేబుల్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

**- 5 సెల్‌ఫోన్లు, దొంగిలించిన ద్విచక్ర వాహనం స్వాధీనం**


**- ఇద్దరు నిందితులను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించిన వేములవాడ టౌన్ పోలీసులు**



వేములవాడ, జూలై 7 (విజన్ ఆంధ్ర బ్యూరో): అంతర్ జిల్లా స్థాయిలో సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి దొంగిలించిన ఆస్తిని స్వాధీనం చేసుకున్నట్లు వేములవాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ వీర ప్రసాద్ తెలిపారు. సోమవారం వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, వారు కరీంనగర్‌కు చెందిన దుర్గం సాయి కృష్ణ (23), ఎస్‌కే సల్మాన్ (25)గా గుర్తించారు. విచారణలో కరీంనగర్, వేములవాడ ప్రాంతాల్లో పలు సెల్‌ఫోన్‌లు, మోటార్ సైకిళ్లు మరియు ఇతర వస్తువులను దొంగిలించినట్లు నిందితులు ఒప్పుకున్నారు. నిందితుల వద్ద నుంచి ఒక దొంగిలించిన హీరో స్ప్లెండర్ మోటార్ సైకిల్ (నెం. AP15 AS 2592)తో పాటు మొత్తం ఐదు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దొంగిలించిన వస్తువులను విక్రయించి వచ్చిన నగదును మద్యం సేవించడం, ఇతర విలాసాలకు ఖర్చు చేసినట్లు విచారణలో వెల్లడైంది. అలాగే గతంలో ఈ ఇద్దరు నిందితులపై కరీంనగర్, కొత్తపల్లి పోలీస్ స్టేషన్లలో దొంగతనం, గంజాయి సంబంధిత కేసులు నమోదై జైలుకు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ వీర ప్రసాద్ మాట్లాడుతూ, ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి మాత్రమే బయటకు వెళ్లాలని, విలువైన వస్తువులను నిర్లక్ష్యంగా ఉంచవద్దని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. అంతర్ జిల్లా దొంగలను అరెస్ట్ చేసి, దొంగిలించిన ఆస్తిని స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ రామ్మోహన్, పోలీస్ కానిస్టేబుళ్లు గోపాల్, ఖాజా ఇమ్రానుద్దీన్, సల్మాన్‌లను ఇన్‌స్పెక్టర్ శ్రీ వీర ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు.

## ఎన్యూమరేషన్ పత్రాలను త్వరగా పూరించి బిల్ వోలకు అందించాలి

**- 55 వ డివిజన్ కార్పొరేటర్ గాండ్ల సత్యమ్మ**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 07,(విజన్ ఆంధ్ర ) : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్ ) ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల్లో సరైన వివరాలు త్వరగా పూరించి బూత్ లేవల్ అధికారులు (బి ఎల్ వో ) కు అందించాలని 55 వ డివిజన్ కార్పొరేటర్ గాండ్ల సత్యమ్మ అన్నారు.మంగళవారం 55 వ డివిజన్లో పర్యటించి బి ఎల్ వో, బి ఎల్ ఏ ల పనితీరును పరిశీలించారు.అనంతరం సత్యమ్మ మాట్లాడుతూ డివిజన్ లోని ప్రజలు ఎన్యూమరేషన్ పత్రాలు పూరించి, బిల్ వో లకు అందిస్తేనే ఓటరు జాబితాలో మీ పేరు ఉంటుందని,ఎన్యూమరేషన్ పత్రాలు తిరిగి బిల్ వో లకు ఇవ్వకుంటే ఓటరు పేరు జాబితాలో ఉండదని అన్నారు. ఎన్యూమరేషన్ పత్రాలను పూర్తి వివరాలతో నింపి వెంట వెంటనే బిల్ వో లకు అందజేయాలని ఓటర్లను కోరారు. బిల్ వో లు సైతం వీటికోసం ఓటర్ల వద్దకు వస్తారని తెలిపారు.ఓటరు ప్రస్తుత ఫోటో మార్చుకోవాలంటే మరో ఫోటో సైతం అందజేయాలనీ తెలిపారు.ఓటరుకు ఏమైన సందేహాలుంటే బిల్ వో లను సంప్రదించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో బిల్ వో లు రమాదేవి, మౌనిక, బిల్ ఏ లు బషీరోద్దిన్, వెంకటేష్ ఉన్నారు.

# ప్రజా సంక్షేమ పథకాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి

**- మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్**

**- డివిజన్ అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేత**



బోడుప్పల్, జూలై 7 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి క్షేత్రస్థాయిలో తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రతి నాయకుడు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. మంగళవారం బోడుప్పల్‌లోని తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో మేడ్చల్ నియోజకవర్గానికి చెందిన నూతనంగా జిల్లా కాంగ్రెస్ కమిటీలో చోటు దక్కించుకున్న కార్యవర్గ సభ్యులు, నూతనంగా ఎన్నికైన డివిజన్ అధ్యక్షులు 9వ డివిజన్ (మేడిపల్లి) తుంగతుర్తి రవి, 10వ డివిజన్ (పీర్జాదిగూడ) బండి శ్రీరాములు,11వ డివిజన్ (బోడుప్పల్)బొమ్మక్ కళ్యాణ్ కుమార్, 12వ డివిజన్ (చెంగిచెర్ల) పోగుల దిలీప్ రెడ్డిలకు తోటకూర వజ్రేష్ యాదవ్ నియామక పత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేదలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, సన్న బియ్యం పంపిణీ, తెల్ల రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ అట్టడుగు వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు, విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం వంటి కార్యక్రమాలను అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, వాటి ప్రయోజనాలను ప్రతి కుటుంబానికి వివరించాలని పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులకు సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, పార్టీ బలోపేతానికి సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఫర్టిలైజర్ యాప్‌తో ఎరువుల కొనుగోలు సులభం

**- సాగు అవసరాలకు అనుగుణంగా ముందస్తు బుకింగ్ చేసుకోవాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- జిల్లెల పీఏసీఎస్, గ్రోమోర్ కేంద్రాల్లో ఎరువుల నిల్వలపై ఆకస్మిక తనిఖీ**





తంగళ్లపల్లి రాజన్న సిరిసిల్ల, జూలై 7 (విజన్ ఆంధ్ర బ్యూరో): రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఫర్టిలైజర్ యాప్ సేవలను రైతులు సద్వినియోగం చేసుకుని, సాగు అవసరాలకు అనుగుణంగా ముందస్తుగా ఎరువులు బుక్ చేసుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. మంగళవారం తంగళ్లపల్లి మండలం జిల్లెల గ్రామంలోని గ్రోమోర్ కేంద్రం, నేరేళ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో యూరియా నిల్వలు, ఇటీవల వచ్చిన ఎరువుల వివరాలు, ఫర్టిలైజర్ యాప్ ద్వారా నమోదైన బుకింగ్‌లను మొబైల్ యాప్, రిజిస్టర్ల ద్వారా పరిశీలించారు. అనంతరం గోదాముల్లో ఉన్న యూరియా నిల్వలను తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎరువుల కోసం వచ్చిన రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. వారు ఏ గ్రామం నుంచి వచ్చారు, ఎంత భూమిలో సాగు చేస్తున్నారు, ఏయే పంటలు పండిస్తున్నారు, ఫర్టిలైజర్ యాప్‌ను వినియోగిస్తున్నారా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫర్టిలైజర్ యాప్ అమలుతో క్యూల్లో గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం తగ్గిందని, తమకు అనుకూలమైన సమయంలో, నచ్చిన ఎరువుల విక్రయ కేంద్రం నుంచి యూరియా పొందే అవకాశం కలిగిందని రైతులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు ఫర్టిలైజర్ యాప్ ద్వారా ముందస్తుగా బుకింగ్ చేసుకుని ఎరువులను సులభంగా పొందవచ్చన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని స్పష్టం చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ అధికారుల సలహాల మేరకు పంటల సాగు చేపట్టాలని, సాంప్రదాయ పంటలతో పాటు ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై కూడా రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఈ తనిఖీలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రాజెక్టుకు కోమురం భీం పేరు పెట్టి అవమానిస్తున్నారు

**- కోమురం భీం ప్రాజెక్ట్ ను నిర్లక్ష్యం చేస్తున్న జిల్లా అధికారులు,**

**- సాగునీరు అందించని ప్రాజెక్ట్ నిర్మించి రైతులకు ఏం లాభం. కాంట్రాక్టర్లకు తప్ప**

**- ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు నిద్రలోంచి మేల్కొవాలి, ప్రమాద అంచున ఉన్న ప్రాజెక్ట్ కు మరమ్మత్తులు చేపట్టాలి**

**- భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డి.వై.ఎఫ్.ఐ) ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 7 (విజన్ ఆంధ్ర) : గిరిజన పోరాటయోధుడు కోమురం భీం చేసిన పోరాట నినాదాలైనటువంటి లిజల్ జంగల్ జమీన్‌లి లలో మొదటిదైన జల్ జిల్లా లోని ప్రజలకు దక్కకుండా పోతోందని, 2007 లో 10 టి.ఎం.సి ల సామర్థ్యంతో, 45,500 ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్ట్ నిర్మించినప్పటికీ ఆ స్థాయిలో రైతులకు నీరు అందించడం లేదని. ప్రస్తుతం ఆనకట్ట కుంగిపోవడంతో 10 టి.ఎం.సి ల సామర్థ్యమున్న దాన్ని దాదాపు 4 టి. ఎం.సి లకు తగ్గించడం జరిగిందని. తద్వారా మిషన్ భగీరథ తాగునీటికి కూడా కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నదని. అదేజరిగితే ప్రజలు తాగునీటికోసం రోడ్ల మీదకు వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు చేసే పరిస్థితి ఏర్పడుతుందని. అంతేకాకుండా నవేగూడ, ఘాట్ జనగాం, తేజపూర్ గ్రామాల వరకు కెనాల్ నిర్మించినప్పటికీ నీరు సరఫరా చేయకపోవడంతో రైతులే స్వయంగా బోర్ వేసుకుని వ్యవసాయం చేసుకునే దయనీయ స్థితికి ప్రభుత్వం తీసుకువచ్చింది అని లిభారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డి.వై.ఎఫ్.ఐ) కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ అన్నారు. అంతేకాకుండా జిల్లా గత ఇంచార్జి మంత్రిగా ఉన్న సీతక్క ఇచ్చిన మాట ప్రకారం మరమ్మత్తులు చేపట్టకపోవడం, అలాగే ప్రస్తుతం ఇంచార్జీగా ఉన్న జూపల్లి కృష్ణారావు, అదేవిధంగా స్థానిక ఎం.ఎల్.ఏ కోవ లక్ష్మీ అయినా ప్రాజెక్ట్ మరమ్మత్తుల కోసం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం, అసెంబ్లీలో మాట్లాడకపోవడం, ద్వారా జిల్లా అభివృద్ధిపై వారికున్న చిత్తశుద్ధి ఏ పాటిదో అర్థమవుతున్నది కార్తీక్ అన్నారు. జిల్లా అభివృద్ధికి కావలసినంత నిధులు కూడా గట్టిగా అడిగి తీసుకోలేనటువంటి ఎం.ఎల్.ఏ ఉండి ఏం లాభం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాకాలం ప్రారంభం అయ్యి వర్షాలు జోరుగా పడితే ఆనకట్ట పూర్తిగా ధ్వంసం అయ్యే పరిస్థితి ఉందని, ఆదే గనక జరిగితే లోతట్టు ప్రాంతాలైన నవెగూడ, ఖిరిడీ, ఘాట్ జనగాం, తేజిగూడ, జైత్పూర్, బోర్దా, గుండి గ్రామాల ప్రజలను కలుపుకుని జిల్లా కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం అని, అలాగే ఎం.ఎల్.ఎ, మంత్రి కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. లిఈ కార్యక్రమంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డి.వై.ఎఫ్.ఐ) జిల్లా అధ్యక్షుడు గెడం టికానంద్, ఉపాధ్యక్షుడు దుర్గం నిఖిల్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, జిల్లా నాయకులు వెంకటేష్,శ్రీరామ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కార్గో సెంటర్లో వినియోగదారులు తీసుకెళ్ళని వస్తువులకు వేలం పాట

**- ఆర్టీసీ డిపో మేనేజర్ నరేష్ కుమార్**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 07,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల ఆర్టీసీ డిపోలో వినియోగదారులు తీసుకువెళ్లని వస్తువులకు వేలం పాట నిర్వహించడం జరుగుతుందని మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ కే. నరేష్ కుమార్ మంగళవారం తెలిపారు.మంచిర్యాల ఆర్టీసీ డిపో కార్గో సెంటర్‌లో వినియోగదారులు తీసుకెళ్ళని వస్తువులకు ఈ నెల 9,10,13 తేదీల్లో వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేలంలో స్టేషనరీ, స్పేర్ పార్ట్స్, సినిమా పోస్టర్లు, పుస్తకాలు తదితర వస్తువులు వినియోగదారులు తీసుకువెళ్లని వాటికీ వేలం పాట చేపడుతున్నట్లు తెలిపారు.ఈ వేలం పాటలో మంచిర్యాల ప్రాంత ప్రజలతో పాటు, చుట్టు ప్రక్కల ప్రాంతాల ప్రజలు వేలంలో పాల్గొని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.వేలం పాట రోజు ఉదయం 11 గంటలకు మంచిర్యాల బస్టాండ్ వద్ద గల కార్గో సెంటర్ వద్దకు చేరుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

## 16న నగరంలో డబ్ల్యూఎంఎన్సీ-26 ప్రారంభం




హైదరాబాద్, జూలై 07 (విజన్ ఆంధ్ర) : జూలై 16-18 తేదీల్లో హైటెక్స్‌లో జరగనున్న వరల్డ్ మిఠాయి అండ్ నమకీన్ కన్వెన్షన్(డబ్ల్యూఎంఎన్సీ-2026) పర్చేసింగ్ ఎడిషన్ పోస్టర్‌ను మంగళవారం నగరంలో ఆవిష్కరించినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 300కిపైగా ఎగ్జిబిటర్లు, 30 వేలకుపైగా వ్యాపార సందర్శకులు హాజరుకానున్న ఈ కన్వెన్షన్‌లో ముడి పదార్థాలు, డ్రైఫ్రూట్స్, యంత్రాలు, ప్యాకేజింగ్, గిఫ్టింగ్, ఆటోమేషన్, వ్యాపార సేవల ప్రదర్శనలు, సాంకేతిక సదస్సులు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే ఫన్నా బాబు మెమోరియల్ డబ్ల్యూఎంఎన్సీ క్రికెట్ లీగ్ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని తెలిపారు. ప్రారంభోత్సవానికి అనుముల బాబూరావు(కేఫ్ నిలోఫర్), మహ్మద్ అబ్దుల్ మజీద్(పిస్తా హౌస్), రాజేష్ దాదు(దాదూస్), నాగార్జున ముప్పాల(ఆల్మండ్ హౌస్), పూనమ్‌చంద్ పన్వార్(బాలాజీ రతన్‌లాల్), సుధీర్ షా(స్కూప్స్ ఐస్‌క్రీమ్) హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిరోజ్ హెచ్.నక్వీ, మల్లి బాబు, హేమంత్ గెహ్లోత్, డోరా రాజు, కల్నల్ భాస్కర్, ఇమ్తియాజ్ సిద్ధిఖీ, జితేష్ వఖారియా, నిలీష్ దేధియా, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# దండు గ్రామంలో ఘనంగా బోనాల పండుగ



మక్తల్ జులై 7 (విజన్ ఆంధ్ర) : మక్తల్ మండల పరిధిలోని దండు గ్రామంలో మంగళవారం మారెమ్మ తల్లికి బోనాల పండుగ కన్నుల పండుగగా కొనసాగింది. బోనాల పండుగ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటి నుండి బోనాలను మహిళలు ఎత్తుకొని గ్రామ పురవీధుల గుండా డప్పు మేళా తాళాలతో ఊరేగింపును నిర్వహించారు.ఈ ఊరేగింపులో బోనాలు ఎత్తుకున్న మహిళల పూనకాలు చేస్తూ అమ్మవారి దేవాలయానికి చేరుకున్నారు.అనంతరం తలపై మోసుకున్న మహిళలు దేవాలయం చుట్టూ ఐదు ప్రదక్షిణలు నిర్వహించి బోనాలను అమ్మవారికి సమర్పించారు.అమ్మవారికి మేకలు కోళ్లతో బలి ఇచ్చి మొక్కలను భక్తులు తీర్చుకున్నారు.సాయంత్రం అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి దర్శించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. మంత్రి శ్రీహరి వాకిటి కి దండు గ్రామానికి చెందిన పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి దేవాలయంలో శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

# డబుల్ మర్డర్ కేసులో సంచలన తీర్పు

## - నిందితుడికి రెండు హత్య కేసుల్లో యావజ్జీవ కారాగార శిక్ష

**- దర్యాప్తు బృందం, ప్రాసిక్యూషన్‌ను అభినందించిన జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



రాజన్న సిరిసిల్ల, జూలై 7 (విజన్ ఆంధ్ర బ్యూరో): రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రెండు వేర్వేరు హత్య కేసుల్లో నిందితుడు వంగా సందీప్ రెడ్డికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ మంగళవారం యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే వెల్లడించారు. పోలీసుల సమగ్ర దర్యాప్తు, శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలను కోర్టు పరిగణనలోకి తీసుకుని ఈ తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

**భూ వివాదాలే హత్యలకు కారణం**

మొదటి కేసులో, గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బీనబోయిన దేవయ్యతో కొనసాగుతున్న భూ వివాదం నేపథ్యంలో 2018 మార్చి 17న కుటుంబ వేడుకలో దేవయ్యపై కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ రవీందర్ దర్యాప్తు చేపట్టి అనంతరం సీఐ బన్సీలాల్ చార్జ్‌షీట్ దాఖలు చేశారు.

రెండో కేసులో, కామారెడ్డి జిల్లాకు చెందిన మన్నె నరసింహులతో భూ వివాదం కారణంగా 2022 జూలై 31న పార్టీ సందర్భంగా గొడ్డలితో దాడి చేసి హత్య చేసినట్లు కేసు నమోదైంది. అప్పటి సీఐ మొగిలి దర్యాప్తు పూర్తి చేసి నిందితుడిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు.

**20 మంది సాక్షులతో బలమైన వాదనలు**

ఈ రెండు కేసుల విచారణలో అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ బృందం సమన్వయంతో 20 మంది సాక్షులను కోర్టు ముందు ప్రవేశపెట్టారు. అప్పటి పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించగా, శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిందితుడికి రెండు కేసుల్లోనూ యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

**నేరస్థులు శిక్ష నుంచి తప్పించుకోలేరు**

సమాజంలో నేరాలకు పాల్పడిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని, సమర్థవంతమైన దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాలతో నిందితులకు శిక్షలు పడేలా జిల్లా పోలీసులు కట్టుదిట్టంగా పనిచేస్తున్నారని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈ సందర్భంగా కేసుల దర్యాప్తు, కోర్టు విచారణలో సమర్థంగా పనిచేసిన అదనపు ఎస్పీ చంద్రయ్య, అప్పటి పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్, ప్రస్తుత డీఎస్పీ నాగేంద్రచారి, అప్పటి మరియు ప్రస్తుత సీఐలు రవీందర్, మొగిలి, బన్సీలాల్, వెంకటేష్, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# పేటలో ఎమ్మార్పీఎస్ 32 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నారాయణపేట , జూలై 7 ( విజన్ ఆంధ్ర) : నారాయణపేట జిల్లా కేంద్రంలో 32వఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.నారాయణపేట జిల్లా కేంద్రం 9వ వార్డు ఎస్సీ కాలనీలో జెండాను నారాయణపేట జిల్లా ఇంఛార్జి మంద నర్సింహ మాదిగ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రకాశం జిల్లా, ఈదుముడి గ్రామంలో జూలై 7న ఎమ్మార్పీఎస్ పురుడు పోసుకుని నేటికీ 32 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆవిర్భావ వేడుకలను నిర్వహించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా సాగిన ఉద్యమంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ ని ఒప్పించి వర్గీకరణ ఫలాలను అందరికీ అందే విధంగా సాధ్యపడిందని ఆయన అన్నారు .ఇప్పటి వరకు 15 డిమాండ్ల తో మొదలైన ఉద్యమం.. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు పొందుతున్న చిన్న పిల్లల గుండె జబ్బుల కోసం పుట్టిన ఆరోగ్య శ్రీ కి మొట్ట మొదటగా ఆద్యం పోసింది మన ఉద్యమమే.. అలాగే దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కానిది మన రాష్ట్రంలో వృద్ధులకు 4000 వేల పెన్షన్ రావడానికి ఉద్యమ ఫలితమే..రేషన్ బియ్యం ఒక్కరికి ఆరు కిలోల చొప్పున కుటుంబంలో ఎంత మంది ఉన్నా ఆరు కిలోల చొప్పున ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ వల్లనే సాధ్యమైందని అన్నారు. పేద ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మార్పీఎస్ ఎప్పుడు ముందు ఉంటుందని ఆయన పేర్కొన్నారు.అనంతరం కేక్ కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో నారాయణపేట మండల ఇంఛార్జి వినయ్ మాదిగ,బుడగ జంగాల జిల్లా నాయకులు చల్ల వెంకటేష్,అశోక్ మాదిగ,వెంకట్ మాదిగ,అనిల్ మాదిగ,ఆనంద్ మాదిగ, మహేష్ మాదిగ, ఆనంద్ మాదిగ, ఆనంద్ మాదిగ, మొగులప్ప, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మిక పారిశ్రామిక సహకార సంఘం బలోపేతానికి కృషి చేస్తా

**- చేనేత కార్మికుల పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా గండూరి రమేష్**



సూర్యాపేట జూలై 07:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట చేనేత కార్మికుల పారిశ్రామిక సహకార సంఘం బలోపేతానికి సభ్యులందరినీ కలుపుకొని కృషి చేస్తానని చేనేత కార్మికుల పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు గండూరి రమేష్ అన్నారు. ఇటీవల జరిగిన సూర్యపేట చేనేత కార్మికుల పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్లు మంగళవారం కార్యాలయంలో సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా గండూరి రమేష్, ఉపాధ్యక్షులుగా చిలివేరు నరసింహారావు, కార్యదర్శిగా భీమనపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ముషం హరిప్రసాద్ లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి షేక్ బాజీ తెలిపారు. అనంతరం డైరెక్టర్ల సమక్షంలో నూతన అధ్యక్షుడిగా గండూరి రమేష్ బాధ్యతలు స్వీకరించి మాట్లాడుతూ చేనేత కార్మికుల పారిశ్రామిక సహకార సంఘం బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన సభ్యులకు, డైరెక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నూతన డైరెక్టర్లు ముషం యాదమ్మ, విడం నీరజ, పెద్ది శ్రీనివాస్, యలగందుల లక్ష్మయ్య, యలగందుల సాయినేత తో పాటు సంఘ నాయకులు కదారి బిక్షం, బాల్నే మల్లయ్య, యలగందుల సుదర్శన్, దూలం నగేష్, ఎస్.రాములు,తదితరులు ఉన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి..



సూర్యాపేట జూలై 07:(విజన్ ఆంధ్ర) : ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని 25వ వార్డు కౌన్సిలర్ కోడి శిరీష శివ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 25వ వార్డులో వాసన్ లేజర్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో కంటి సంబంధిత సమస్యలు చిన్నవారి నుంచి పెద్దవారి వరకు ఎక్కువగా కనిపిస్తున్నాయని అన్నారు. కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే పరీక్షలు చేయించుకోవడం ద్వారా తీవ్రమైన ఇబ్బందులను నివారించవచ్చని సూచించారు.ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు కూడా చేస్తారని అన్నారు.ప్రజలు ఇటువంటి ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మోర శబరి, సాయి, శివరాజు బోయిన సాయి, కోడి రాజేష్, నాగరాజు, వెన్నెల, రమణ, గౌతమ్, వెంకన్న, వాసన్ లేజర్ కంటి ఆసుపత్రి సిబ్బంది జనార్ధన చారి, సిహెచ్ శంకర్, నిస్సి తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ కార్పొరేట్ విద్య సంస్థలల్లో అధిక ఫీజులను నియంత్రించాలి



సూర్యాపేట జూలై 07:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంలో అధిక ఫీజుల నియంత్రణ గురించి భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో డి ఆర్ ఓ డి. ప్రేమ్ రాజు కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులు బంటు సందీప్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలోని కొన్ని ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు, అదే విధంగా స్టేషనరీ పేరుతో పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాల నుండి రక రకాల కోర్సుల ఐఐటీ, జేఈఈ మెయిన్, నీట్ కోర్సుల పేరుతో ఒక్కో విద్యార్థి దగ్గర నుండి వేలాది రూపాయలు విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర వసూలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారని అన్నారు.పేద మధ్య తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజు కట్టే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ఇట్టి విషయాము పై పూర్తి స్థాయిలో విచారణ జరిపి అధిక ఫిజులు వసూలు చేస్తున్న, నిబంధనలకు విరుద్ధంగా స్టేషనరీ విక్రయిస్తున్న ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలల పై తగు చర్యలు తీసుకోని అధిక ఫీజులను నియంత్రించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులు చామకూరి మహేందర్, లావూరి వాసు, బాదే అంజి, ఎలబోయిన వంశి, వి.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా సాగిన "కనకదుర్గ నృత్య విభావరి" 44వ వార్షికోత్సవ వేడుకలు

హైదరాబాద్ జులై 2026 విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ విశ్వనాథ్) : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో, ప్రముఖ భరతనాట్య నృత్య శిక్షణా సంస్థ "కనకదుర్గ నృత్య విభావరి" 44వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థ వ్యవస్థాపకురాలు, ప్రఖ్యాత నాట్య గురువు, డైరెక్టర్ "కనకదుర్గ నృత్య విభావరి", పాలకమండలి సభ్యురాలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, లయన్ నిర్మలా ప్రభాకర్ నేతృత్వంలో 'కనకదుర్గ నృత్య విభావరి' లో నృత్యం నేర్చుకుంటున్న నృత్య కుసుమాలచే భరతనాట్య నృత్య విభావరి ప్రదర్శన కార్యక్రమం కన్నుల పండుగగా, శ్రవణానందకరంగా సాగింది. ప్రేక్షకులను విశేషంగా అలరించి, ఆకట్టుకుంది .సోమవారం సాయంత్రం రవీంద్రభారతి మెయిన్ హాల్, సైఫాబాద్, హైదరాబాద్ వేదికగా నేత్రపర్వంగా సాగిన ఈ వార్షికోత్సవ వేడుకకు ముఖ్యఅతిథిగా మాజీ ఐఏఎస్ అధికారి, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్. కె.వి.రమణ హాజరై శు భాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా కోలేటి దామోదర్ గగుప్తా తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ పూర్వ చైర్మన్ వ్యవహరించగా, సభా ప్రారంభం డాక్టర్. ఏనుగు నరసింహారెడ్డి, ఐఎఎస్ సంచాలకుడు బాషా సాంస్కృతిక శాఖ చేశారు. ఈ నృత్యోత్సవం కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా డాక్టర్. వనజ ఉదయ్ డీన్. అకాడమిక్ అఫైర్స్, సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ, హైదరాబాద్, పద్మ కళ్యాణ్ వజ్జ ఫౌండర్ అండ్ డైరెక్టర్. సంచలన స్కూల్ ఆఫ్ డ్యాన్స్, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞ శర్మ, అధ్యక్షుడు యువకళావాహిని సాంస్కృతిక సంస్థ లంక లక్ష్మీనారాయణ, వ్యవస్థాపక అధ్యక్షుడు, కుసుమ కమలారత్నం మోమోరియల్ ట్రస్ట్ లయన్ డాక్టర్. కుసుమ భోగరాజు, ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ ది స్కూల్ అండ్ అకాడమున్ స్కూల్ రెహన ఖాన్ పాల్గొని నేత్రపర్వంగా వివిధ భరతనాట్యం నృత్యంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్న "కనకదుర్గ నృత్య విభావరి"





విద్యార్థుల నృత్యాలను తిలకించి వారిని అభినందించి మొమెంటోలను, ప్రశంసా పత్రాలను అందజేసి సత్కరించారు. గత నాలుగు దశాబ్దాలకు పైగా సంప్రదాయ భారతనాట్యం నృత్యాన్ని ఎన్నో వేలమందికి నేర్పిస్తూ వారిని గొప్ప నృత్య కళాకారులుగా తీర్చిదిద్దున్న నాట్య గురువు 'నిర్మలా ప్రభాకర్' ను అతిథులు, విద్యార్థులు ఈ సంధర్భంగా ప్రశంశించి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వార్షిక నృత్యోత్సవం కార్యక్రమంలో నయనానందకరంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నృత్యాంశాలకు చక్కటి వాయిద్య సహకారం, గాత్రం శ్రీవల్లిశర్మ అందించిగా మృదంగంపై శ్రీధరాచార్య, వయోలిన్ పై కోలంకి అనిల్, వేణువు పై ఉమా వెంకటేశ్వర్లు విశేషంగా సహకరించారు. కార్యక్రమానికి మోహనకృష్ణ వ్యాఖ్యాతగా వ్యవహరించి సమన్వయం చేశారు.

# ఆకట్టుకున్న "వాఘె కళారూపం" గోండు ఆదివాసీ జానపద వైభవం







హైదరాబాద్ జులై 2026, విజన్ ఆంధ్ర (ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : ప్రతిష్ఠాత్మకంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సమర్పణలో రవీంద్రభారతి లోని "పాల్కురికి సోమన మూల" వేదికపై జయప్రథంగా నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక కళా రూపాల మహోత్సవంలో భాగంగా, సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన 97వ రోజు కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా మారుతి బృందం ప్రదర్శించిన వాఘె ఆదివాసీ జానపద కళారూపం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆదిలాబాద్ గిరిజనుల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి ఆరాధనను ప్రతిబింబించే గోండు భాషా జానపద గీతాలు, డప్పు, డోలక్, బోండ్కా వంటి సంప్రదాయ వాద్యాల మేళవింపుతో అద్భుతంగా వినిపించాయి. రంగురంగుల సంప్రదాయ వస్త్రధారణ, ప్రత్యేక ఆహార్యం, ఉత్సాహభరితమైన నృత్య విన్యాసాలు ప్రేక్షకులను ఆద్యంతం అలరించి, గిరిజన సంస్కృతికి అద్దం పట్టాయి. ఈ ప్రదర్శనలో డప్పుపై విఠల్ ఆజిక్, బోండ్కాపై రాందాస్, డోలక్‌పై ఖండు గైక్వాడ్ తమ అద్భుతమైన వాద్య సహకారంతో కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చారు. ఈ కార్యక్రమానికి భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులడు డాక్టర్. ఏనుగు నర్సింహా రెడ్డి, సహాయ సంచాలకులు పి. నర్సింలు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. పి. విజయ్ కుమార్ హాజరై కళాకారులను ఘనంగా సత్కరించి అభినందించారు. అలాగే సాంస్కృతిక సలహా మండలి సభ్యులు ముచర్ల దినకర్, పల్లె నర్సింహులు, సాంస్కృతిక శాఖ సిబ్బంది, సాంస్కృతిక సారధి కలకారులు కార్యక్రమంలో పాల్గొని గోండు ఆదివాసీ కళాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతలుగా విద్యానందా చారి, శ్రీనివాస రాజు వ్యవహరించి, గోండు ఆదివాసీ సంస్కృతిని విశిష్టతను ప్రేక్షకులకు పరిచయం చేశారు.

# సైబర్ మోసాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలి

**- డబ్బులు నష్టపోయిన బాధితులకు త్వరగా రీఫండ్ అందేలా కృషి చేయాలి.**

**- అపరిచితులకు వ్యక్తిగత వివరాలు, పిన్ నంబర్ తెలపొద్దు, డబ్బు పంపించువద్దు.**

**- సైబర్ మోసానికి గురైతే వెంటనే '1930' నెంబర్‌కు ఫిర్యాదు చేయాలి.**

**- సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ**




సూర్యాపేట, జూలై 07: (విజన్ ఆంధ్ర) : సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం జిల్లా పరిధిలోని సైబర్ వారియర్ పోలీస్ సిబ్బందికి సైబర్ క్రైమ్ వర్టికల్ ట్రైనింగ్ పేరిట ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నరసింహ శిక్షణకు హాజరైన సైబర్ వారియర్స్ ఉద్దేశించి మాట్లాడి, పలు కీలక దిశా నిర్దేశాలు చేశారు. సైబర్ నేరాల బారిన పడి పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితుల పట్ల సిబ్బంది మానవతాదృక్పథంతో వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. బాధితులు ఆర్థికంగా నష్టపోయిన డబ్బును ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి, వీలైనంత త్వరగా తిరిగి వారికి అందేలా కృషి చేయాలన్నారు. జిల్లా సైబర్ సెక్యూరిటీ సెల్ సిబ్బందితో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, సాంకేతికత సహాయంతో సైబర్ మోసగాళ్లను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శిక్షణలో భాగంగా ముఖ్యమైన సాంకేతిక అంశాలపై, జాతీయ స్థాయి యాప్ అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజలకు పలు సూచనలు చేశారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటిపి లు లేదా వ్యక్తిగత గుర్తింపు వివరాలను ఎట్టిపరిస్థితుల్లోనూ చెప్పవద్దని కోరారు. మొబైల్స్, ఈమెయిల్స్‌కు వచ్చే తెలియని లింకులు, సందేశాలకు స్పందించి డబ్బులు పంపవద్దని హెచ్చరించారు. బ్యాంక్ అధికారులు ఎన్నడూ ఫోన్ చేసి ఖాతా వివరాలు అడగరని గుర్తుంచుకోవాలన్నారు. ఉచితాలు, లాటరీ బహుమతులు, తక్కువ ధరకే వాహనాలు వస్తువులు ఇస్తామనే ప్రకటనల వెనుక సైబర్ మోసగాళ్లు ఉంటారని గ్రహించాలన్నారు. అధికారుల పేరుతో, ప్రముఖ వ్యక్తుల పేరుతో నకిలీ ఖాతాలు తెరిచి పోటోలు పెట్టి ఫేస్ బుక్, ఇన్స్టాగ్రాం, వాట్సప్ వంటి వాటిల్లో ఖాతాలు తెరిచి ప్రజలకు సందేశాలు పంపిస్తారు ఇలాంటి నమ్మవద్దు డబ్బులు పంపించవద్దు అని కోరారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, సైబర్ సెక్యూరిటీ సెల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, టేక్ టీం ఆర్ ఎస్ ఐ రాజశేఖర్, సైబర్ వారియర్స్ ఉన్నారు.

# జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి

**- 10న రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ అధికారులకు వినతులు**



రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 07 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరుతూ ఈనెల 10వ తేదీన "జర్నలిస్టుల వినతులు" అనే కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, తన్నీరు శ్రీనివాస్ లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఆర్టీసీ బస్ చార్జీల్లో 1/3 వంతు రాయితీ కల్పించినప్పటికి ఆర్టీసీ సంస్థ మాత్రం దాదాపు 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని, దీనివల్ల నిత్యం వార్తా సేకరణకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే జర్నలిస్టులకు భారమవుతుందని అన్నారు. ప్రభుత్వం చాలా ఏళ్ళుగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో 1/3 రాయితీపై ప్రయాణ సదుపాయం అమలు చేస్తుందని, అయితే ఇటీవల కాలంలో టోల్ ఫీజు, సర్వీస్ చార్జి పేరుతో మూడోవంతు చార్జీలను 50 శాతానికి పెంచారని తెలిపారు. పేరుకే 1/3 చార్జీలని, కానీ 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అనేక మంది జర్నలిస్టులు సరైన వేతనాలు లేకపోయినప్పటికి జర్నలిజం వృత్తిలో కొనసాగుతూ ప్రభుత్వానికి, ప్రజలకు, ఆర్టీసీ సంస్థకు సేవలందిస్తున్నారని, అటువంటి జర్నలిస్టులు వార్తల సేకరణ కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తుందని, ఫలితంగా ఆర్టీసీ ప్రయాణ చార్జీల భారం విపరీతంగా పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ, కొద్ది సంఖ్యలో ఉన్న జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడం వల్ల ప్రభుత్వానికి, ఆర్టీసీ సంస్థకు పెద్ద ఆర్థిక భారమేమీ పడదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులకు అన్ని అర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని వారు కోరారు. ఈ నెల 10వ తేదీన రాష్ట్ర రవాణాశాఖ మంత్రితో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ అధికారులకు అనగా ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, రీజినల్ మేనేజర్లు, డివిజనల్ మేనేజర్లు డిపో మేనేజర్లకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తప్పుడు ప్రచారంపై కేసు నమోదు చేయాలి

**- తెలంగాణ యువజన కాంగ్రెస్ నేత కొత్త సుశాంత్ గౌడ్**

**- మేడిపల్లి పోలీస్ స్టేషన్ సీఐ జలందర్ రెడ్డికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు**




మేడిపల్లి, జూలై 7 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తూ, మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సుశాంత్ గౌడ్ మేడిపల్లి పోలీస్ స్టేషన్ సీఐ జలందర్ రెడ్డికి మంగళవారం లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా కొత్త సుశాంత్ గౌడ్ మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికల ద్వారా అసత్య ప్రచారం, ఫేక్ సమాచారం, మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు వ్యాప్తి చెందుతున్నాయని, ఇలాంటి చర్యలు సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారానికి పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి, సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ప్రజాస్వామ్యంలో అభిప్రాయ స్వేచ్ఛకు గౌరవం ఉన్నప్పటికీ, అసత్య ప్రచారం, ద్వేషపూరిత వ్యాఖ్యలు, మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులకు ఎలాంటి స్థానం లేదన్నారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ భవన్ మీడియా కోఆర్డినేటర్ అజ్మీరా గణేష్ నాయక్, టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ వడ్లోజు ఉమేష్ చారి పాల్గొన్నారు.

# ఈ.వి.ఎం. గోదాము వద్ద పటిష్టమైన భద్రత చర్యలు

**- జిల్లా కలెక్టర్ కె.హరిత...**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జులై 7, (విజన్ ఆంధ్ర) : జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన గోదాము వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం నెలవారి తనిఖీలలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఈవిఎం గోదామును ఎన్నికల విభాగం పర్యవేక్షకులు జమీల్, అధికారులతో కలిసి సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ వి ఎం గోదాము వద్ద భద్రత సిబ్బందిని నియమించి సి.సి. కెమెరాల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. గోదాము వద్ద 24 గంటల పాటు పటిష్టమైన రక్షణతో పాటు నిరంతర పర్యవేక్షణతో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ శ్యామ్ లాల్, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొమ్మిడి నర్సింహారెడ్డికి వేదకుమార్ నివాళి

**-మూసీ నది పరిరక్షణ ఉద్యమంలో చురుకైన పాత్ర**



హైదరాబాద్, జూలై 07 (విజన్ ఆంధ్ర) : భువనగిరి మాజీ ఎమ్మెల్యే, సీనియర్ ప్రజా నాయకుడు కొమ్మిడి నర్సింహారెడ్డి మృతి పట్ల తెలంగాణ రిసోర్స్ సెంటర్ చైర్మన్ వేదకుమార్ మణికొండ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ప్రజాసేవ, సామాజిక సేవ పట్ల ఆయనకున్న అంకితభావం, నిరాడంబర వ్యక్తిత్వం చిరస్మరణీయమని పేర్కొన్నారు. మూసీ నది పరిరక్షణ ఉద్యమంలో కొమ్మిడి నర్సింహారెడ్డితో తనకు సుదీర్ఘ అనుబంధం ఉందని వేదకుమార్ తెలిపారు. మూసీ నది సంరక్షణ, పునరుజ్జీవనానికి సంబంధించిన అనేక కార్యక్రమాలు, చర్చలు, అవగాహన సదస్సుల్లో ఆయన చురుకుగా పాల్గొని పర్యావరణ పరిరక్షణపై విలువైన సూచనలు అందించారని గుర్తుచేశారు. ఆయన మరణంతో ప్రజా జీవితంలో నిబద్ధత కలిగిన నాయకుడిని, పర్యావరణ ఉద్యమానికి అండగా నిలిచిన ఆత్మీయ మిత్రుడిని కోల్పోయామని వేదకుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొమ్మిడి నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# సమయపాలనతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- భూ భారతి, సాదాబైనామా దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని ఆదేశం**

**- తంగళ్లపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ**



తంగళ్లపల్లి రాజన్న సిరిసిల్ల, జూలై 7 (విజన్ ఆంధ్ర బ్యూరో): రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. మంగళవారం తంగళ్లపల్లి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, భూ భారతి, సాదాబైనామా దరఖాస్తుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పలు దరఖాస్తులను స్వయంగా పరిశీలించి వాటి పరిష్కార ప్రక్రియపై అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అధికారులు ప్రతిరోజూ సమయానికి విధులకు హాజరై అందుబాటులో ఉండాలని ఆదేశించారు. భూ భారతి, సాదాబైనామా కింద అందిన దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. అలాగే కార్యాలయంలోని ఫైళ్లు, రికార్డులను క్రమబద్ధంగా భద్రపరచడంతో పాటు కార్యాలయ ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో ఇంచార్జి తహసీల్దార్ మురళి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆయిల్‌పామ్ నాట్లకు ముందే డ్రిప్ ఏర్పాటు పూర్తి చేయాలి

- జాప్యం చేస్తే డ్రిప్ కంపెనీలను బ్లాక్‌లిస్ట్ చేస్తాం
- ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడులు పొందాలి
- జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యాంప్రసాద్



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై–07(విజన్ ఆంధ్ర) : ఆయిల్‌పామ్ తోటల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని, తోటల నాటడానికి ముందే ప్రభుత్వం మంజూరు చేసిన డ్రిప్ ఇరిగేషన్ వ్యవస్థలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి గడ్డం శ్యాంప్రసాద్ డ్రిప్ కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. మంగళవారం పెద్దపల్లి మండలంలో డ్రిప్ ఏర్పాటు చేసిన పలు పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం మంజూరు చేసిన డ్రిప్ సామగ్రిని రైతులకు సకాలంలో అందజేసి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సరఫరాలో గానీ, ఏర్పాటు పనుల్లో గానీ ఎటువంటి నిర్లక్ష్యం వహించినా, జాప్యం జరిగినా సంబంధిత కంపెనీలను బ్లాక్‌లిస్ట్ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రిప్ కంపెనీల నిర్లక్ష్యం వల్ల ఒక్క ఆయిల్‌పామ్ మొక్క కూడా ఎండిపోకూడదని, ప్రతి మొక్కకు సక్రమంగా నీరందేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు చేస్తూ, పైపులైన్ల ఏర్పాటు కోసం ట్రెంచ్‌లు తవ్వడం వంటి పనుల్లో కంపెనీలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం ఎస్సీ/ఎస్టీ రైతులకు 90%, ఇతర రైతులకు 80% మరియు 5 ఎకరాలు దాటిన వారికి 70% రాయితీపై డ్రిప్ పరికరాలను అందిస్తుందని గుర్తు చేశారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే రైతులు పట్టా పాస్ బుక్, ఆధార్, బ్యాంక్ పాస్ బుక్, 1బి డాకుమెంట్లను సమర్పించాలని తెలిపారు. అనంతరం రంగంపల్లి గ్రామానికి చెందిన రైతు పూదారి చంద్రశేఖర్ 3 ఎకరాలలో డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తున్న గ్రాఫ్టెడ్ కూరగాయల తోటను పరిశీలించి, ఆయనను అభినందించారు. నీటిని పొదుపు చేస్తూ, శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులు సాధించాలని జిల్లాలోని ఇతర రైతులకు సూచించారు.

# భూ సర్వేతో భూ సమస్యలు శాశ్వత పరిష్కారం

- శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 07 ( విజన్ ఆంధ్ర ) : భూ సమస్యల పరిష్కారానికి భూ సర్వే ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మంగళవారం దారూర్ మండలం తరిగోపుల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో చేపడుతున్న గోదాము నిర్మాణానికి శంకుస్థాపన, భూభారతి–భూ సర్వే పై అవగాహన గ్రామ సభ, మోమిన్ కుర్దు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తరిగోపులలో జరిగిన భూ భారతి–భూ సర్వే అవగాహన గ్రామసభలో శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంతో పాటు భూ సమస్యల పరిష్కారానికి భూ సర్వే ప్రక్రియను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. భూ సర్వే ద్వారా భూతగాదాలు పూర్తిగా తగ్గుతాయని ఆయన అన్నారు. గ్రామంలోని పొలాలకు, గ్రామకంఠం, ఇంటి స్థలాలకు భూ సర్వే లో భాగంగా సరిహద్దులను నిర్ణయించడం జరుగుతుందని ఆయన తెలిపారు. రైతులు పండించిన పంటల ధాన్యాన్ని నిలువ చేసుకునేందుకు గోదాముల నిర్మాణాలకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. రైతులకు రైతుబంధుతో పాటు యంత్రాలకు, ఎరువులకు సబ్సిడీపై ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. కోట్ పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి 90 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని, ఇప్పటివరకు 60 కోట్ల పనులు చేపట్టడం జరిగిందని ఆయన తెలిపారు. అదేవిధంగా సర్పన్ పల్లి ప్రాజెక్టుకు 30 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. వికారాబాద్ నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి గాను పంచాయతీరాజ్ రోడ్లకు 300 కోట్లు, ఆర్ అండ్ బి రోడ్లకు 450 కోట్ల రూపాయలను మంజూరు చేయడం జరిగిందని ఈ సందర్భంగా సభాపతి తెలిపారు. అనంతరం మోమిన్ కుర్దు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవాలు గావించి దంపతులకు నూతన వస్త్రాలను స్పీకర్ అందజేశారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటాచారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి మధుసూదన్, తహసిల్దార్ సాజిదా బేగం, పిఎసిఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ భాస్కర్ రెడ్డి, సర్పంచ్ లు అంజలయ్య, నీరటి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ ఓ పి ఎస్ సాధించే వరకు విశ్రమించేదిలేదు

- జిల్లాలో సీపీఎస్ రద్దు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం.
- టీఎస్ సిపి ఎస్ఇయు పేటజిల్లా నూతన అధ్యక్షులు కృపాకర్ రెడ్డి



నారాయణపేట, జూలై 7 ( విజన్ ఆంధ్ర) : ప్రభుత్వం పాత పెన్షన్ ఓపిఎస్ సాధించేవరకు విశ్రమించేది లేదని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ నారాయణపేట జిల్లా అధ్యక్షులు కృపాకర్ రెడ్డిఅన్నారు. మంగళవారంతెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ ( టీఎస్ సిపిఎస్ ఈ యు ) నారాయణ పేట జిల్లా నూతన అధ్యక్షులుగా కృపాకర్ రెడ్డి ని రాష్ట్ర శాఖ ఎన్నిక చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కృపాకర్ రెడ్డి మాట్లాడుతూ, తమపై నమ్మకంతో సీపీఎస్ రద్దు ఉద్యమ బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు స్థితప్రజ్ఞ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వాల శ్రీకాంత్, మరియు రాష్ట్ర కోశాధికారి నరేష్ గౌడ్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. తమకు అప్పగించిన ఈ నూతన బాధ్యతను కేవలం పదవిగా కాకుండా, లక్షలాది మంది సీపీఎస్ ఉద్యోగుల భవిష్యత్తును మార్చే ఒక గురుతర బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. లక్షలాది మంది ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల సామాజిక భద్రతను హరిస్తున్న సీపీఎస్ (సీపీస్ ) విధానాన్ని పూర్తిగా రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఒపీస్ ) పునరుద్ధరించే వరకు మా పోరాటం ఆగదనిపాత పెన్షన్ సాధనే ఏకైక లక్ష్యంగా మా వంతు బాధ్యతను అత్యంత కీలకంగా నిర్వర్తిస్తామని ఆ లక్ష్యం నెరవేరే దాకా విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. జులై 19 న జిల్లాలో జరగనున్న జన జాగరణ యాత్ర కు ఉద్యోగ,ఉపాధ్యాయులందరిని ఏకం చేసి, జన జాగరణ యాత్ర ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తమ ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్క ఉద్యోగ, ఉపాధ్యాయులకు సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రేషన్ బియ్యం కోసం పేదల ఎదురుచూపులు

## జీసీసీ ఉద్యోగి నిర్లక్ష్యం పై గ్రామస్థుల ఆగ్రహం!

ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో/బూర్గంపాడు , జులై 7 (విజన్ ఆంధ్ర): పేదవాడు ఆకలితో అలమటించకూడదని, ప్రతి ఒక్కరికీ తృప్తిగా అన్నం దొరకాలనే సత్సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నాయి. అయితే, ప్రభుత్వ ఆశయాలను తుంగలో తొక్కుతూ కొందరు అధికారులు పేద ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని ఇరవేండి గ్రామంలో సరిగ్గా ఇలాంటి ఘటనే వెలుగుచూసింది. గ్రామంలోని గిరిజన స్టోర్ (జీసీసీ) ఉద్యోగి నిర్లక్ష్య వైఖరి కారణంగా స్థానిక నిరుపేదలు, గిరిజనులు రేషన్ బియ్యం అందకతీవ్రఇబ్బందులు పడుతున్నారు. కూలి పనులు మానుకొని వచ్చినా రేషన్ కోసం తిప్పలు తప్పడం లేదు. నియమ నిబంధనల ప్రకారం ప్రతి నెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు క్రమం తప్పకుండా అర్హులైన లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉంది. అయితే ఇరవేండి జీసీసీ ఉద్యోగి మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రోజువారీ కూలి పనులకు వెళ్తేనే గానీ ఇల్లు గడవని పేద ప్రజలు, తమ పనిని సైతం మానుకొని రేషన్ బియ్యం కోసం స్టోర్ వద్దకు వస్తున్నారు. తీరా అక్కడికి వచ్చాక దుకాణం తీయకపోవడంతో గంటల తరబడి వేచి చూసినిరాశతో వెనుతిరుగుతున్నారు. వింత సమాధానాలతో ప్రజల ఆగ్రహం పెల్లుబికుతోంది. స్టోర్ ముందు ఫంక్షన్ జరుగుతోంది అందుకే ఈరోజు దుకాణం తీయలేదు" అంటూ సదరు జీసీసీ ఉద్యోగి బాధ్యతారాహిత్యంగా, పొంతన లేని సమాధానాలు చెబుతున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను పక్కదారి పట్టిస్తూ, పేదలకు సరుకులు అందకుండా చేస్తున్న ఈ ఉద్యోగి తీరుపై ఇరవేండి గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రెక్కాడితే గానీ డొక్కాడని తమలాంటి పేదలను ఇలా ఇబ్బంది పెట్టడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, ఇరవేండి గిరిజన స్టోర్ ఉద్యోగిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. పేదలకు సక్రమంగా, సమయానికి ఉచిత రేషన్ బియ్యం అందేలా చూడాలని వారు కోరుతున్నారు.



# ఎమ్మెల్యే వీర్లపల్లి తో సహా కాంగ్రెస్ అనుచరులకు 50 కోట్ల ముడుపులు

- దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్
- ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ వ్యతిరేక కమిటీ అధ్యక్షులు సత్యనారాయణ అధ్వర్యంలో షాద్ నగర్ చౌరస్తా లో ధర్నా
- పాల్గొన్న బీజేపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, వంకాయల నారాయణ రెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్



రంగారెడ్డి బ్యూరో, జూలై 07(విజన్ ఆంధ్ర ): షాద్ నగర్ ముఖ్య కూడలి (చౌరస్తా ) లో సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటు కు వ్యతిరేకంగా ఆందోళన, ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా లో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ముఖ్య అతిధి గా పాల్గొని ధర్నా కు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలను పణంగా పెడుతూ డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం మంచి పద్ధతి కాదని దీనివల్ల రైతులు, చుట్టూ ప్రక్క గ్రామాలు, తండాలకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. డంపింగ్ యార్డ్ వద్దని ప్రజలు ఆందోళన చేస్తుంటే ఎమ్మెల్యే గారు వచ్చి ఎట్టి పరిస్థితి లో అక్కడ డంపింగ్ యార్డ్ రాదని హామీ ఇచ్చారని మరి ఇప్పుడు ఏమైంది అని నిలదీశారు. వెంటనే 641 జీవో ను ఆపాలని లేకుంటే రాజీనామా చేయాలనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరియు హరీష్ రెడ్డి లను సిద్దాపూర్ కు తీసుకొని వచ్చి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేస్తామని అన్నారు. బీజేపీ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు నిన్ను ఎన్నుకున్నది మంచి పనులు చేస్తావని కానీ నువ్వు ఇక్కడ చెత్త తీసుకొని వచ్చి చెత్త ఎమ్మెల్యే అయ్యావని అన్నారు. ఈ ఆందోళన ఇక్కడిదాక ఆగదని డంపింగ్ యార్డ్ రద్దయ్యే వరకు కొనసాగుతుందని అన్నారు. డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట కమిటీ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ మా ఊరు, మా మండలం అని ఎమ్మెల్యే గారు అన్నారని మరి ఇప్పుడు ఆ మాటలు ఎక్కడికి పోయాయాని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమం లో మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్, కడెంపల్లి శ్రీనివాస్, దేవేందర్ యాదవ్, కోస్గి శ్రీనివాస్, యుగంధర్, రామకృష్ణ, దినేష్, శివా చారి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటనకు సర్వం సిద్ధం

**ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డితో కలిసి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,**



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): జులై 07 : ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలి, ప్రోటోకాల్, భద్రత, ట్రాఫిక్, పారిశుధ్య ఏర్పాట్లలో ఎలాంటి లోపాలకు తావు ఉండొద్దు, అధికారులకు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాలో చేపట్టనున్న పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అన్నారు. పర్యటన సందర్భంగా నిర్వహించనున్న ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు, ప్రజా కార్యక్రమాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, శాసనమండలి సభ్యులు కూచుకుళ్ల దామోదర్ రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. మొదటగా నాగర్‌కర్నూల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన జిల్లా రవాణా శాఖ (ఆర్టీఓ) కార్యాలయ భవనాన్ని సందర్శించిన కలెక్టర్, ప్రారంభోత్సవ కార్యక్రమానికి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమ వేదిక, అతిథుల కూర్చునే ఏర్పాట్లు, పార్కింగ్, తాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, మీడియా ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు, ప్రజల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అనంతరం నాగర్‌కర్నూల్ పట్టణంలో నూతనంగా నిర్మించనున్న ఆర్టీసీ బస్ స్టాండ్ నిర్మాణానికి శంకుస్థాపన జరిగే స్థలాన్ని పరిశీలించారు. శంకుస్థాపన కార్యక్రమం నిరాటంకంగా జరిగేలా స్థలాన్ని పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని, ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. బుధవారం నాగర్ కర్నూల్ జిల్లాలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటనలో ఎలాంటి చిన్నపాటి లోపం కూడా జరగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమాల నిర్వహణలో ప్రభుత్వ ప్రోటోకాల్ నిబంధనలను ఖచ్చితంగా పాటించడంతో పాటు ప్రతి అంశాన్ని ముందుగానే పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని పటిష్టమైన భద్రతా బందోబస్తు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని, కార్యక్రమ ప్రాంగణాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని వసతులు కల్పించాలని సూచించారు. పర్యటన సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ నూతన జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని ప్రారంభించడంతో పాటు, నాగర్‌కర్నూల్‌లో నూతన ఆర్టీసీ బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఆయా కార్యక్రమాలువిజయవంతంగా జరిగేలా జిల్లా యంత్రాంగం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి ఇమ్రాన్ మహమ్మద్, నాగర్ కర్నూల్ డిఎం యాదగిరి,అధికారులు, రవాణా శాఖ అధికారులు, టీజీఎస్ఆర్టీసీ అధికారులు, రోడ్లుభవనాల శాఖ ఇంజినీర్లు, పోలీసు అధికారులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఏన్యూమరేషన్ పత్రాలు పూరించడంలో జాగ్రత్తలు వహించండి

- పత్రాలపై 3వ వార్డులో అవగాహన కల్పించిన ఆర్డిఓ



నారాయణపేట, జూలై 7 (విజన్ ఆంధ్ర) : ఎన్యూమరేషన్ పత్రాలు పూరించడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని నారాయణపేట ఆర్డిఓ ఎల్. రమేష్ పేర్కొన్నారు. స్థానిక మూడో వార్డు కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ ఆధ్వర్యంలో శ్రీనగర్ కాలనీలో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ శంకర్ తో కలసి ఆర్డిఓ ఎల్. రమేష్ ముఖ్యఅతిథిగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను ధృవీకరించనున్నట్లు ఆయన తెలిపారు. సర్వే కోసం ఇంటికి వచ్చిన బిఎల్ఓ లకు ఓటర్లు సహకరించాలని ఆయన కోరారు. జులై 31 న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని, ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరిస్తారని, ఆ తర్వాత సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలను పరిష్కరించి అక్టోబర్ 1 న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు ఆయన వివరించారు. బీ ఎల్ వో లు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్నారని, కొత్త ఓటర్ల నమోదు కోసం ఫామ్ –6 అందజేస్తున్నారని, ఆయా పత్రాలను ఓటర్లు పూరించి మళ్ళీ బీఎల్ వో లకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు నింపి బీఎల్ వో లకు ఇస్తేనే ఓటరు జాబితాలో ఉంటారని, ఇవ్వకపోతే ఓటరు జాబితాలో ఉండరని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ తమ బూత్ స్థాయి ఏజెంట్లు బి ఎల్ వో లకు సహకరించే విధంగా చూడాలని ఆయన సూచించారు. వారానికి ఒకసారి నిర్వహించే సమావేశానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ కు సంబంధించి అనుమానాలను నివృత్తి చేసేందుకు హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయ్యాక అన్ మ్యాపింగ్ కేసుల విచారణ జరుగుతుందన్నారు. అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించబడదని కంగారు పడాల్సిన అవసరం లేదని, తీసుకున్న ఎన్యూమరేషన్ పత్రాలను కచ్చితంగా పూరించి ఇవ్వాలన్నారు. ఇవ్వకపోతే మాత్రం ఓటరు జాబితాలో వాళ్ళ పేర్లు ఉండవు అని ఆయన స్పష్టం చేశారు. అనంతరం కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ మాట్లాడుతూ వార్డులో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగే విధంగా చర్యలు తీసుకుంటానని ఓటు హక్కు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆమె అన్నారు. అంతేకాక ప్రభుత్వం ప్రకటించిన ప్రతి ఒక్క పథకాన్ని నిరుపేదకు అందే విధంగా కృషి చేస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అశోక్, బి ఎల్ ఓ అంబికా ,సుజాత లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల జీవితాల్లో వెలుగును నింపిన మాదిగల ప్రత్యక్ష దైవం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ..



సూర్యాపేట జూలై 07:(విజన్ ఆంధ్ర) : మాదిగల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అనీ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి జిల్లా ఇన్చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ, ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజయ్యమాదిగ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్సిపాలిటీ ఆఫీసు వద్ద ఎం ఆర్ పి ఎస్, ఎం ఎస్ పి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో 32వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సామాజిక పరివర్తకుడు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సందర్భంగా మాట్లాడుతూ ఈ సమాజంలో కుల వ్యవస్థకు గురవుతూ అనేక అవమానాలు ఎదుర్కొన్నటువంటి ఎస్సీ 59 ఉపకులాల్లో రాజ్యాంగ ఫలాలు సమానంగా అందట్లేవని మహాజననేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 1994 జులై 7 తారీఖున ప్రకాశం జిల్లా ఈదుముడి 20 మంది యువకులతో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఏర్పాటు చేసి నేటికీ 32 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ఈ ఉద్యమం ద్వారా ఎస్సీ 59 ఉపకులాలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక ,సామాజిక ,రాజకీయ రంగాల్లో సమాన వాటా రావాలని మందకృష్ణ మాదిగ నాయకత్వంలో అలుపెరుగని పోరాటం చేసి వర్గీకరణ ఫలితాలు అనుభవించటం జరుగుతుందన్నారు. ఎమ్మార్పీఎస్ సంస్థ ద్వారా మానవ హక్కుల కోసం, ఆరోగ్యశ్రీ పథకం మహిళల ఆత్మగౌరవం కోసం ఎస్సీ ఎస్టీ ఉద్యోగాల్లో ప్రమోషన్ల రిజర్వేషన్ కోసం, ముస్లింల ఆత్మగౌరవ మహా ప్రదర్శన ,ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కోసం, తెల్ల రేషన్ కార్డుల కోట పెంపు కోసం తెలంగాణ అమరవీరుల కోసం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం, భారత రాజ్యాంగ పరిరక్షణ ఇలా చెప్పుకుంటూ పోతే అనేక పోరాటాలు అనేక ఫలితాలు సాధించిన చరిత్ర పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వం సాధించామన్నారు. అదేవిధంగా ఈ సందర్భంగా చీకటి బ్రతుకులకు వెలుగులు నింపిన మాదిగల ప్రత్యక్ష దైవం మహాజన మార్గదర్శి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ, ఎం ఈ ఎఫ్ రాష్ట్ర కోశాధికారి చింత జాన్ విల్సన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు బోడ శ్రీరాములు మాదిగ ,ములకలపల్లి మల్లేష్ మాదిగ, బొడ్డు విజయ్ కుమార్ మాదిగ, వి హెచ్ పి ఎస్ నాయకులు చింత సతీష్ మాదిగ, కుర్రి నాగయ్య మాదిగ , ఎం ఈ ఎఫ్ జిల్లా కార్యదర్శి లింగన్న మాదిగ, బరిపాటి ప్రభాకర్ మాదిగ ఉద్యోగస్తుల నాయకురాలు దార జ్యోతి, గుద్దేటి శారద, నాయకులు చెరుకుపల్లి సతీష్ మాదిగ, చెరుకుపల్లి కిరణ్ కుమార్ మాదిగ, మొండికత్తి గోపీచంద్ మాదిగ, మనోజ్ కుమార్ మాదిగ, మాదిగ కళానేత కొంగర సైదులు మాదిగ ,నాయకులు బాష్పంగు వీరస్వామి మాదిగ, చింత వెంకన్న మాదిగ నాగయ్య మాదిగ, బొజ్జ రమేష్ మాదిగ డేవిడ్ కుమార్ మాదిగ, పాముల మల్లేష్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

# మైసయ్యనగర్‌లో వరదనీటి నివారణ చర్యలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై07(విజన్ ఆంధ్ర); ఖిలా వరంగల్ ప్రాంతంలోని మైసయ్యనగర్‌లో వరదనీటి నిల్వ సమస్య నివారణకు చేపడుతున్న చర్యలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్, వర్షపు నీరు వేగంగా వెళ్లేలా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, నీరు నిల్వ కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. ఈ పరిశీలన లో వరంగల్ ఆర్డీవో సుమ, జి డబ్ల్యు ఎం సి ఇ ఇ సంజయ్ , ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 07,(విజన్ ఆంధ్ర ) : ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం లక్షెట్టిపేట పట్టణం, దండేపల్లి మండలంలోని మేదరిపేట గ్రామపంచాయతీ కార్యాలయం లలో ఏర్పాటు చేసిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం హెల్ప్ డెస్క్ లను సందర్శించి బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజ్ ప్రక్రియ వేగవంతం చేసి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు

## తహసీల్దార్ లతో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ )రాములు సమీక్ష సమావేశం

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 07,(విజన్ ఆంధ్ర ) : మంచిర్యాల జిల్లా లోని దండేపల్లి, లక్షెట్టిపేట, జన్నారం మండలాల తహసిల్దార్ కార్యాలయాలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) వి. రాములు మంగళవారం బి సెక్షన్ సూపరింటెండెంట్ తో కలిసి సందర్శించి సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, భూ సేకరణ సంబంధిత అంశాలపై కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సాదా బైనమా దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి భూభారతి పోర్టల్ ను అందుబాటులోకి తీసుకువచ్చి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, విరాసత్ ఇతర సేవలను, భూ సంబంధిత సర్వీసులను నిబంధనల ప్రకారం వేగవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పరిష్కరణ వేగవంతం చేయాలని తెలిపారు. భూ సేకరణ ప్రక్రియలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, కార్యాలయానికి వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని, సర్టిఫికెట్లను నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా జారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహశీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి..!

**- బీసీ జాతీయ జనసేన డిమాండ్**



రంగారెడ్డి బ్యూరో, జూలై 07(విజన్ ఆంధ్ర ): రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చుతున్నాయనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రతి విద్యా సంవత్సరంలో ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ మధ్యతరగతి, పేద కుటుంబాలపై భారీ ఆర్థిక భారం మోపుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యూషన్ ఫీజులతో పాటు అడ్మిషన్ ఫీజు, డెవలప్‌మెంట్ ఫీజు, ల్యాబ్ ఫీజు, యాక్టివిటీ ఫీజు, ట్రాన్స్‌పోర్ట్ ఫీజు వంటి వివిధ పేర్లతో అదనపు రుసుములు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు, షూస్, బెల్ట్, టై వంటి వస్తువులను విద్యాసంస్థల నుంచే కొనుగోలు చేయాలని ఒత్తిడి తీసుకొచ్చి, అధిక ధరలకు విక్రయిస్తున్నారని పలువురు తల్లిదండ్రులు చెబుతున్నారు. విద్యాసంస్థల ప్రాంగణాల్లోనే ఈ తరహా వ్యాపార కార్యకలాపాలు జరుగుతున్నప్పటికీ, వాటిపై సమర్థవంతమైన పర్యవేక్షణ అవసరమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేయడం, విద్యార్థులు తప్పనిసరిగా నిర్దిష్ట దుకాణాలు లేదా పాఠశాలల నుంచే వస్తువులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయడం వంటి అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, విద్యాశాఖ ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి. అలాగే ఫీజుల నియంత్రణకు పారదర్శక వ్యవస్థను అమలు చేసి, ప్రతి విద్యార్థికి అందుబాటులో విద్యను అందించేలా చర్యలు చేపట్టాలని జాతీయ బీసీ జనసేన జాతీయ అధ్యక్షులు కత్తి చంద్రశేఖర్ అప్ప కోరారు.

## టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జేబీ. శ్రీనివాస్ ను కలసిన భూమన ముఖ్య అనుచరుడు



తిరుపతి, జులై 7 : తెలుగుదేశం పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులైన జేబీ శ్రీనివాస్ ను మంగళవారం వైసిపి మాజీ ఎమ్మెల్యే, టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్య అనుచరుడు, వైసీపీ ఎస్సీ సెల్ నేత రాజేంద్ర గజ పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో జేబీ శ్రీనివాస్ రాజకీయంగా తెలుగుదేశం పార్టీలో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని రాజేంద్ర ఆకాంక్షించారు. వైసీపీ నేత రాజేంద్ర టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జేబీ శ్రీనివాస్ ను కలవడంతో త్వరలో రాజేంద్ర తెలుగుదేశం పార్టీలో చేరడం ఖాయమని టిడిపి నేతలు చెబుతున్నారు. తిరుపతిలో వైసీపీ నేతలు, కార్యకర్తలు టిడిపిలో జేబీ సమక్షంలో టిడిపిలో చేరేందుకు క్యూ కట్టడం ఖాయమని స్థానికంగా ఉండే కూటమి నేతలు చెబుతున్నారు.

## చంద్రగిరి ఎమ్మెల్యే ని కలసిన జేబీ శ్రీనివాస్



తిరుపతి, జులై 7 : తెలుగుదేశం పార్టీ తిరుపతి నియోజకవర్గం ఇన్చార్జిగా నియమితులైన జేబీ శ్రీనివాస్ మంగళవారం చిత్తూరులో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన తనయుడు పులివర్తి వినీల్ ను జేబీ శ్రీనివాస్ శాలువలు వేసి సత్కరించారు. తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలలో తెలుగుదేశం పార్టీ స్థానిక రాజకీయాలపై కొద్దిసేపు ఇద్దరు ఏకాంతంగా చర్చించుకున్నారు. జేబీ శ్రీనివాస్ తో పాటు శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్, టీడీపీ యూనిట్ ఇంచార్జ్ లు మాచర్ల రఘురామ్, జగదీష్, రాజేష్, కాలేషా లు ఉన్నారు.

# పనితీరే ప్రమాణం- క్షేత్రస్థాయి తనిఖీలతో సత్తా చాటుతున్న కలెక్టర్...

**- ప్రజా సేవకే ప్రాధాన్యం - నాణ్యతతో కూడిన పాలన అందిస్తున్న హేమంత్ కేశవ్ పాటిల్...**

**- జిల్లాలో కొత్త జోష్ - కలెక్టర్ పనితీరుపై ప్రజల హర్షం...**

**- పనితీరే ప్రమాణం" అంటూ 3 నెలల్లోనే జిల్లా పాలనలో స్పష్టమైన మార్పు..**



వెల్దండలో బీసీ హాస్టల్ ను సందర్శిస్తున్న జిల్లా కలెక్టర్ (ఫైల్ ఫోటో)

ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రతినిధి, జులై 08 (విజన్ ఆంధ్ర):
ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందాలంటే ముందుగా వ్యవస్థలో క్రమశిక్షణ ఉండాలనే సూత్రంతో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ డా. హేమంత్ కేశవ్ పాటిల్ ముందుకు సాగుతున్నారు. బాధ్యతలు చేపట్టిన 3 నెలల వ్యవధిలోనే ఆయన తీసుకున్న నిర్ణయాలు, క్షేత్రస్థాయి తనిఖీలు జిల్లా యంత్రాంగంలో స్పష్టమైన మార్పు తీసుకొచ్చాయి.

### అనుభవజ్ఞుడైన అధికారి.. జిల్లాకు కొత్త ఉత్సాహం

ఏప్రిల్ 26వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లాకు 09వ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హేమంత్ కేశవ్ పాటిల్. బాధ్యతలు చేపట్టడానికి ముందు ఆయన లిహైదరాబాద్ జీహెచ్ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గాలి సుదీర్ఘ కాలం పని చేసిన అనుభవం ఉంది. పట్టణ, గ్రామీణ పాలన రెండింటిపై అవగాహన ఉన్న అధికారిగా ఆయనకు పేరుంది.



బాధ్యతలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ (ఫైల్ ఫోటో)

### "ఫీల్డ్‌లో ఉండండీ.. కార్యాలయంలో కాదు"

బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచే కలెక్టర్ అధికారుల పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. "ప్రజా సమస్యల పరిష్కారం కార్యాలయాల్లో కాదు, క్షేత్రస్థాయిలో ఉంటుంది" అనే నినాదంతో జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు ప్రారంభించారు. గ్రామ కార్యదర్శి కార్యాలయం నుంచి మండల కేంద్రం, ఆసుపత్రి నుంచి పాఠశాల, రోడ్ల నిర్మాణం నుంచి ఇందిరమ్మ ఇళ్ల వరకు ఆయన స్వయంగా వెళ్లి పరిశీలిస్తున్నారు. ఈ ఆకస్మిక తనిఖీలతో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాల్సిన అవసరం ఏర్పడింది.

### పనితీరుపై కఠిన నిర్ణయాలు

గత లిమూడు నెలల్లో జిల్లాలో అవినీతి ఆరోపణలు, నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తించినట్లు గుర్తించిన దాదాపు 10 మంది అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. సస్పెన్షన్, షోకాజ్ నోటీసులు, బదిలీల వంటి చర్యల ద్వారా "పని చేయని వారికి చోటు లేదు"లి అనే స్పష్టమైన సంకేతం ఇచ్చారు. దీంతో జిల్లా యంత్రాంగంలో పనిభారం పెరిగినా, బాధ్యత కూడా పెరిగింది. ఫైళ్లు పెండింగ్ పెట్టే ధోరణి తగ్గి, ప్రజల దరఖాస్తుల పరిష్కారం వేగవంతమైంది. అభివృద్ధి, సంక్షేమంలో నాణ్యతకు ప్రాధన్యంగా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ప్రధాన దృష్టి సారించారు.



కల్వకుర్తిలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్... (ఫైల్ ఫోటో )

### ప్రభుత్వం చేపట్టే ప్రతి పనిలో నాణ్యత

– రోడ్లు, వంతెనలు, పాఠశాల భవనాల నిర్మాణంలో స్పెసిఫికేషన్లు పాటించాలని ఆదేశం.

– ఇందిరమ్మ ఇళ్లు, రేషన్, పెన్షన్ల వంటి లిసంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికీ వివక్ష లేకుండా అందాలనిలి ఆయన సూచించారు.

– ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును స్వయంగా పర్యవేక్షిస్తూ, పరిష్కారానికి గడువులు నిర్ణయిస్తున్నారు.

### ప్రజల నుంచి సానుకూల స్పందన

జిల్లా కలెక్టర్ ప్రజలతో నేరుగా మాట్లాడటం, సమస్యలను అడిగి తెలుసుకోవడం వల్ల ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరిగింది. "కలెక్టర్ వచ్చిన తర్వాత అధికారులు ఫోన్ ఎత్తి మాట్లాడుతున్నారు, పనులు వేగంగా జరుగుతున్నాయి" అనేది పలు గ్రామాల ప్రజల మాట. అధికారుల్లో ఒకవైపు క్రమశిక్షణ, మరోవైపు ప్రజలకు భరోసా కల్పిస్తూ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ జిల్లాను ముందుకు నడిపిస్తున్నారు. పారదర్శకత, జవాబుదారీతనం, నిబద్ధత అనే మూడు సూత్రాలను ఆయుధాలుగా చేసుకుని జిల్లా కలెక్టర్ పని చేస్తున్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు చివరి వ్యక్తికి చేరేలా చూడడమే తన లక్ష్యం అని ఆయన పలుమార్లు స్పష్టం చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా అభివృద్ధిలో కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పనితీరు ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతోందని ప్రజలు ఆశిస్తున్నారు....

# ప్రపంచ ముఖచిత్రంలో హైదరాబాద్ మహానగర కీర్తి

**- తూర్పు శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వ శ్రీకారం:ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**

**- తొర్రూర్ గ్రామంలో రూ.338 కోట్ల భారీ వ్యయంతో నాలుగు వరుసల రహదారి విస్తరణ**

**- శంకుస్థాపన మహోత్సవంలో తెలంగాణ రోడ్డు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**





రంగారెడ్డి జిల్లా బ్యూరో/అబ్దుల్లాపూర్ మెట్ జూలై 07 (విజన్ ఆంధ్ర): ప్రపంచ ముఖచిత్రంలో తెలంగాణ రాష్ట్రానికి మణిహారంగా ఉన్నటువంటి మహానగరం హైదరాబాద్ నలు దిక్కుల అభివృద్ధిలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులతో అభివృద్ధి శ్రీకారం చుట్టిందని, హైదరాబాద్ మహానగర కీర్తిని పెంపొందించడానికి కృతనిచ్చేయంతో ముందుకు సాగుతున్నామని తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్ మెట్టు మండలం తొర్రూర్ గ్రామంలో రూ. 338 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులకు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు సామల కిరణ్ కుమార్ రెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్, టీజీ ఆర్డిసి చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి తదితర ప్రముఖులతో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. హైదరాబాద్ తూర్పు శివారు ప్రాంతాల రవాణా ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసి, ప్రగతి రథచక్రాలకు వేగం పెంచేలా ఒక బృహత్తర ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టుకుందన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలో గత ప్రభుత్వంలో అభివృద్ధి ఊసే లేదన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆశీస్సులతో మళ్లీ మేమే ప్రగతి పథంలో తెలంగాణ రాష్ట్రం మా లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. రోడ్ల విస్తరణ, మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, ఇందుకోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో రహదారుల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, గుంతలమయమైన రోడ్ల వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల పునర్నిర్మాణ పనులను వేగవంతం చేశామని, మొదటి విడతలో భాగంగా హయాత్‌నగర్, తొర్రూర్, కోహెడ, అనాజ్‌పూర్ రోడ్డు. అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్, బండరావిర్యాల స్ట్రెచ్, సాగర్ రోడ్డు, ఇంజాపూర్, తొర్రూర్, బ్రాహ్మణపల్లి, రాగన్నగూడ కారిడార్, సాగర్ రోడ్డు, ఇంజాపూర్, హయాత్‌నగర్ రోడ్డు నాలుగు లైన్ల విస్తరణతో ఈ ప్రాంతం అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని మంత్రి పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ప్రాంత ప్రజలు అభివృద్ధి అంశంలో ఎప్పుడు వచ్చినా తప్పకుండా మీ అందరికీ అందుబాటులో ఉంటూ మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని అన్నారు. రాష్ట్రంలో ఎన్నికలకు అసెంబ్లీ ఎన్నికలకు 25 నెలలో ఉందన్నారు. చేసిన అభివృద్ధితోనే ప్రజా ఆశీర్వాదం తోడై మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. 10 ఏళ్లపాటు పాలించి వాళ్ళ ఆస్తులను కూడ పెట్టుకోవడంలో ఉన్న ఉత్సాహం నమ్ముకున్న ప్రజలకు న్యాయం చేద్దామని సంకల్పం ఏ కోషణ లేక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని గత ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో జలయజ్ఞం ద్వారా కొన్ని ప్రాజెక్టులను పూర్తి చేసినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ప్రజలతో చాలా అనుబంధాలు ఉన్నాయన్నారు. అనుబంధంతోనే ఈ నియోజకవర్గాన్ని రూ. 338 కోట్లతో అభివృద్ధి కోసం వీధులు కేటాయించినట్లు తెలిపారు. మరో రూ. 110 కోట్లతో మండల పరిధి పెద్ద అంబర్ పేట్ నుంచి అనాజ్ పూర్, అనాజ్ పూర్ నుంచి గువ్వలేటి వరకు నాలుగు లైన్ల రోడ్ల కోసం విధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.... అభివృద్ధి పట్ల అవగాహన ఉన్న ముఖ్యమంత్రి వలనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇబ్రహీంపట్నం ప్రాంతాన్ని అభివృద్ధికి ఆమడదూరంలో ఉంచి, తెలంగాణ ప్రజల ఆస్తులను దోచుకున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమం కోసం ప్రజల ఆకాంక్షను నెరవేర్చే విధంగా ఇబ్రహీంపట్నం ప్రాంతాన్ని నలదిక్కుల అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుంది అన్నారు. అనంతరం ఎంపీలు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, రాష్ట్ర అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ కురుమ, యువ నాయకులు అభిషేక్ రెడ్డి, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, బాటసింగారం సహకార సంఘం అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ సిహెచ్ భాస్కరాచారి,తొర్రూరు డివిజన్ అధ్యక్షులు కోశిక ఐలయ్య కురుమ, తుర్కయంజాల్ డివిజన్ అధ్యక్షులు ఓర్సు శ్రీనివాస్, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయక్ సీనియర్ నాయకులు కొత్త శివకుమార్, పెద్ద అంబర్ పేట్ డివిజన్ అధ్యక్షులు పండుగల రాజు, మర్రి నిరంజన్ రెడ్డి, భూపతిగల్లా మహిపాల్, వంగేటి గోపాల్ రెడ్డి, గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, కొంతం వెంకట్ రెడ్డి, కాకుమాను సునీల్, మేతరి దర్శన్, నక్క శివలింగం, శేఖర్ గౌడ్ వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దుగ్గొండి మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై07(విజన్ ఆంధ్ర); భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మంగళవారం దుగ్గొండి మండలంలోని లక్ష్మీపురం, దుగ్గొండి, గోపాలపురం గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటరు వివరాల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను పరిశీలించి, బీఎల్‌వోలు నిర్వహిస్తున్న పనితీరుపై ఆరా తీశారు. ఎస్ఐఆర్






ప్రక్రియను భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి, ఓటరు జాబితా శుద్ధి ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, ఇంటింటి సర్వేను సమర్థవంతంగా పూర్తి చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. ఎస్ ఐ ఆర్ పరిశీలనలో వచ్చిన రైతులతో గ్రామ పరిస్థితి పంటల విస్తీర్ణం ఏఏ పంటలు వేస్తున్నారు ప్రస్తుత వాతావరణ పరిస్తితులకు అనుగుణంగా తక్కువ నీటి వినియోగం ద్వారా పండించే పంటల కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ పరిశీలనలో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి దుగ్గొండి తాసిల్దార్ సమ్మక్క , నర్సంపేట తహసిల్దార్ రవిచంద్ర రెడ్డి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## అనూష కుటుంబానికి న్యాయం చేయాలి

**- మాజీ ఎమ్మెల్యే విజయమ్మ**



బద్వేలు, జూలై 7 (విజన్ ఆంధ్ర) :కోడూరు మండలంలోని ఐత్రంపేట గ్రామానికి చెందిన వివాహిత మహిళ అనూష ఆత్మహత్య ఘటనపై మాజీ ఎమ్మెల్యే కె. విజయమ్మ స్పందించారు. పోరుమామిళ్ల, బద్వేలు ప్రధాన రహదారి మార్గమధ్యలో బాధిత కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న ఆందోళనను తెలుసుకొని ఆమె వెంటనే అక్కడికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారితో మాట్లాడి వారికి ధైర్యం చెప్పడం జరిగింది ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి పూర్తి స్థాయిలో న్యాయం జరగాలని ఆమె అధికారులను కోరారు. అనంతరం మైదుకూరు డీఎస్పీతో మాట్లాడి, అనూష ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా బాధిత కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ హామీ ఇచ్చారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.